RNI.No. APTEL/2014/57702 Estd.: 2000 www.voodayam.com /voodayam /Voodayam




# వుదయం

Simultaneously published from Guntur, Hyderabad, Adilabad, Khammam, Karimnagar & Warangal




సంపుటి : 10 | సంచిక : 159 | గుంటూరు | బుధవారం, నవంబర్ 20, 2024 | VOODAYAM Telugu Daily | వెల : రూ. 1.00 | పేజీలు : 12

# ఏపీ మీదుగా అయోధ్యకు ప్రత్యేక రైలు

- ఏపీలో రైలు ప్రయాణికులకు అలర్ట్
- అయోధ్యకు భారత్ గౌరవ్ రైలు ఏర్పాటు
- ఏపీ మీదుగానే ఈ ప్రత్యేక రైలు వెళుతుంది
- పుణ్యక్షేత్రాలకు ఐఆర్‌సీటీసీ ప్రత్యేక రైలు




ఆంధ్రప్రదేశ్‌లో రైలు ప్రయాణికులకు ముఖ్య గమనిక. అయోధ్య, కాశీ తదితర పుణ్య క్షేత్రాల సందర్శనార్థం వెళ్లే యాత్రికుల కోసం ప్రత్యేక రైలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఐఆర్‌సీటీసీ భారత్ గౌరవ్ ప్రత్యేక రైలును నడుపుతోంది. ఈ టూర్ ప్యాకేజీలో మొత్తం 9 రాత్రులు, 10 పగటి వేళలు ఉన్నాయి. ఈ భారత్ గౌరవ్ రైలు డిసెంబరు 11న సికింద్రాబాద్‌లో బయల్దేరుతుంది.. పుణ్యక్షేత్రాల దర్శనం తర్వాత 20న తిరుగు ప్రయాణమవుతుంది. ఈ రైలు తెలుగు రాష్ట్రాల్లోని ఈ స్టేషన్‌లలో ఆగుతుంది.. సికింద్రాబాద్‌లో ఈ రైలు ప్రారంభమై.. కాజీపేట, ఖమ్మం, విజయవాడ, ఏలూరు, రాజమహేంద్రవరం, సామర్లకోట, విశాఖపట్నం (పెందుర్తి), విజయనగరం రైల్వే స్టేషన్‌ల మీదుగా ఒడిశాకు వెళుతుంది. అక్కడి నుంచి పుణ్యక్షేత్రాల సందర్శన ప్రారంభమవుతుంది. ఈ రైలు ప్యాకేజీలో.. విజయవాడ, రాజమహేంద్రవరం, సామర్లకోట, తుని మీదుగా పూరిలోని జగన్నాథ ఆలయం, గయలో విష్ణుపాద ఆలయం, కాశీ విశాలాక్షి, వారణాశిలో కాశీ విశ్వనాథ ఆలయం, అన్నపూర్ణాదేవి, సాయంత్రం గంగా హారతి ఉంది. అలాగే అయోధ్యలో సరయు నది దగ్గర రామజన్మభూమి, హనుమాన్ గర్హి, ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణి సంగమం వంటి ప్రాంతాలను సందర్శించొచ్చు. ఈ ప్యాకేజీలో టీ, టిఫిన్, భోజనం, రవాణా, ప్రమాద బీమా అన్ని పన్నులతో సహా కలిపి టికెట్ ధర ఒక్కొక్కరికీ స్లీపర్ క్లాస్ రూ.16,800, థర్డ్ ఏసీలో రూ.26,650, సెకెండ్ ఏసీలో రూ.34,910 ఉంటుందని తెలిపారు. ఈ టూర్‌కు వెళ్లానుకునే యాత్రికులు.. టికెట్ల బుకింగ్ ఇతర వివరాలకు 9281495848, 8977314121 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మరోవైపు రైల్వేశాఖ మరో కీలక నిర్ణయం తీసుకుంది. దక్షిణ మధ్య రైల్వే, తూర్పు కోస్తా రైల్వే పరిధిలో నడుస్తున్న 10 రైళ్ల నంబర్లను మార్చారు. సాధారణ నిర్వహణ కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు. మార్పు చేసిన రైళ్ల నంబర్లు మార్చి ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తాయని అధికారులు చెప్పారు. విశాఖపట్నం-కడప (17488/17487) తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు కొత్తగా 18521/18522 నంబర్లను కేటాయించారు. విశాఖపట్నం- గుంటూరు (22701/22702) నంబర్లతో నడిచే ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌కు కొత్తగా 22875/22876 నంబర్లను ఇచ్చారు. భువనేశ్వర్-రామేశ్వరం (20896/20895) నంబర్లతో నడిచే వీక్లీ ఎక్స్‌ప్రెస్?కు కొత్తగా 20895/20896 నంబర్లు కేటాయించారు. భువనేశ్వర్-పుదుచ్చేరి (12898/12897) నంబర్లతో నడిచే ఎక్స్‌ప్రెస్‌కు 12897/12898, భువనేశ్వర్- చెన్నై సెంట్రల్ 12830/12829 ఎక్స్‌ప్రెస్‌కు కొత్తగా 12829/12830 నంబర్లను కేటాయించారు అధికారులు.




# ఏపీలో అక్కడ ఉచిత బస్సు సౌకర్యం.

- విజయవాడ దుర్గ గుడి ఘాట్ రోడ్డు మూసివేత
- మూడు రోజుల పాటు ఘాట్ రోడ్డు క్లోజ్
- కొండ రక్షణ చర్యల్లో భాగంగా ఆంక్షలు

విజయవాడ దుర్గ గుడి ఘాట్ రోడ్డును అధికారులు మూసివేయనున్నారు. దుర్గ గుడి ఘాట్ రోడ్డును మంగళవారం (నవంబర్ 19) సాయంత్రం నుంచి మూడు రోజుల పాటు మూసివేయనున్నారు. కొండ రక్షణ చర్యల్లో భాగంగా మూడు రోజుల పాటు దుర్గ గుడి ఘాట్ రోడ్డు మూసివేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. నవంబర్ 19 సాయంత్రం నుంచి నవంబర్ 22 వరకూ ఘాట్ రోడ్డులో రాకపోకలపై ఆంక్షలు ఉంటాయని తెలిపారు. ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులు కనకదుర్గానగర్ మీదుగా రావాలని అధికారులు సూచించారు. సామాన్య భక్తులు, వీఐపీలు, సిబ్బంది ఈ మార్గంలోనే రావాలని విజయవాడ దుర్గ గుడి ఈవో విజ్ఞప్తి చేశారు. మరోవైపు వినాయకగుడి, స్నానాల రేవు నుంచి కనకదుర్గానగర్ వరకూ ఉచితంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు విజయవాడ కనకదుర్గ గుడి ఈవో కేఎస్ రామారావు వెల్లడించారు. దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులు ఈ మార్పులను గమనించాలని కోరారు. మరోవైపు విజయవాడ ఘాట్ రోడ్డులో అప్పుడప్పుడూ కొండచరియలు విరిగిపడి ప్రమాదాలు జరుగుతుంటాయి. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా నివారించాలనే ఉద్దేశంతోనే అధికారులు కొండరక్షణ చర్యలు చేపడుతున్నారు. మూడు రోజుల పాటు ఈ పనులు జరగనున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఘాట్ రోడ్డులో రాకపోకలపై ఆంక్షలు విధించారు.

కనకదుర్గమ్మను దర్శించుకున్న శృంగేరీ శారదా పీఠం అధిపతి

మరోవైపు ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గా మల్లేశ్వరస్వామిని శ్రీ శృంగేరి శారదా పీఠాధిపతి శంకరాచార్య విధుశేఖర భారతి స్వామీజీ దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన శృంగేరీ పీఠాధిపతికి దుర్గ గుడి ఈవో కేఎస్ రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత మహా మండపంలోని కళా వేదిక వద్ద భక్తులకు స్వామీజీ అనుగ్రహ భాషణం చేశారు. మరోవైపు కార్తీక మాసం సందర్భంగా దుర్గ గుడికి భక్తులు రద్దీ పెరిగింది. తెల్లవారుజాము నుంచే కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తుల కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేశారు.

# వైఎస్ అవినాష్ రెడ్డికి సుప్రీం కోర్టు నోటీసులు

- అవినాష్ బెయిల్ రద్దు చేయాలని సునీత పిటిషన్
- విచారణ జరిపిన సీజేఐ సంజీవ్ ఖన్నా ధర్మాసనం





మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప వైఎస్సార్‌సీపీ ఎంపీ అవినాష్ రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు వైఎస్ అవినాష్ రెడ్డికి మంజూరు చేసిన బెయిల్ రద్దు చేయాలంటూ.. వైఎస్ సునీతా రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా మారిన వ్యక్తిని.. శివశంకర్‌రెడ్డి కుమారుడు చైతన్యరెడ్డి బెదిరించారని.. వివేకా కుమార్తె సునీత తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా సుప్రీం కోర్టు ధర్మాసనానికి తెలిపారు. ఒక ప్రైవేటు డాక్టర్‌గా ఉన్న వ్యక్తి జైలుకు వెళ్లి సాక్షులను ప్రభావితం చేయడానికి ప్రయత్నించారని కోర్టుకు వివరించారు. డాక్టర్ చైతన్య రెడ్డి జైలుకు రెగ్యులర్‌గా వెళ్లే వారా, కాదా అని సీజేఐ ధర్మాసనం ఆరా తీయగా..డాక్టర్ చైతన్య జైలు నిబంధనలకు విరుద్ధంగా వెళ్లారని.. ఆయన రెగ్యులర్‌గా వైద్య పరీక్షలు నిర్వహించే డాక్టర్ కాదని లూథ్రా కోర్టుకు తెలిపారు. అలాగే ఈ కేసులో డాక్టర్ చైతన్య, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రతివాదులుగా చేర్చాలన్న లూథ్రా ధర్మసనాన్ని కోరారు. వివేకా హత్య కేసులో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి 8వ నిందితుడిగా ఉన్నారని.. దర్యాప్తులో కీలకమైన వ్యక్తి అని కోర్టుకు వివరించారు. అయితే ధర్మాసనం ఈ వాదనల్ని పరిగణలోకి తీసుకుని డాక్టర్ చైతన్య, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రతివాదులుగా చేర్చడానికి అంగీకరించింది.

అలాగే ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, శివశంకర్‌రెడ్డి కుమారుడు చైతన్య రెడ్డికి నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణ మార్చి 3కు వాయిదా వేసింది సుప్రీం కోర్టు. మరోవైపు సుప్రీం కోర్టులో సునీత, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డి, సీబీఐ ఎస్పీ రాంసింగ్ దాఖలు చేసిన పిటిషన్‌పైనా విచారణ జరిగింది. తమపై నమోదు చేసిన కేసులను క్వాష్ చేయాలని కోరగా.. వివేకా హత్య కేసు పరిణామాలను సునీత తరఫు లాయర్ లూథ్రా కోర్టుకు వివరించారు. వివేకా హత్య కేసులో దర్యాప్తు అధికారిపై ప్రైవేటు ఫిర్యాదు చేయడం ద్వారా విచారణ పురోగతిని అడ్డుకున్నారని కోర్టుకు తెలిపారు. ఈ హత్య కేసును తప్పుదోవ పట్టించాలని చూశారని.. ఆ తర్వాత రక్తపు వాంతులు అని ప్రచారం చేశారన్నారు. కోర్టు ఆదేశాలతో కేసు దర్యాప్తు సాగుతోన్న సమయంలో ప్రైవేటు ఫిర్యాదు చేశారన్నారు. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన ధర్మాసనం.. తదుపరి విచారణను వచ్చే ఏడాది ఫిబ్రవరి 24కి వాయిదా వేసింది. ఇదిలా ఉంటే వైఎస్ సునీతా రెడ్డి ఇవాళ ఏపీ అసెంబ్లీకి వెళ్లిన సంగతి తెలిసిందే. . సీఎంవోలో వైటఎస్ వివేకా హత్య కేసు పురోగతిపై ఆరా తీశారు.

# ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ పదవీకాలం పొడిగింపు ?

న్యూ డిల్లీ నవంబర్ 19 : భారతీయ రిజర్వు బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ పదవీకాలాన్ని కేంద్ర మరోసారి పొడిగించే యోచనలో కేంద్రం ఉన్నట్లు తెలిసింది. ఆయన ప్రస్తుత పదవీ కాలం వచ్చే నెల డిసెంబర్ 10తో ముగియనుంది. ఈ స్థానం కోసం ఇతర అభ్యర్థులను ఎవరినీ ఇప్పటి వరకూ ఎంపిక చేయలేదని తెలిసింది.

దీంతో ఆయన పదవీకాలం రెండోసారి పొడిగించే అవకాశం ఉన్నట్లు ప్రముఖ వార్తా సంస్థ రాయిటర్స్ నివేదించింది. మహారాష్ట్ర ఎన్నికల పోలింగ్ పూర్తయిన తర్వాత పొడిగింపును అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. కాగా, 1980వ బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన శక్తికాంత దాస్.. 2018 డిసెంబర్ 12న ఆర్బీఐ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి వరకు ఆర్బీఐ గవర్నర్‌గా ఉర్జిత్ పటేల్ తన పదవీ కాలానికి ముందే రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో కేంద్రం శక్తికాంత దాస్‌ను నియమించింది. అప్పటి నుంచి అదే పదవిలో కొనసాగుతున్నారు. 2021 డిసెంబర్



10కి ఆయన మూడేళ్ల పదవీ కాలం ముగియడంతో.. కేంద్రం మరోసారి ఆయనకే పట్టం కట్టింది. శక్తికాంత దాస్ పట్ల కేంద్ర ప్రభుత్వం విశ్వాసం ప్రకటించింది. మరో మూడేండ్ల పాటు ఆయన ఆ పదవీకాలం పొడిగించారు. ఈ ప్రకారం వచ్చే నెల డిసెంబర్‌తో ఆయన పదవీ కాలం ముగుస్తుంది. అయితే, మరోసారి ఆయన్ని ఆర్బీఐ గవర్నర్‌గా కొనసాగించాలని కేంద్రం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఐదేళ్ల కంటే ఎక్కువకాలం ఆర్బీఐ గవర్నర్‌గా దాస్ ఉన్నారు. మరోసారి ఆయన పదవీకాలం పొడిగిస్తే.. బెనగల్ రామారావు తర్వాత అత్యధిక కాలం ఆర్బీఐ గవర్నర్‌గా చేసిన వ్యక్తిగా దాస్ నిలవనున్నారు.

రామారావు 1949-1957 మధ్య ఏడున్నర సంవత్సరాల పాటు ఆర్బీఐ చీఫ్ బాధ్యతలు నిర్వర్తించారు. ఇప్పటివరకు ఆయనే అత్యధిక కాలం ఆ పదవిలో ఉన్నారు. ఇప్పుడు ఆయన తర్వాత అత్యధిక కాలం ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేసిన వ్యక్తిగా దాస్ నిలవనున్నారు. అయితే, దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. 1980వ బ్యాచ్ తమిళనాడు క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి శక్తికాంత దాస్.. 2017 వరకు కేంద్ర ఆర్థిక వ్యవహారాలశాఖ కార్యదర్శిగా పని చేశారు. 2016లో నోట్ల రద్దు టైంలో కేంద్రంలో కీలక పాత్ర పోషించారు. ఆయన ఆర్థికశాఖలో పని చేస్తున్నప్పుడు 8 బడ్జెట్ల రూపకల్పనలో భాగస్వామి అయ్యారు. ఆర్థికం, పన్నులు, పరిశ్రమలు, మౌలిక వసతుల కల్పన కోసం కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

38 ఏండ్ల కెరీర్‌లో శక్తికాంత దాస్ వివిధ బాధ్యతలు నిర్వర్తించారు.

# చంద్రబాబు సూపర్ స్కెచ్




రహదారుల నిర్మాణం, నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సరికొత్త ఆలోచనలు చేస్తోంది. ఈ క్రమంలోనే ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు తన మదిలో ఉన్న ఆలోచనను మంగళవారం అసెంబ్లీలో పంచుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. రహదారుల నిర్వహణపై తన వద్ద వినూత్నమైన ఆలోచన ఉందని అన్నారు. జాతీయ రహదారుల మాదిరిగా గ్రామాల్లోనూ రోడ్ల నిర్మాణంపై దృష్టిసారిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం రహదారుల నిర్వహణకు ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే ప్రతిపాదన చంద్రబాబు చేశారు. రహదారుల నిర్వహణను ఔట్ సోర్సింగ్ ఏజెన్సీకి అప్పగించే ఆలోచన చేస్తున్నామన్న సీఎం చంద్రబాబు.. ఉభయగోదావరి జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా దీన్ని అమలు చేసే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. ఈ విధానాన్ని ప్రజలు స్వాగతిస్తే.. రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి తెస్తామని చంద్రబాబు చెప్పారు. నూతన విధానం ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు నిర్మాణాన్ని ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు అప్పగిస్తారు. అయితే కొత్త రహదారులపై టోల్ వసూలు చేస్తారన్న చంద్రబాబు నాయుడు.. అన్ని వాహనాలకు టోల్ వసూలు ఉండదన్నారు. కేవలం ట్రక్కులు, లారీలు, కార్లు వంటి వాటికి మాత్రమే టోల్ ఛార్జీ ఉంటుందని.. ఆటో, బైక్, ట్రాక్టర్లకు ఎలాంటి టోల్ వసూలు చేయరని చంద్రబాబు చెప్పారు. అలాగే గ్రామం నుంచి మండల కేంద్రం వరకు ఎలాంటి టోల్ ఉండదన్న సీఎం .. కేవలం మండల కేంద్రం దాటిన తర్వాత మాత్రమే టోల్ ఛార్జీ వసూలు చేస్తామని చెప్పారు. అయితే తాను చేసేది కేవలం ప్రతిపాదన మాత్రమేనని చంద్రబాబు చెప్పారు. గోదావరి జిల్లాలలో పైలెట్ ప్రాజెక్టు ప్రారంభించిన తర్వాత ప్రజల నుంచి వచ్చే స్పందనను చూసి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు గుంతలమయం కావటంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్న చంద్రబాబు.. నాణ్యమైన రోడ్లు నిర్మిస్తే గ్రామీణ ప్రాంతాల స్థితిగతులు మారతాయని అన్నారు. రోడ్ల నిర్మాణం అనేది అభివృద్ధిలో ఒక భాగమని చెప్పారు. ప్రజలను ఒప్పించిన తర్వాత నూతన విధానంలో రోడ్ల నిర్మాణం చేపడతామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇదే సమయంలో ఔట్‌సోర్సింగ్ విధానంలో రోడ్ల నిర్మాణంపై ప్రజలను ఒప్పించాలని ఎమ్మెల్యేలకు చంద్రబాబు నాయుడు సూచించారు. తొలి దశలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో ఈ విధానం అమలు చేయనున్నారు.

# సంపాదకీయం

## విద్యాశాఖలో భళారే విచిత్రం..!

ప్రవీణ్ ప్రకాష్ లాంటి వ్యక్తి విద్యా శాఖ నుంచి నిష్క్రమిస్తే ప్రభుత్వ పాఠశాలలు బతికి బట్టకడతాయని, ఉపాధ్యాయులు కొన్ని నిముషాల పాటైనా ఆక్సిజన్ పీల్చుకోవచ్చని అందరూ భావించారు. పాఠశాలల్లో విద్యాబోధన మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతుందని భావించారు. అధికారుల మితిమీరిన జోక్యం వల్ల మరుగున పడిన బోధనను తిరిగి కొనసాగించవచ్చని ఉపాధ్యాయ లోకం కళ్లకు వత్తులు వేసుకుని చూసింది. ఐదు నెలల కిందట రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరాక అందరూ ఆ దిశగా ఆశపడ్డారు. అయితే పేరుకు ప్రవీణ్ ప్రకాష్ వెళ్లిపోయాడు కానీ ఆయన నాటిన విత్తనాలు ఇప్పుడు మొలకెత్తాయి. ఉపాధ్యాయులను వేపుకుతినే కార్యక్రమాన్ని నిరాఘాటంగా కొనసాగించడానికి వారు ఉద్యుక్తులవుతున్నారు. గత ప్రభు త్వంలో పురుడుపోసుకున్న యాపులకు తోడు మరిన్ని టపాలు రావడం, పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమయపాలనకు కొత్త నిబంధనలు తీసుకురావడం, ఉపాధ్యాయులకు చట్టబద్ధంగా సంక్రమించిన క్యాజువల్ లీవుల మంజూ రులో నిబంధనలు సృష్టించడం, హైస్కూల్, ప్రైమరీ స్కూళ్ల పని గంట లను హెచ్చించడం, రెసిడెన్షియల్ శిక్షణ, వీటన్నిటికీ తోడు పైలట్ ప్రా జెక్టు కింద పాఠశాల సమయాన్ని సా యంత్రం 5 గంటల దాకా హెచ్చిం చటం వంటి తిరోగమన విధానాలు అమలు చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని పాఠశాలల పని వేళల్ని పరిశీలిద్దాం! ప్రత్యేకించి దక్షణాది రాష్ట్రాల్లోనే కాకుండా అక్షరాస్యతలో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న కేరళలో ఉదయం 9.10 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు, కొన్ని పాఠశాలలు 10 నుంచి 4 గంటల వరకు, ఉన్నత పాఠశాలల్లో 7.30 నుంచి 1.30 వరకు నిర్వహిస్తారు. విరామ సమయం తీసేస్తే అన్ని పాఠశాలల గరిష్ట పనివేళలు ఐదు గంటలు మాత్రమే! తెలంగాణలో ఉదయం 9 నుంచి 4.15 వరకు నిర్వహిస్తున్నారు. అలాగే తమిళనాడులో ఉదయం 9.నుంచి సాయంత్రం 4.10 వరకు నిర్వహిస్తారు. విద్యార్థుల్లో గాని ఏర్పడకుండా 5 పీరియడ్లకు పరిమితం చేసారు. అంతేకాకుండా ప్రతి పీరియడ్ కు మధ్య 10 నిమిషాల విరామం ఇచ్చారు. కర్ణాటకలో 8 నుంచి 1.30 వరకు, పాఠశాలలు నిర్వహిస్తారు. ఉత్తరాది రాష్ట్రాల్లో అతిపెద్ద రాష్ట్రం ఉత్తర ప్రదేశ్‌లో 9.30 నుంచి 3.30 వరకు నిర్వహిస్తున్నారు. అత్యంత నాణ్యతా ప్రమాణాలతో విద్యాబోధన నిర్వహిస్తున్న ఢిల్లీలో కూడా ఇటువంటి విపరీత ధోరణులు లేవు. రాష్ట్రంలో ఉపాధ్యాయులను మానసికంగా ఎలా చిందరవందర చేయాలా అనే అత్యుత్సాహం తప్ప బోధనలో నాణ్యతా ప్రమాణాలు ఎలా ప్రోది చేయాలా అనే లక్ష్యాలు కనుచూపు మేరలో కనిపించడం లేదు. పూర్తి స్థాయిలో ఉపాధ్యాయ నియామకాలు జరిపి పనివత్తిడి తగ్గించడమెలాగనే తార్కిక పునర్విమర్శకు బదులు గొడ్డు చాకిరిని ఎలా చేయించాలనే విధ్వంస పథక రచన జరుగుతోంది. ఆంధ్ర ప్రదేశ్‌లో పని వేళలు పెంచడానికి పైలట్ ప్రాజెక్టు చేపట్టడంలోని ఔచిత్యమేమిటి? ఇదొక భేతాళ ప్రశ్న! మానవ మేధస్సును చిదిమేసే ప్రక్రియ అది. పనివేళల హెచ్చింపు అనివార్యమని ప్రభుత్వం భావిస్తే తద్వారా సాధించదలచుకున్న లక్ష్యాలను చదువు చెప్పే ఉపాధ్యాయులకు ముమ్మందు తెలియజెప్పాలి. అలా కాకుండా ఒక రహస్య అజెండాతో ముందుకెళ్లడం ఏమాత్రం శ్రేయస్కరం కాదు. పాఠశాల పనివేళలు ఎలా ఉండాలనేది విద్యార్థుల్లో అభ్యసన సంసిద్ధత, మానసిక పరిపక్వత, స్థానిక పరిస్థితులు, రవాణా సౌకర్యాలు, ప్రజల జీవన విధానం వంటి అనేక అంశాలు ప్రతిక్షేపిస్తాయి. 70 శాతానికి పైబడి గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రామాణికంగా తీసుకుని ప్రయోగాలు చేయాలి తప్ప అన్ని వసతులు కలిగిన పట్టణ ప్రాంతాలను బేరీజు వేయకూడదు. ఇప్పటికే ఆంగ్ల మాధ్యమ ప్రభావంతో తీవ్ర మానసిక ఒత్తిడి వల్ల విజ్ఞానం సన్నగిల్లి వస్తున్న అత్తెసరు ఫలితాలకు విరుగుడు కనుక్కోవాలి. పరిశోధన, విశ్లేషణ ఉత్తమ ఫలితాలకు మార్గం సుగమం చేస్తాయి తప్ప ఉపాధ్యాయులను చాకిరేవులో ఏకి పారేస్తే సాధ్యం కాదు. ఏడున్నర దశాబ్దాల కాలంలో ఇలాంటి విపత్కర పరిస్థితిని విద్యారంగం చవిచూడలేదు. ఇదొక అప్రకటిత ఎమర్జెన్సీ. ఉపాధ్యాయులపై ముప్పేట దాడి. అనుకూలమైన బోధనా సమయాన్ని యాపుల నిర్వహణకు, ట్రెయినింగులకు కుదువబెట్టి విద్యా బోధనను కుంగదీసే వ్యవహారానికి మంగళం పడాల్సిన అవసరం వుంది. మీదు మిక్కిలి ఉపాధ్యాయులు తమ వ్యక్తిగత అవసరాలకు సెలవు తీసుకునే అవకాశాన్ని కూడా అధికారుల చెప్పుచేతల్లోకి తీసుకొంటున్నారు. ఉపాధ్యాయుడు కూడా ఒక సంఘజీవి. వారికి భౌతిక అవసరాలుంటాయి. వారిలో కూడా చీమూ నెత్తురు ప్రవహిస్తుంటుంది. వారికి కుటుంబాలుంటాయి. వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య అవసరాల కోసం, తనకు జ్వరమో, తలనొప్పి వచ్చినా సెలవు వచ్చినా సెలవు పెట్టుకోవడానికి అధికారుల కాళ్లు మొక్కాల్సిన పరిస్థితి కల్పిస్తున్నారు. ఇటీవల జరిగిన సమావేశంలో పాఠశాల లేదా మండలం యూనిట్‌గా తీసుకున్నపుడు 10 శాతానికి మించి సెలవు మంజురుచేయవద్దని అధికారులు ఆదేశించారు. మెడ మీద తల వుండే వారు ఇలా చెబుతారా..? ఉన్నత స్థానాల్లో వున్న వారు చట్టంతో పాటు మానవేయకోణంలోనూ ఆలోచించాలి. భౌతిక అవసరాలు ఎవరికీ చెప్పి రావు. అందుకోసమే ఆకస్మిక సెలవు (క్యాజువల్ లీవ్). అలాగని ఉపాధ్యాయులు బాధ్యతారహితంగా పాఠశాలలకు ఎగనామం పెట్టరు కదా! మరి సెలవు హక్కు కాదనడం ఏంటి? ఉపాధ్యాయులకు కనీస మానవ హక్కులు కూడా వర్తించకుండా ప్రతిబంధకాలు సృష్టించడమేంటి? వ్యవస్థలను బలోపేతం చేసే సంస్కరణలను స్వాగతించాల్సిందే! కానీ అవి మొదటికి మోసం తెచ్చేవి కాకూడదు. అసంబద్ధ విధానాలకు స్వస్తి పలికి ఆచరణాత్మక, తులనాత్మక శాస్త్రీయ విధానాల బాటలో ముందుకెళ్లడం సర్వత్రా శిరోధార్యం!

# మసక బారుతున్న పాల బుగ్గల పసి బాల్యం

ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం ప్రతి సంవత్సరం నవంబరు 20న ప్రపంచవ్యాప్తంగా జరుపు కుంటారు. బాలల హక్కుల గురించి ప్రజల్లో అవగాహన కలిగించి, పిల్లలు తమ భావాలను, సమాచారాన్ని పంచు కోవడాన్ని, పరస్పర అవగాహనను పెంచు కోవాలన్న ఉద్దేశ్యంతో ఈ దినోత్సవం నిర్వహించ బడుతున్నది. 1954, డిసెంబరు 14న ఐక్యరాజ్య సమితి సాధారణ సభ 1956 నుంచి ప్రపంచ బాలల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం వేడుకగా నిర్వహించాలని అన్ని దేశాలకు సూచించింది. 1959, నవంబరు 20న ఐక్యరాజ్య సమితి జనరల్ శాసనసభ బాలల హక్కుల ప్రకటనను ఆమోదించింది..1989, నవంబరు 20న బాలల హక్కుల పై సంప్రదాయ ఆచరణను ఆమోదించింది. చాలా దేశాలు ఐక్యరాజ్య సమితి జనరల్ శాసనసభ సూచించిన నవంబరు 20 న ప్రపంచ బాలల దినోత్సవంగా పాటిస్తున్నారు. అయితే

ప్రభుత్వాలు పలు పథకాలు చేపట్టినా ఇంకా అధిక శాతం పిల్లలు విధి లేక బాలకార్మికులు గానే ఉండి పోతున్నారు. బాలల శ్రేయస్సుకు కృషి జరుగుతున్నా ఆచరణలో ఫలితాలు కానరావడం లేదు. పాఠశాల సౌకర్యాలు లేక కొందరు, అవి ఉన్నా వివిధ కారణాల రీత్యా బడికి వెళ్లలేక మరి కొందరు బాలలు తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారమయం చేసుకుంటున్నారు.

ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో ముడివడి సంక్షేమ పథకాలకు నోచుకోక, చదువు చెప్పించే స్థోమత లేక ఎందరో పేద తల్లిదండ్రులు గత్యంతరం లేని స్థితిలో చిన్నారులపై భారాన్ని మోపుతున్నారు. హోటళ్లు, కిరాణా దుకాణాలు, ఫ్యాక్టరీలు, మిల్లులు, క్వారీలు, గనులకు తమ పిల్లలను పనికి పంపుతున్నారు. వ్యవసాయ పను లకు కొందరు బాలలు వెళుతున్నారు. చివరికి కొందరు పిల్లలను భిక్షాటన వృత్తిలోకి బలవంతంగా నెడుతున్నారు. వివిధ రంగాలలో బాలకార్మికులు అవస్థలు పడుతూ అనుక్షణం శ్రమిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పెద్దలు చేయాల్సిన పనులను సైతం వీరే చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదిలి బాలల చేత వెట్టిచాకిరీ చేయించు కుంటున్నా, వారికి విముక్తి కలిగించాలన్న ధ్యాస సంబంధిత అధికారుల్లో లేకపోవడం బాధా కరం.

యజమానులు చెప్పిందే చట్టంగా, వారు చేసేదే సంక్షేమంగా పరిస్థితులున్నా కార్మికశాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నా దోషులకు ఎలాంటి శిక్షలు పడడం లేదు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ – ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని భారత రాజ్యాంగం లోని 24వ




నిబంధన స్పష్టం చేస్తున్నా అది కాగితాలకే పరిమిత మవడం శోచనీయం. పేదరికం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పసి పిల్లల బంగారు కలలు చెదిరి పోతున్నాయి. పాలబుగ్గల లేత వయసులో వారు కార్మికులుగా మారడం బాధాకరం. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పిల్లల చేత పని చేయించుకునే యాజ మాన్యాలు తగిన వేతనాలు ఇవ్వడం లేదు. పిల్లలు పనిచేసే చోట తగిన రీతిలో భద్రతా సౌకర్యాలను కల్పించక పోవడం ఆక్షేపణీయం. ప్రాథమిక హక్కులను పేర్కొన్న రాజాంగంలోని 3వ ప్రకరణంలోని 15(8)వ అంశం బాలల కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వానికి కలుగ జేస్తున్నది. 28వ అధికరణం ప్రకారం బాలలను వ్యాపార వస్తువుగా మార్చడం, నిర్బంధ సేవలను చేయించు కోవడం అపరా ధంగానే పరిగణించాలి. 14 సంవత్సరాల లోపు పిల్లలను కర్మాగారాలలో, గనులలో, ఇతర ప్రమాద కరమైన పనులలో నియమించడాన్ని 24వ ఆర్టికల్ నిషేధించింది. 39(ఇ) ప్రకారం బాలలను వారి వయసుకు తగని, శక్తికి మించిన పనులలో నియమించ

రాదు. పేదరికాన్ని సాకుగా చేసుకుని బాలలను పనుల్లో నియ మించడం నిషేధించా లని రాజ్యాంగం ఆదేశం చింది. కఠిన చట్టాలు ఎన్ని ఉన్నా చాలా మంది పిల్లలు బాల కార్మికులు గానే మిగిలి పోతున్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న నిర్బంధ ప్రాథమిక విద్య ఈనాటికీ ఫలించని కలగానే మిగిలి పోతున్నది. ప్రపంచ బాలకార్మి కుల్లో మూడవ వంతు మంది మన దేశంలోనే ఉన్నారని ఒక అంచనా. దీంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. 5 నుండి 15 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టారు. పాఠ శాలలో నమోదు కాని, మధ్యలో మాని వేసిన, అర్హతగల పిల్లల సమగ్ర వివరాలను సేకరించి వారిని తిరిగి తరగతులకు పంపేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొం దించి, ఆచరణాత్మక చర్యలను చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1 నుండి 10వరకూ, 2003 సంవత్సరం నవంబర్ 24 నుండి 29వరకూ బడి బయట ఉన్న పిల్లలనందరినీ పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఆ తర్వాత ఏటా ఆ కార్యక్రమాన్ని అమలు చేస్తునే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా బాల కార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించ డానికి, నిర్బంధ ప్రాథ మిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువు పట్ల అవ గాహన కలిగించాలి. బాల కార్మికులకు వసతి సైతం కల్పించేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాదనపై ఆధార పడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి.


రామ కిష్టయ్య సంగన భట్ల...

# వైద్యులకు రోగులకు వారధులు ఫార్మసిస్టులు



ప్రజలు, ప్రభుత్వాలు ఫార్మసిస్ట్ ల గురుతర సేవలను గుర్తించటానికి, ఫార్మసిస్ట్ లు తమను తాము పునరంకితం చేసికొనటానికి ఇండియన్ ఫార్మస్యూటికల్ అసోసియేషన్ (ఐపిఏ) నవంబర్ మూడవ వారాన్ని జాతీయ ఫార్మసీ సప్తాహం గా ప్రతి ఏటా పాటిస్తున్నది. అంటే జాతీయ ఫార్మసీ వారోత్సవాలను నవంబర్ 16, నుండి నవంబర్ 22 వరకు ఏటా జరుపు కుంటారు. ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మరియు ఢిల్లీ ఫార్మాస్యూటికల్ ట్రస్ట్ సంయుక్తంగా వృత్తిపరమైన ఔషధ తయారీదార్ల ప్రతిష్టను పెంచడమే లక్ష్యంగా వారోత్సవాల కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఔషధం లేనిది చికిత్స లేదు. ఔషధ పరిశోధన, ఆవిష్కరణ, ఉత్పత్తి, పంపిణి, నిలువ, వితరణ, పర్యవేక్షణ, గుణదోష నిర్ధారణ వంటి అన్ని దశలు ఫార్మసిస్ట్ ల పరిధిలోని అంశాలు. భారతదేశంలో 11.25 లక్షల ఫార్మసిస్ట్ లు నిత్యం ప్రజలకు సేవలు అందిస్తున్నారు. దేశంలోని ఫార్మసిస్ట్ లందరికి 1939లో ఏర్పడిన ఇండియన్ ఫార్మస్యూటికల్ అసోసియేషన్ (ఐపిఏ) ప్రాతినిధ్యం వహిస్తున్నది.కేంద్ర ప్రభుత్వ పరిధిలోని డ్రగ్ టెక్నికల్ అడ్వైసరీ బోర్డ్ సభ్యురాలుగా ఐ పి ఏ ప్రభుత్వానికి మార్గదర్శనం చేస్తుంది.ఐరోపా ఖండ వాసుల వలసలతోనే దేశంలోనికి అలోపతి వైద్యం ప్రవేశించింది. ఫార్మసి వృత్తి బ్రిటన్ లో అపోతెకరీ నుంచి, కెమిస్ట్ డ్రగిస్ట్ వంటి దశలను దాటి ఫార్మసిస్ట్ గా పరిణమించింది. దేశంలో మొదటి అలోపతి జెనరల్ హాస్పిటల్ 1664లో మద్రాస్ లో ఏర్పాటు కాగా, మొదటి కమ్యూనిటి ఫార్మసి 1811లో కోల్‌కతాలో ప్రారంభం అయింది. ఆసియా లోనే తొలి ఫార్మసి కళాశాల గోవా లోని పంజింలో 1842లో పోర్చుగీస్ ప్రభుత్వం వారిచే ప్రారంభమైంది.ఆరోగ్యంపై ప్రతి వారికీ శ్రద్ధ ఉండడం సహజం. ఆరోగ్యం కోసం ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ నానా పాట్లు పడుతుంటారు. చికిత్స కన్నా, నివారణే నయమని, ఇప్పుడిప్పుడే చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఏ చిన్నపాటి రోగం వచ్చినా, వెంటనే మందులు తీసుకుంటున్నారు. ఆరోగ్య మెరుగుదలలో మందులు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఇంతకూ మందులను ఎవరు మెరుగు పరుస్తారో, ఎవరు తయారు చేస్తారో తెలుసా? ఫార్మాసిస్టులు. వైద్య బృందంలో ఫార్మసిస్టుల ప్రాముఖ్యత ఎంతో ఉంది. చికిత్స, ఉత్పత్తులను సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా రోగులకు ఆరోగ్య సేవలను మెరుగు పరచడం ఔషధ నిపుణుల ప్రాథమిక లక్ష్యం. వాస్తవానికి ఫార్మాసిస్టు రెండో వైద్యుడిగా పరిగణించ బడతాడు. రోగులకు కావాల్సిన మందులను, ఏ రోగికి ఎంత మోతాదులో కావాలో నిర్ధారిస్తాడు. అంతేకాదు వాటి వల్ల ప్రయోజనాలు కలిగేలా చేస్తాడు. దుష్ప్రభావాలు కలగకుండా మార్గ నిర్దేశాలు చేస్తాడు. క్లినికల్ ఫలితాలను మెరుగు పరచడానికి మందులు వాటి వాడే పద్ధతిని, సురక్షితమైన వాడకాన్ని కూడా ప్రోత్సహిస్తాడు. ప్రపంచం లోని ప్రతి ఒక్క రోగికీ అందరికీ సురక్షితమైన మరియు సమర్థ వంతమైన మందులు అందించేందుకు అనుక్షణం ఫార్మా సిస్టులు కృషి సల్పుతారు. ఔషధాల వాడకాన్ని మెరుగు పరచి, రోగుల భద్రతను నిర్ధారించే మరియు పరిరక్షించేందుకు ఫార్మాసిస్టులు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తారు. ప్రజల ఆరోగ్య భద్రత రీత్యా మెడిసిన్స్ లోని లోపాలను తగ్గించేందుకు ఫార్మా సిస్టులు ఎక్కువగా కృషి చేస్తారు. ఫార్మాసిస్టులు వారి విస్తృత జ్ఞానం మరియు నైపుణ్యాన్ని ప్రజల ఆరోగ్యాల కోసం ఉపయోగిస్తారు. ఏ ఒక్క రోగిని హాని కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందనే విషయాన్ని అనుక్షణం గుర్తుంచుకుని, పని చేస్తారు. వారు తయారు చేసిన మెడిసిన్స్ నుండి ఉత్తమ ఫలితం వచ్చేలా చాలా కృషి చేస్తారు. చాలా మంది వారి పని, తాము సూచించిన మందులను అప్పగించడమే అనుకుంటారు. కానీ జ్ఞానం, అనుభవ పరంగా వారు డాక్టర్ కంటే ఏ మాత్రం తక్కువ కాదు. ఫార్మాసిస్టులకు మెడిసిన్స్, వాటి దుష్ప్రభావాల గురించి సంపూర్ణ అవగాహన ఉంటుంది. ప్రధానంగా వైద్యుల వద్దకు వెళ్లలేని, వైద్యం చేయించు కోలేని నిరు పేదలకు, ఔషధాలను అందించడం లోనూ వారు ఎక్కువ బాధ్యత వహిస్తారు. ఫార్మాసిస్టును కూడా ఒకరకంగా వైద్యుడి లాగే తెల్లటి కోటు ధరించి, మందులు పంపిణీ చేసే ఆరోగ్య సంరక్షక నిపుణుడిలా భావించ వచ్చు. కాని ఔషధ పంపిణీకి మించి ఫార్మాసిస్టు పాత్ర విస్తరిస్తుందని మనం తెలుసుకోవాలి. రోగులకు హాని లేదా మరణానికి మరో ప్రధాన కారణం ఔషధ లోపం అని కొన్ని అధ్యయనాలు చెపుతున్నాయి. లోపం తరచుగా శాశ్వత అవయవ నష్టం, పక్షవాతం లేదా మరణానికి దారి తీస్తుంది. ఇంటర్నేషనల్ ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ 2009 ఇస్తాంబుల్ (టర్కీ)లో జరిగిన వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ ఫార్మసీ అండ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ లో గుర్తించింది. 1912 సంవత్సరం లోనే సెప్టెంబర్ 25న ఫార్మాసిస్టు డే జరుపు కోవడానికి ఎంపిక చేయ బడి, అప్పటి నుండి ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ ప్రారంభించ బడింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచ వ్యాప్తంగా కనీసం 2.6 మిలియన్ ఫార్మసిస్టులు ఇతర ఫార్మాస్యూటికల్ సిబ్బంది ఉన్నట్లు అంచనా వేసింది. ఆరోగ్య కరమైన జీవనానికి సలహా ఇవ్వడం, వ్యాధిని నివారించడానికి టీకాలు వేయడం మందులు సరిగ్గా తీసుకునేలా చూడడం, తద్వారా వ్యాధులను చక్కగా నయం చేయడం, జీవిత నాణ్యతను మెరుగు పరచడం, సురక్షితమైన మరియు సమర్థ వంతమైన మందులు మరియు వ్యాక్సిన్లను అభివృద్ధి చేయడం ద్వారా ఔషధ శాస్త్రవేత్తలు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేస్తున్న సేవలు అమోఘం. జాతీయ ఫార్మాసిస్ట్ వారోత్సవం అంటే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అందరూ ఫార్మాసిస్టుల సేవలను గుర్తించి, ఔషధ తయారీ నుండి, వలసిన వారికి పంపిణీ, మందులు వాడే విధానం వరకు, అసమాన, అమూల్య సేవలు అందిస్తున్న, వారి ప్రతిభావంత మైన పాత్రకు సముచిత గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలి. ప్రధానంగా ప్రస్తుత పరిస్థితులలో కరోనా వైరస్ యొక్క వ్యాప్తిని ఆపడానికి ఫార్మసిస్టులు అవిశ్రాంతంగా కృషి వెల కట్టలేనిది. ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచడం, పంపిణీ చేయడం, కుటుంబ సభ్యులకు దూరంగా, స్వార్థం మరిచి, మానవ సేవే పరమార్థంగా, ఈ క్లిష్ట సమయంలో ఫార్మసిస్టులు చేస్తున్న సేవలకు ప్రతి ఒక్కరూ ప్రోత్సాహం అందించి, కృతజ్ఞతలు ప్రకటించాల్సిన సమయం ఇది.

# విద్యలో రాజ్యాంగం ఒక విషయంగా ఉండాలా?

అందరికి రాజ్యాంగం తెలియాలి, అందుకు గాను వృత్తి విద్యల్లో కూడా రాజ్యాంగం ను ఒక విషయం (సబ్జెక్టు)గా చేర్చి చదివించాలని ఒక వాదన ఉంది. వీడియోల ద్వారా ఎక్కువ ప్రచారంలో ఉన్న ఒక ప్రొఫెసర్ గారు కూడా ఇంజినీరింగ్ చదువులో రాజ్యాంగంను ఒక విషయంగా చేర్చి చదివించాలని ఒక వీడియోలో కోరారు. అలాంటిదే ఈ క్రింది ఫేస్బుక్లో ప్రచురితమైన ఒక విద్యార్థి క్షోభ, ఆవేదన. (కొన్ని భాషాపరమైన సవరణలు, మార్పులు మాత్రమే చేయడం జరిగింది.) ఆలోచించవలసిన చర్చనీయాంశం. పైకి కనిపించినంత సరళమైన, చిన్న విషయం కాదిది.

"పదహారు సంవత్సరాలు చదువుకున్న భారత దేశ యువతరానికి మానవత్వ విలువలు లేకపోవడం, కనీసం భారత రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలు కూడా తెలియక పోవడం నన్ను చాలా బాధపెడుతుంది.నా పేరు రాజ్ కుమార్ నేను కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎం ఏ (పాత్రికేయవిద్య) చేస్తున్నాను.నేను కేయూ ప్రాంగణంకి రాకముందు ఏమనుకునేవాడిని అంటే – ఒకప్పుడు ర్యాగింగ్ ఉండేది కానీ ఇప్పుడు ర్యాగింగ్ ఉండదు, కానీ ఇక్కడికి వచ్చాక తెలిసింది ర్యాగింగ్ పేరు లేదు కానీ ర్యాగింగ్ ఉంది. ర్యాగింగ్ పేరు మార్చారు ఇంట్రడక్షన్ క్లాస్ (ఐ.సి ) అంటే పరిచయ తరగతిగ. మాకు ఇంకా తరగతులు ఆరంభం కాలేదు కాబట్టి మాకు ఇంకా ఐ.సి ఎలా ఉంటుందో తెలియదు. "మనకు మిగతా విభాగాలు/ శాఖల లాగ ఐ.సి లు ఉండవు" అని మా జ్యేష్ఠ విద్యార్థులు చెప్పారు. మా ఎం. కాం మిత్రులు ఏం అంటున్నారు అంటే, "పాటలు పాడిపిస్తున్నారు, నృత్యాలు చేపిస్తున్నారు, సినిమా సంభాషణలు చెప్పిస్తున్నారు, ప్రేమ ప్రతిపాదనలు చేపిస్తూ చాలా ర్యాగింగ్ చేస్తున్నారు ఏంటి బ్రో ఇది చాలా దారుణం". ఇలా చేయడం ర్యాగింగ్ కాదా?కేవలం దీనికి ఐ.సి అని పేరు మార్చారు అంతే. ఇంకా ఒక రోజులో జ్యేష్ఠ విద్యార్థులు ఎక్కడ కనిపించినా ఎన్ని సార్లు కనిపించినా గుడ్ మార్నింగ్, గుడ్ ఆఫ్టర్నూన్ అంటూ అభివాదం వినయంగా చెప్పాలంట. అడిగి మరీ చెప్పించుకోవడం కూడా ఒక బతుకేనా. ఈ విధంగా ఇప్పుడు వికృత అనందం పొందే కొంత మంది జ్యేష్ఠ విద్యార్థులను చదువు పూర్తయి ప్రాంగణం దాటినాక పిలవను కూడా పిలవరు. వీళ్ళు మన తమ్ముళ్లే అనుకుని జీవితం గురించి వారికి తెలిసిన సూచనలు, సలహాలు ఇస్తే వీళ్ళు జీవితాంతం గుర్తు పెట్టుకొని ఎక్కడైనా కనిపిస్తే అన్నా అని మర్యాదగా పిలుస్తారు కదా అనే కనీస అవగాహన లేని వెధవ సన్నాసులు ఉన్నారు.పదహారు సంవత్సరాలు చదువుకున్న తరువాత కూడా భారత దేశ యువకులకు స్వేఛ్ఛ అంటే తమ హక్కులను తాము వినియోగించుకుంటూ ఎదుటి వారికి హాని కలిగించకుండా ఉండడం అనే విషయం తెలియకపోవడం ఈ దేశ విద్యా వ్యవస్థకి ఎంత సిగ్గుచేటు? ఏం నేర్పిస్తుంది ఈ విద్యా వ్యవస్థ అసలు? ఎదుటి వారిని మానసికంగా బాధపెట్టకూడదు అనే కనీస మానవ విలువలు కూడ యువతరం లో లేకపోవడం ఏంటి? పదహారు సంవత్సరాలు చదివింది ఏంటి? మానవ విలువలు తెలియని యువతరం ఈ దేశాన్ని ఎలా ఉద్ధరిస్తారు? వాళ్ళ చేతిలో ఈ దేశ ప్రయాణం ఎటు వైపు వెళ్తుందో అని ఆందోళనగా ఉంది. ఎందుకు అంటే మానవ విలువలు కూడా తెలియని యువతరమే ఎక్కువగా వున్నారు. ఒక వ్యక్తిని మానసికంగా బాధపెడుతూ తాము ఆనందం పొందుతున్నారు అంటే వారిని మానసిక రోగులు అనుకోవచ్చు కదా!మన దేశ విద్యా వ్యవస్థ లో భారత రాజ్యాంగం గురించి ఏ తరగతి పాఠం లో ఉండదు 10వ తరగతి దాకా. 10వ తరగతి తరువాత కూడా ఉండదు కొన్ని చదువుల్లో తప్ప. రాజ్యాంగ ప్రాథమిక విలువల గురించి ప్రతి పౌరుడికి తెలియాలి కదా చిన్నప్పటి నుంచే, కానీ అధిక శాతం విద్యార్థుల కి తెలియదు.

అంతెందుకు నాకే తెలియదు ఇరవై ఒకటి సంవత్సరాలు వచ్చేదాకా.

అదైనా యూట్యూబ్ లో కొందరు మేధావుల ఉపన్యాసాలు చూసి తెలుసుకున్నాను రాజ్యాంగం విలువ ఏంటో. రాజ్యాంగం యొక్క ప్రాథమిక సూత్రాలు తెలిసి ఉంటే ఏ వ్యక్తి అయినా ఇతర వ్యక్తులని మానసికంగా బాధ పెడతాడా? పెట్టడు. ఇక్కడ విద్యార్థులకు భారత రాజ్యాంగం యొక్క ప్రాథమిక సూత్రాలు కూడా తెలియదు కాబట్టే ఇలా ర్యాగింగ్ చేస్తున్నారు. ఇది దేశ విద్యా వ్యవస్థ దౌర్బల్యం కాదంటారా?

మానవత్వం లేదు, హేతువాదం, రాజ్యాంగం, విజ్ఞాన శాస్త్రం గురించి తెలియదు కాబట్టి ఇలాంటి యువతరం ఉన్నంత వరకు అభివృద్ధి చెందిన దేశంగా మన దేశాన్ని చూడాలి అనే కల ... కలలాగే మిగిలిపోతదేమో అని అనిపిస్తుంది. "

అసత్యాలు చెప్పడం తప్పు అని తెలియకనా, న్యాయస్థానాల్లో వాదనల్లో, సాక్ష్యాల్లో అబద్దాలు చెబుతారు. మత గ్రంథాలపై కూడా ప్రమాణం చేయిస్తారు కదా – నిజమే చెబుతాము, నిజం కాక మరేదీ చెప్పం అని.

**సీతా రామ రాజు సనపల**

# ఘనంగా ఇంధిరా గాంధీ జయంతి వేడుకలు



కొత్తగూడ నవంబర్ 19(వుదయం ప్రతినిధి ):మాజీ ప్రధాని స్వర్గీయ ఇంధీరా గాంధీ 107వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహానికి పూల మాలలేసి నివాళులర్పించి ఇందిరాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారతదేశానికి మొట్టమొదటి ప్రధానమంత్రిగా ఎన్నికై దేశానికి ఎనలేనని సేవలు చేసి, దేశవ్యాప్తంగా ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇల్లు నిర్మించి, భూమి లేని నిరుపేదలకు భూములు పంచి నిరుపేదల గుండెల్లో చిరస్థాయిగా ఇందిరమ్మగా నిలిచిపోయిందని ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమం లో పి సి సి సభ్యులు చల్లా నారాయణ రెడ్డి, మాజీ జడ్పీటీసీ పుష్ప లత, మాజీ ఎంపీపీ బానోత్ విజయ్, రూప్ సింగ్,గంగారాం మండల అధ్యక్షులు జాడి వెంకటేశ్వర్లు,మండల ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీను,మాజీ సర్పంచ్ ఈర్ప రాజేశ్వర్ రావు,రాజాం సారంఘం,జిల్లా నాయకులు లావణ్య వెంకన్న, సుంకర బోయిన మొగిలి,వైస్ ఎంపీపీ కాడ బోయిన జంపయ్య,నోముల ప్రశాంత్, రంజిత్,వెలుదండి వేణు,బీరవెల్లి సతీష్,తేజవత్ దేశ్య, జాటోత్ బాలు,కాంగ్రెస్ గ్రామ పార్టీ ల అధ్యక్షులు, కార్యకర్తలు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థినికి నృత్య జ్ఞాన జ్యోతి అవార్డు.



కరీంనగర్ టౌన్ నవంబర్ 19 (వుదయం) సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు కళల పట్ల అవగాహన పెరుగుతుందని మరియు విజయం చాలా సులభంగా సాధించవచ్చని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో విద్యార్థినికి నృత్య జ్ఞాన జ్యోతి అవార్డు రావడం పట్ల ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళలు విద్యార్థులకు నూతన అధ్యాయాన్ని ఆవిష్కరిస్తుందని మరియు కళలపట్ల అవగాహనతో పాటు వాటిలోని విషయాలను సమగ్రంగా తెలుసుకోవడం ద్వారా కళలను, సాంప్రదాయాలను మరియు ఆచారాలను మర్యాద చేసిన వారవుతామని చెప్పారు. మన దేశం విభిన్న కళలకు నిలయమని మరియు భారతీయులకు కళల పట్ల అపారమైన గౌరవం ఉన్నదని దీనిని దృష్టిలో పెట్టుకొని పాఠశాలలో సైతం అపార అనుభవం కలిగిన కళాకారులచే విద్యార్థులకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో శిక్షణ ఇప్పిస్తూ వివిధ స్థాయిలలో నిర్వహింపబడే పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని చెప్పారు. అదే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రదర్శిస్తున్న విద్యార్థులకు అన్ని రకాలుగా ప్రోత్సాహం అందిస్తూ వారిని అగ్ర భాగాన నిలుపుతున్నామని చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో బాసరలో శ్రీ వాగ్దేవి వాద్య సంగీత కళానృత్య సంస్కృతి సంస్థ వారు నిర్వహించినటువంటి శ్రీ జ్ఞాన సరస్వతి నృత్య అర్చన లో అద్భుత ప్రదర్శన కనబరిచిన టి. వరుణ్య, 6వ తరగతి, నృత్య జ్ఞాన జ్యోతి అవార్డును ప్రధానం చేయడం జరిగిందని చెప్పారు. అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన విద్యార్థినిని ఘనంగా సత్కరించారు మరియు రానున్నటువంటి రోజులలో మరిన్ని చారిత్రాత్మక విజయాలను నమోదు చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన విజయోత్సవ కళాయాత్రను విజయవంతం చేయాలి

## - వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి





వనపర్తి నవంబర్19(వుదయం ప్రతినిధి):ప్రజా పాలన ద్వారా ప్రజలకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ ఏడాది పూర్తి అగుచున్న సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నవంబర్ 19 నుండి డిసెంబర్ 7 వరకు ప్రజా పాలన విజయోత్సవ కళా యాత్ర నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు.

మంగళవారం అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లుతో కలిసి ఐ.డి.ఓ.సి ప్రాంగణం నుంచి ప్రజా పాలన విజయోత్సవ కళా యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పౌర సంబంధాల అధికారి, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన విజయోత్సవ కళా యాత్ర చేపట్టడం జరిగిందన్నారు. ప్రజా పాలన ద్వారా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పై ప్రజలకు ఆట పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ సాంస్కృతిక శాఖ కళాకారులు నవంబర్ 19 నుండి డిసెంబర్ 7 వరకు రోజుకు 3 ప్రోగ్రాంల చొప్పున 57 ప్రోగ్రాములు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కళా యాత్ర ఒక నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం కొనసాగుతుందని ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరిస్తుందన్నారు. అదేవిధంగా డిసెంబర్ 6వ తేదీన రాష్ట్ర సాంస్కృతిక శాఖ నుంచి అంతాదుల నాగరాజు కళా బృందం వనపర్తి జిల్లాలో భారీ కళా ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో, మండలాలు, మున్సిపాలిటీల్లో నిర్వహించే సాంస్కృతిక కళాయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి పి. సీతారాం, డిపి.ఓ సురేష్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మమ్మ, ఏఓ భాను ప్రకాష్, సంస్కృతిక శాఖ కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన విజయోత్సవ సభకు భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు.

## మార్కెట్ వైస్ చైర్మన్ శాఖమూరి, బ్లాక్ అధ్యక్షుడు ఎడ్ల.





ఖానాపురం నవంబర్ 19 వుదయం ప్రతినిధి. ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి హనుమకొండ జిల్లాలో పలు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు నిర్వహించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే సంవత్సరం కావస్తున్న సందర్భంగా హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన విజయోత్సవ భారీ బహిరంగ సభకు భారీగా మండలం నుండి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మహిళలు భారీగా ఆర్టీసీ బస్సులలో ప్రైవేట్ వాహనాలు సొంత వాహనాలలో తరలి బహిరంగ సభకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మూడు ఫుల్ సింగ్, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు చెడిపాక ఉపేందర్, మండల ప్రచార కార్యదర్శి పసునూరి (పులి) వెంకన్న, గ్రామ పార్టీ అధ్యక్షులు బొమ్మగాని నవీన్ గౌడ్, ఎస్కే లాల్ సాబ్, నాయకులు పులిగిల్ల నాగరాజు, మచ్చ వెంకన్న, రాగం మల్లేష్,ఎద్దు కుమారస్వామి, కట్ల లింగయ్య, ఎస్.కె సిద్దప్ప, ఖాజామియా, బెల్లి బిక్షపతి, కేతం పెద్దరాజు, మూడు వెంకన్న, రేఖ శ్రీనివాస్, బొచ్చు రాజన్న కావటి యాకేష్,భూషబోయిన రవి కుమార్ (పూర్ణ ), బొచ్చు ఐలోని, చెన్నబోయిన సతీష్, కంగలి వేణు, గోలి శోభన్, భూక్య శేషు, బుర్కా శ్రీను చింత రవి, బోడ రాజు, మారగాని లింగయ్య, పాషా తదితరులు తరలి వెళ్లారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



అనంతగిరి ( వుదయం నవంబర్ 19) అనంతగిరి మండలం అమీనాబాద్ గ్రామంలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారి అందే సతీష్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతులు ఆరబెట్టిన మరియు తేమ శాతం 17% గల ధాన్యం ను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని తెలిపారు. మండల వ్యాప్తంగా పి ఏ ఎస్ సి ఎస్ కొనుగోలు కేంద్రాలు (ఐదు) మరియు ఐకెపి (నాలుగు) కేంద్రాల్లో రైతులు వారి యొక్క రెవెన్యూ గ్రామాల పరిధిలో సంబంధిత వ్యవసాయ శాఖ విస్తీరణ అధికారులను సంప్రదించి ధాన్యాలను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన (33) రకాలను కొనుగోలు కేంద్రాల నిర్వాకులు రైతులు నుండి ఆరబెట్టిన ధాన్యం విక్రయించుకోవాలని తెలిపారు. అలాగే వానాకాలం పంట అనంతరం పంట వరి కొయ్యలు కాల్చరాదని తెలిపారు. వరి కొయ్యల కాల్చడం ద్వారా భూసారం దెబ్బతింటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు జుట్టుకొండ భవాని, గోపతి కవిత, గోపతి రమాదేవి, ఇరుగు భారతమ్మ, రైతు సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

రామగుండం, నవంబర్19(వుదయం ప్రతినిధి): రామగిరి మండల కేంద్రంలోని శ్రీపాద భవన్ ఐఎన్టీయూసీ కార్యాలయంలో మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొడ్డ బాపన్న, టౌన్ అధ్యక్షులు కాటం సత్యం ఆధ్వర్యంలో తొలి మహిళ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ హాజరై ఇందిర చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# వేములవాడ సభకు సర్వం సిద్ధం

సిరిసిల్ల, నవంబర్19(వుదయం ప్రతినిధి):రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్న సందర్భంగా ఏర్పాట్లను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజవర్గం ఇన్ ఛార్జ్ కేకే మహేందర్ రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. వేములవాడ గుడి చెరువు ప్రాంగణంలో సీఎం సభా స్థలం, పార్కింగ్ స్థలం, అలాగే శ్రీవేములవాడ రాజారాజేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని ఎన్టీఆర్ గెస్ట్ హౌస్, ఆలయ ఈవో గెస్ట్ హౌస్ ను పరిశీలించారు.

# సంగారెడ్డిలో ఇందిరా గాంధీ జయంతి

ఆందోల్, నవంబర్19(వుదయం ప్రతినిధి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా సంగారెడ్డిలోని ఆమె విగ్రహానికి కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం పూలమాల వేసి నివాళి అర్పించారు. టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల రెడ్డి మాట్లాడుతూ బ్యాంకులను జాతీయాకరణ చేసిన ఘనత ఇందిరా గాంధీకి దక్కిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోపాజి అనంత కిషన్, ఆంజనేయులు, ప్రభు గౌడ్, నాయకులు పాల్గొన్నారు.


# ఘనంగా స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతి వేడుకలు.

## బ్లాక్ అధ్యక్షుడు ఎడ్ల, వైస్ చైర్మన్ శాఖమూరి.



ఖానాపురం నవంబర్ 19 వుదయం ప్రతినిధి.స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి వేడుకలను మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు ఇంటి వద్ద నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేసి నాయకులకు కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం హనుమకొండ జిల్లాలోని ఏర్పాటు చేసిన ప్రజా పాలన విజయోత్సవ భారీ బహిరంగ సభకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్కే ముస్తఫా, కిసాన్ సెల్ మండల ఉపాధ్యక్షుడు పల్నాటి శ్రీనివాస్, నాయకులు మండవ ప్రసాదరావు, దేవినేని వేణుగోపాల్ రావు, జటంగి నాగరాజు, రంగు కుమార్, హైమద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి లోనాణ్యమైన పౌష్టికాహార భోజనం అందించాలి



చెన్నూరు నవంబర్ 19వుదయం : చెన్నూర్ నియోజకవర్గం కేంద్రం లోని 50పడకల ప్రభుత్వ ఆసుపత్రి లో అనారోగ్యం తో ఆసుపత్రి కి వచ్చిన రోగులకు నాణ్యమైన పౌష్టికాహార భోజనం అందించాలనే సదుదేశ్యం తో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత భోజనం నా ణ్యత లేకుండా పెడుతున్న కాంట్రాక్టర్ మెనూ ప్రకారం ఉదయం పాలు గుడ్డు పప్పు తో భోజనం అందించాలి, ఇవేవి ఇవ్వకుండా నీళ్ల పప్పుతో మమా అనిపిస్తున్నారు సదరు కాంట్రాక్టర్, ఎమ్మెల్యే వివేక్ కి అత్యంత సన్నిహితుడు గా చెప్పుకునే ఈ కాంట్రాక్టర్ ఇష్టా రాజ్యం గా వ్యవహారిస్తూడటం తో రోగులు నిన్న ఆసుపత్రి లో ఆందోళన కు దిగారు. ఆసుపత్రి లో అందించే భోజనం బాగా లేక హొటల్ల నుండి భోజనం తెప్పించుకోవాల్సి వస్తుందని రోగులు వాపోతున్నారు, ఈ విషయమై చెన్నూర్ పట్టణ కౌన్సిలర్స్ మరియు బి ఆర్ యస్ నాయకులు స్థానిక తహసీల్దార్ కి వినతిపత్రం సమర్పించిన సంబందించిన కాంట్రాక్టర్ ఫై వెంటనే నాణ్యమైన భోజనం అందించాలని, లేనిచో జిల్లా కలెక్టర్ వద్ద ఆందోళన లు నిర్వహించాల్సి వస్తుందని సదరు కాంట్రాక్టర్ ను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో పలువురు టిఆర్ఎస్ నాయకులు కౌన్సిలర్లు పాల్గొన్నారు

# ప్రజా విజయోత్సవ సభకు బయలుదేరుతున్న కాంగ్రెస్ శ్రేణులు

జనగామ, ,నవంబర్19(వుదయం ప్రతినిధి): కాజీపేట మండలం మంగళవారం రోజు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ ప్రజా పాలన మొదటి సంవత్సరం పూర్తి అవుతున్న సందర్భంగా హన్మకొండ ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో జరిగే బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వస్తున్నారు.

దీంతో మడికొండ నుండి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, మహిళలు డబ్బు చప్పుళ్ళు ర్యాలీతో మడికొండ చౌరస్తా నుండి సభకు బయలుదేరి వెళ్తున్నారు.

# వికలాంగులు క్రీడల్లో రాణించడం అభినందనీయం

నారాయణఖేడ్, నవంబర్19(వుదయం ప్రతినిధి): వికలాంగులు క్రీడల్లో రాణించడం అభినందనీయమని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సంగారెడ్డిలోని అంబేద్కర్ మైదానంలో వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వికలాంగులు క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనడం మంచి పరిణామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని లలిత కుమారి పాల్గొన్నారు.

# నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో రేట్ బోర్డు నియామకం

సంగారెడ్డి,నవంబర్19(వుదయం ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలో తెలంగాణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రేట్ బోర్డు నియామకం జరిగింది. అందులో ముఖ్య అతిథులుగా పుల్కల్ మండల అధ్యక్షులు హరీష్ కుమార్, ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్ నాయక్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, ఆంజనేయులు నాయి, రాజు నాయి, శేఖర్ నాయి, కృష్ణా నాయి, తదితరులు పాల్గొన్నారు.

# వన సమారాధన



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంవు దయం( ప్రతినిధి)శ్రీ కామాక్షిదుర్గా కార్పెంటర్స్( వడ్రంగి ) అసోసియేషన్ కార్తీక వన సమారాధన మంగళవారం రామచంద్రపురం పట్టణంలో ఘనంగా నిర్వహించారు సంఘ అధ్యక్షులు అప్పారి శ్రీనివాస్,సంఘ సభ్యులు ఆధ్వర్యంలో కార్తీక వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించినారు, ప్రథమంగా ఉసిరి చెట్టు పూజా కార్యక్రమం నిర్వహించినారు, ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు దేవాదుల సూర్యనారాయణమూర్తి సంఘ సభ్యులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా రామచంద్రపురం కార్పెంటర్ సంఘ అధ్యక్షులు అప్పారి శ్రీనివాస్ మాట్లాడుతూ కార్తీకమాసం సందర్భంగా కార్పెంటర్ సంఘం తరపున కుటుంబ సమేతంగా నిర్వహించుకోవడం సంప్రదాయ పద్ధతి అని, ఈ వనభోజ కార్యక్రమము వలన కుటుంబ సాంప్రదాయాలు, సంఘం యొక్క సభ్యుల యొక్క కలయికలు, వారి సంప్రదాయ, సనాతన ధర్మాలు విలువలు తెలుస్తాయని నాటి పెద్దలు నాటి నుండి కూడా ఈ కార్యక్రమాలు చేపడుతున్నారని భావితరాలకు ఈ సాంప్రదాయాలు అలవాటు పరంగా ఏర్పడతాయని తెలిపారు,

సంఘ పరంగా వడ్రంగి పని వారు చాలా ఇబ్బంది పడుతున్నారని, టింబర్ డిపోలో రెడీమేడ్ గుమ్మాలు కిటికీలు తలుపులు వంటివి అమ్మడం వలన కార్పెంటర్ ఉపాధిని కోల్పోతున్నారని, వాటిని అరికట్టవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని, కార్పెంటర్ కార్మికులకు 50 సంవత్సరములకే పెన్షన్ అందించాలని, కార్పెంటర్ సంఘాలకు భవన నిర్మాణాలు సమకూర్చాలని వంటి సమస్యలపై మాట్లాడారు..

ఈ కార్యక్రమంలో గానాల సత్యసాయి, రామోజీ శ్రీనివాస్, ధర్మాసనం రామకృష్ణ, వాసంశెట్టి రాంప్రసాద్, అంగర జగదీష్, దంగేటి రామకృష్ణ, గున్నే పల్లిభీమశంకరం, కొనుకు వెంకటేశ్వరరావు, పితాని బేబీరావు, వాసంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి -మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం.



లక్షెట్టిపేట నవంబర్ 19:( వుదయం ప్రతినిధి ):- భారతదేశానికి మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి అనిమున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం అన్నారు.మంగళవారం ఇందిరా గాంధీ 107వ జయంతిని పురస్కరించుకొని మున్సిపాలిటీలోని విశ్రాంతి భవన ఆవరణలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ అని, ఆమె దేశం కోసం ప్రజల సౌకర్యార్థం 1969లో బ్యాంకులను జాతీయకరణ చేసి జాతికి అంకితం చేశారన్నారు. అదేవిధంగా జాతీయ ఆహార భద్రతను తీసుకువచ్చిన ఘనత ఆమెకే దక్కుతుందని, గరీబ్ హఠావో అను నినాదంతో ముందుకు వెళ్లారన్నారు. దేశ రక్షణ కోసం అణు భద్రతను తీసుకువచ్చిన ఆమె ధీర వనిత అని, దేశం కోసం ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమైనవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పింగళి రమేష్, పట్టణ అధ్యక్షుడు ఆరిఫ్, నలిమేల రాజు, గుండ శ్రీనివాస్, గుత్తికొండ శ్రీదర్, చిన్న రమేష్, బొప్పు సుమన్, మడిపెల్లి స్వామి,బొప్పు సతీష్, మల్లికార్జున్, హాజి, దుమ్మని సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

## బంధన్ నిఫ్టీ 200 క్వాలిటీ 30 ఇండెక్స్ ఫండ్ బంధన్ మ్యూచువల్ ఫండ్ ప్రారంభం

**బంధన్ నిఫ్టీ 200 క్వాలిటీ 30 ఇండెక్స్ ఫండ్ బంధన్ మ్యూచువల్ ఫండ్ ప్రారంభం**

Bandhan Mutual Fund
Badhte Raho

హైదరాబాద్, నవంబర్ 19,2024: బంధన్ మ్యూచువల్ ఫండ్ బంధన్ నిఫ్టీ 200 క్వాలిటీ 30 ఇండెక్స్ ఫండ్ ప్రారంభించినట్లు ప్రకటించింది, ఇది నిఫ్టీ 200 క్వాలిటీ 30 ఇండెక్స్ ట్రాక్ చేసే ఓపెన్-ఎండ్ ఇండెక్స్ పథకం. ఈ ఫండ్ పెట్టుబడిదారులకు నిఫ్టీ 200 విశ్వంలోని 30 అధిక-నాణ్యత గల కంపెనీలకు ప్రాప్యతను అందిస్తుందని బంధన్ ఏ ఏం సి, సి ఈ ఓ, విశాల్ కపూర్ తాము విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. వీటిని రిటర్న్ ఆన్ ఈక్విటీ (ఆర్ఓఈ) డెట్-టు-ఈక్విటీ నిష్పత్తి ప్రతి షేరుకు ఆదాయాలు వంటి కీలక ఆర్థిక కొలమానాల ఆధారంగా ఎంపిక చేస్తారని అని అన్నారు. మార్కెట్ అస్థిరత మధ్య సాపేక్ష స్థిరత్వాన్ని కోరుకునే పెట్టుబడిదారులకు సహేతుకమైన ఆకర్షణీయమైన ఎంపికగా ఉంచడం ద్వారా స్థితిస్థాపకత వృద్ధి సంభావ్యత రెండింటినీ అందించడం ఈ ఫండ్ లక్ష్యం. కొత్త ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్ఓ) సోమవారం, నవంబర్ 18,2024 న ప్రారంభమవుతుంది. శుక్రవారం, నవంబర్ 29,2024 న ముగుస్తుంది. బంధన్ నిఫ్టీ 200 క్వాలిటీ 30 ఇండెక్స్ ఫండ్లో లైసెన్స్ పొందిన మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్లు, ఆన్లైన్ ప్లాట్ఫారమ్ల ద్వారా పెట్టుబడులు పెట్టవచ్చు. బంధన్ నిఫ్టీ 200 క్వాలిటీ 30 ఇండెక్స్ ఫండ్లో పెట్టుబడులు పెట్టడానికి ప్రధాన కారణాలను హైలైట్ చేస్తూ, బంధన్ ఏ ఏం సి, సి ఈ ఓ, విశాల్ కపూర్ మాట్లాడుతూ, "ఆర్థిక వ్యవస్థలు పెరుగుతున్న ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్నందున, స్థితిస్థాపకత స్థిరత్వాన్ని అందించే లార్జ్-క్యాప్, అధిక-నాణ్యత గల స్టాక్ల వైపు పెరుగుతున్న మార్పు ఉందన్నారు.

## బాసర మేజర్ గ్రామ పంచాయతీ ఈవో గోవిందరాజులు పై సస్పెన్షన్ వేటు

**విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు బాధ్యత వహిస్తూ సస్పెన్షన్ వేటువేసిన జిల్లా కలెక్టర్.**



బాసర నవంబర్ 19 ( వుదయం ప్రతినిధి) బాసర మేజర్ గ్రామపంచాయతీలో విధులు నిర్వహించిన పంచాయతీ కార్యదర్శి గోవిందరాజు ను సస్పెండ్ చేసినట్లు బాసర ఎంపీడీవో అశోక్ కుమార్ తెలిపారు.ఇటీవలే తను విధులను సక్రమంగా నిర్వహించకపోవడంతో జిల్లా డిఎల్ పి ఓ విచారణ చేపట్టి సస్పెండ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు.మెజర్ గ్రామపంచాయతీ ఇన్చార్జి. ఎంపీ ఓ గా ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న గంగా సింగ్ ను ఇన్చార్జి ఈవోగా నియమించినట్లు ఎంపీడీవో ఒక ప్రకటనలో తెలిపారు.

## ఉచిత ఆరోగ్య సేవలు అందితేనే ప్రయోజనం



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

ఆదిలాబాద్ ,నవంబర్19(వుదయం ప్రతినిధి): పేద ప్రజలకు ఉచితంగా ఆరోగ్య సేవలందినప్పుడే మేలు జరుగుతుందని ఆదిలాబాద్ శాసనసభ్యుడు పాయల శంకర్ అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వైద్య సేవలు అందకపోవడంతో కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుందని ఆయన అన్నారు. వైద్యం కోసం లక్షల్లో ఖర్చవుతుందని, సహాయ నిధికి దరఖాస్తులు పెట్టుకుంటే 20 నుండి 30 వేలు ఇస్తున్నారని ఆయన అన్నారు వైద్య సేవలపై శాసనసభలో ప్రస్తావనకు తెచ్చినా పెంపు లేదని ఆయన అన్నారు. పేదలు సంపాదించుకునే ఆదాయంలో సగానికి పైగా వైద్యం కోసమే ఖర్చు చేయాల్సి వస్తుందని అన్నారు. వైద్యం కోసం ఆస్పత్రిలో చేరిన వారికి పూర్తి సాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పేదల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేసే ఆయుష్మాన్ భారత్ లో కొన్ని సవరణల కోసం ప్రతిపాదన చేశామని అన్నారు. అనంతరం అదిలాబాద్ నియోజకవర్గ పరిధిలోని 52 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జోగు రవి, రఘుపతి, సంతోష్కు, భాష్, కృష్ణ యాదవ్, సన్నీ, శివ, రాష్ట్ర పాల్ తదితరులు పాల్గొన్నారు.

## సంగమేశ్వర స్వామి దేవాలయంలో ఆరుద్ర నక్షత్ర వేడుకలు

జహీరాబాద్, నవంబర్19(వుదయం ప్రతినిధి): సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని కేతకి సంగమేశ్వర స్వామి దేవాలయంలో ఆరుద్ర నక్షత్ర వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు వేదమంత్రాలతో శివలింగానికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాలను జరిపించారు. అనంతరం పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి మహా హారతి నైవేద్యాన్ని సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

## కురుమూర్తికి హరీష్ రావు రాక

దేవరకద్ర, నవంబర్19(వుదయం ప్రతినిధి): మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానానికి రేపు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు వస్తున్నట్లు బీఆర్ఎస్ శ్రేణులు, పార్టీ నాయకులు రవీందర్ తెలిపారు. బుధవారం ఉదయం 10: 30కు దేవస్థానానికి చేరుకుంటారని ఈ సందర్భంగా కురుమూర్తి స్వామి దర్శించుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా కురుమూర్తికి బీఆర్ఎస్ శ్రేణులు తరలి రావాలని కోరారు.

## ఉక్కు మహిళ భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఘనంగా జయంతి వేడుకలు



వెల్దండ నవంబర్ 19 (వుద యం ప్రతినిధి ) భారతదేశ చరిత్రలో చెప్పుకోదగ్గ ఉక్కు మహిళ మొదటి మహిళా ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ అని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు మోతిలాల్ నాయక్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర పోరాటంలో మహాత్మా గాంధీకి బాసటగా నిలిచారని, రాజకీయ వ్యతిరేకతను అణచివేసేందుకు ఆమె దేశంలో అత్యవసర పరిస్థితిని విధించారని ఆమె సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, కిసాన్ సెల్ తాలూకా అధ్యక్షులు పర్వంత్ రెడ్డి,, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, యూత్ కాంగ్రెస్ తక్కెళ్ళపల్లి శేఖర్,, శ్రీనివాస్ యాదవ్, జిల్లా సేవాదలు ఉపాధ్యక్షుడు పుల్లయ్య, ముదిగొండ రమేష్ , ఎర్ర శ్రీను,, కాడు రామ్ నాయక్, తిరుపతి రెడ్డి, కృపానంద, వెంకటయ్య,, సమీర్ బాబా, రమేష్, భారత్ గౌడ్, తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు

## ఎల్ఓసి చెక్ అందజేత... ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



మెట్ పల్లి నవంబర్ 19 (వుదయం విలేఖరి) మెట్ పల్లి పట్టణ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెట్ పల్లి పట్టణానికి చెందిన పి కళావతి కి మంజూరైన 75 వేల రూపాయల విలువ గల ఎల్ఓసీ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేసిన కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తో పాటు బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## సాధారణ మహిళా అసాధారణ శక్తిగా ఎదిగిన తీరుకు ఇందిరాగాంధీ ప్రస్థానం...

**నియోజకవర్గ టీపీసీసీ సభ్యులు బొమ్మనపల్లి అశోక్ రెడ్డి..**



ఎల్కతుర్తి నవంబర్ 19(వుదయం ప్రతి నిది) ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ప్రధానిగా ఈ దేశ గమనాన్ని మార్చిన ఆమె విప్లవాత్మక నిర్ణయాలను, ఆదర్శవంతమైన విధానాలను అశోక్ రెడ్డి స్మరించుకున్నారు. భారతదేశం బ్రిటీష్ పాలనలో వున్న సమయంలో, తన చిన్నతనంలోనే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించేందుకు వానర సైన్యాన్ని ఏర్పాటు చేసిన ధీశాలి ఇందిరా గాంధీ అని టీపీసీసీ సభ్యులు అశోక్ రెడ్డి అన్నారు.

ఒక్కో మెట్టు ఎక్కుతూ ఈ దేశ ప్రప్రథమ మహిళా ప్రధానిగా ఆమె సాగించిన రాజకీయ ప్రస్థానం ఆ తర్వాత ఎందరో మహిళలకు స్ఫూర్తిగా నిలిచిందని బొమ్మనపల్లి అశోక్ రెడ్డి పేర్కొన్నారు. నాలుగు పర్యాయాలు ప్రధానిగా ఇందిర తన పాలనాకాలంలో తీసుకున్న నిర్ణయాలు మన దేశాన్ని శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దాయని అన్నారు. ఇండియా అంటే ఇందిరా, ఇందిరా అంటే ఇందిరా అనేంతగా ఇందిరా గాంధీ ఖ్యాతి విశ్వవ్యాప్తమైందని అశోక్ రెడ్డి తెలిపారు. పాకిస్తాన్ తో యుద్ధ సమయంలోనూ, అణు పరీక్షల సమయంలోనూ, బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దుతో పాటు పలు సంస్కరణల అమలులో ఇందిర ప్రదర్శించిన ధైర్య సాహసాలు అనన్య సామాన్యమైనవని పేర్కొన్నారు. నాటి ప్రతిపక్షనేత వాజ్ పేయి ఇందిరాగాంధీని దుర్గామాతగా కీర్తించడం ఆమె శౌర్య పరాక్రమాలకు ప్రతీక అని మంత్రి అన్నారు. తన జీవితమంతా ప్రజా సేవలో గడిపుతానని ఇచ్చిన మాట ప్రకారం మరణించే చివరి క్షణం వరకు ప్రజా సేవలోనే గడిపిన ధన్యురాలు ఇందిరా గాంధీ అని అశోక్ రెడ్డి వివరించారు. ఇందిరాగాంధీ ఆశయాల మేరకు మహిళల సాధికారత దిశగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అహరహం శ్రమిస్తున్నదని అన్నారు. ఇందిరమ్మ రాజ్య స్థాపనే లక్ష్యంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు వేల కోట్ల రుణాలను అందిస్తూ వారి స్వయం సాధికారత దిశగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని అశోక్ రెడ్డి స్పష్టం చేశారు.

## వైభవంగా కుంకుమ పూజ

**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వు దయం ప్రతినిధి (బోడపాటి వరప్రసాద్)**



వేలాదిమంది ముత్తైదువులతో కుంకుమ పూజ అత్యంత వైభవంగా నిర్వహించారు రామచంద్రపురం నియోజక వర్గం గొల్లపాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ వీర్రాజు చౌదరి చంద్రు దంపతులు ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది ఘనంగా నిర్వహించారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వేలాది మందితో కుంకుమ పూజ నిర్వహిస్తానని చేసుకున్న ముక్కులో భాగంగా అత్యంత వైభవపేతంగా శాస్త్రోక్తంగా వేదపండితుల మంత్రోచ్ఛరణం నడుమ ముత్తైదువులు వేలాదిగా ఈ పూజలో పాల్గొని స్వామివారికి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు పూజలో పాల్గొన్న భక్తులకు పూజా ద్రవ్యాలన్నిటిని వీర్రాజు చౌదరి దంపతులు సమకూర్చారు అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న కారణంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ హాజరు కాలేకపోయారు ఆయన తండ్రి వాసంశెట్టి సత్యం మంత్రి సతీమణి సునీత హాజరయ్యారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాదం స్వీకరించారు వచ్చిన భక్తులందరూ కు వీర్రాజు చౌదరి దంపతులు అన్న ప్రసాద వితరణ చేశారు భక్తులందరికీ స్వామివారి ఫోటో పసుపు కుంకుమ అందించారు రామచంద్రపురం నియోజవర్గ వ్యాప్తంగా ఉన్న తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు

## ఇచ్చిన హామీలను ప్రజలకు నెరవేర్చాలి

**: సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.తిరుపతి**



శాయంపేట: 14 (వుదయం ప్రతినిధి) ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సిపిఎం హనుమకొండ జిల్లా కమిటీ సభ్యులు డి.తిరుపతి డిమాండ్ చేశారు.శాయంపేట మండలం ప్రగతి సింగారం గ్రామంలో సిపిఎం శాఖ మహాసభ నిర్వహించారు ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు.

అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం అవుతున్నప్పటికీ ప్రభుత్వ మాత్రం ప్రజలకు ఇచ్చిన హామీల పట్ల దాటవేస్తుందని, రైతు రుణమాఫీ, రైతుబంధు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం పంపిణీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం ప్రకటనలతోనే పబ్బం గడుపుతుందని, హామీలే కాదు ఆచరణ లో నెరవేర్చాలని, కాంగ్రెస్ ప్రభుత్వం పై ఎన్నో ఆశలు పెట్టుకున్న ప్రజల ఆశలు నిరాశ చేయవద్దని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి మాట నిలుపుకోవాలని కోరారు. హామీల అమలులో కాలయాపన చేయెుద్దని ప్రభుత్వ హామీల అమలు పై సిపిఎం ఆధ్వర్యంలో జరిగే పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.సిపిఎం శాఖ కార్యదర్శిగా చిలకల కొమరయ్యలిభారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ (సిపిఎం) శాయంపేట (ప్రగతి సింగారం) శాఖ కార్యదర్శిగా మాజీ సర్పంచ్ చిలకల కొమరయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు తిరుపతి తెలిపారు. గత 40 ఏళ్ల నుంచి సిపిఎం పార్టీలో పనిచేస్తూ ప్రజల కోసం అనేక ఉద్యమాలు నిర్వహించి, పార్టీలో నీతి నిజాయితీకి కట్టుబడుతూ, పార్టీ సిద్ధాంతానికి లోబడి పని చేస్తున్న కొమురయ్యను కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు తిరుపతి తెలిపారు. కమిటీ సభ్యులుగా మాదాసు తిరుపతి, బల్ల రవి, కొమురయ్య, ఎల్లయ్యను ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాజయ్య, సమ్మయ్య, వెంకటయ్య, మల్లయ్య ,లు పాల్గొన్నారు.

## పెద్దవార్వాల్ లో ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

పరిగి, ,నవంబర్19(వుదయం ప్రతినిధి): గండీడ్ మండలం పెద్దవార్వాల్ గ్రామంలో భారతదేశ మొదటి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మెంబర్. పీ. నర్సింహా రావు, పీఏసీఎస్ డైరెక్టర్ బాలస్వామి, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా శక్తికి నిదర్శనం ఇందిరాగాంధీ

– కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి



శాయంపేట: 19 (వుదయం ప్రతినిధి)సాధారణ మహిళ అసాధారణ శక్తిగా ఎదుగుటకు ఇందిరాగాంధీ ప్రస్థానమే నిదర్శనమని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం మాజీ ప్రధాని, ఉక్కు మహిళ దివంగత ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి మాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఓ మహిళగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని, పేదల నిర్మూలనకు మహిళల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఇండియా అంటే ఇందిరా, ఇందిరా అంటే ఇండియా అనే విధంగా విశ్వఖ్యాతిని గడించారని అభిప్రాయపడ్డారు. నేటి తరంలో సుపరిపాలన అంటే ఇందిరమ్మ రాజ్యం అనే నినాదం చొచ్చుకుపోయిందని పేర్కొన్నారు. దేశ సమగ్రత కోసం తన ప్రాణాలను సైతం విడిచారని గుర్తు చేసుకున్నారు. ఇందిరా ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిందం రవి, బాసని శాంత, మారపల్లి కట్టయ్య, బాసరి మార్కండేయ, మరపల్లి రాజేందర్, వరదరాజు, నరేష్ రెడ్డి, శంకరాచారి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# పంట వ్యర్థాలను కాల్చవద్దు

## వ్యవసాయ అధికారి వీరభద్రం



రాయపర్తి నవంబర్ 19( వుదయం ప్రతినిధి): మండలంలోని వివిధ గ్రామాలలో రైతులు వరి పంట వ్యర్థాలను కాల్చకుండా కలియ దున్నాలని అవగాహన మండల వ్యవసాయ అధికారి గుమ్మడి వీరభద్రం కల్పించారు. రైతులు పంట కోత పూర్తి అయిన తర్వాత వరి పంటలో మిగిలిన అవశేషాలను అక్కడక్కడ తగలబెట్టడం గమనిస్తున్నాము. ఈ విధంగా చేయడం వలన భూమిలో ఉన్న ఉపయోగకరమైన పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు వానపాములు చనిపోవడమే కాకుండా సేంద్రీయు కర్బనం కూడా దెబ్బతింటుంది. ఈ విధంగా తగలబెట్టడం ద్వారా వాతావరణ కాలుష్యం పెరగడంతో పాటు భూమి యొక్క భౌతిక స్థితి కూడా దెబ్బతింటుంది. వీటిని నిలుపుకునే శక్తిని కోల్పోతుంది రైతు సోదరులు పంట అవశేషాలు తగలపెట్టకుండా భూమిలో కలియదున్నాలి. ఇలా చేయడం వలన భూమిలో సేంద్రీయ కర్బన పదార్థం పెరిగి నేల గుళ్ళు బారుతుంది వరి పంటలో ఒక ఎకరంలో పంట అవశేషాలను నేలలో కలిగి ఉండడం ద్వారా 36.8% కార్బన్ నత్రజని 1 శాతం భాస్వరం 0.06 శాతం భూమిలో కలుస్తుంది. ఇదేవిధంగా ఒక ఎకరంలోని వరి పంట అవశేషాలను కాల్చడం ద్వారా 9 20 –1380 కేజీల సేంద్రియ కర్బనం 25–37.5 కేజీల నత్రజని ,1.5 –2.25 కేజీల బాస్వరం, 625 –93.75 కేజీల ఫొటాష్ గాలిలో కలిసిపోతుంది. కేవలం స్థూల పోషకాలే కాకుండా సూక్ష్మ పోషకాలు కూడా దెబ్బతింటున్నాయి . రైతులు పంట అవశేషాలను తగలబెట్టకుండా భూమిలో కలియ దున్నడం వలన నెల ఆరోగ్యం మెరుగుపడుతుంది .వరి పంటలో వచ్చే వ్యర్థాలను కాల్చడం ద్వారా వాతావరణ కాలుష్యం జరుగుతుంది . కాలుష్యం దుష్ప్రభాషా కారణాలవల్ల ప్రజల యొక్క ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉంది ముఖ్యంగా శ్వాస సంబంధం ఇబ్బందులకు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు పంట వ్యర్థాలను కాల్చకుండా నేలల్లో కలియదున్నాలి నెలలో కలియదున్ని పంట వ్యర్థాలను త్వరగా కుళ్ళిపోవడానికి 50 కేజీల సింగిల్ సూపర్ పాస్పెట్ 15 కేజీల యూరియాను వేసుకున్నట్లయితే త్వరగా కుళ్ళిపోయి సేంద్రియ కర్బన పదార్థంగా మారే అవకాశం ఉంది అదేవిధంగా వేస్ట్ డీకంపోజర్ ద్రావణాన్ని పంట వ్యర్థాలపై చల్లి కల్టివేట్ తో గాని రోడ్ వెయిటర్ తో గాని కలియ దుండినట్లయితే వేగంగా కుళ్ళిపోయి సేంద్రియ కర్బన పదార్థంగా మారే అవకాశం ఉంది కాబట్టి రైతులు పంట వ్యర్థాలను కాల్చవద్దని వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి గుమ్మడి వీరభద్రం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ లు పి మనస్విని , రాజేష్ రెడ్డి, ఉడుత సాయి హేమబిందు తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి చెకుముకి పోటీలను విజయవంతం చేయండి......జనవిజ్ఞాన వేదిక కోదాడ.




%కోదాడ టౌన్ నవంబర్ 19(వుదయం) ఈనెల 21వ న జన విజ్ఞాన వేదిక సారథ్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలు అనంతగిరి, కోదాడ మండలాల విద్యార్థులకు బాలుర ఉన్నత పాఠశాల కోదాడ యందు నిర్వహించబడు నని, పోస్టర్ ఆవిష్కరణ చేశారు. జనవిజ్ఞాన వేదిక కోదాడ డివిజన్ చెకుముకి పోటీ పరీక్షల కన్వీనర్ డిఎన్ స్వామి, జన విజ్ఞాన వేదిక సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షులు బడుగుల సైదులు,

జన విజ్ఞాన వేదిక కోదాడ మండల కన్వీనర్ ముక్కామల జానకిరామ్ లు మాట్లాడుతూ ప్రతి పాఠశాల స్థాయిలో ఎంపిక చేయబడిన ముగ్గురు విద్యార్థులను 21వ తేదీన ఉదయం 9:30 గంటలకు బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించబడే మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలకు హాజరుకావాలని కోరారు. మండల స్థాయిలో విజేతలైన విద్యార్థులను జిల్లాస్థాయి చెకుముకి పోటీలకు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు డి. మార్కండేయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఫంక్షన్ హాల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



నిజాంసాగర్, అక్టోబర్ 19 (వుదయం ప్రతినిధి): మండలంలోని అచ్చంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గోర్గల్ గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన ఫంక్షన్ హాల్ ను డిసిసిబి చైర్మన్ రమేష్ రెడ్డితో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ దినదిన అభివృద్ధి చెందుతూ రైతుల అభ్యున్నతి కొరకు కృషి చేయడం సంతోషకరం అన్నారు. రైతుల సహకారంతో సొసైటీ మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డిసిసిబి చైర్మన్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ అచ్చంపేట సొసైటీ అన్ని రంగాల్లో ముందుందని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సొసైటీ డైరెక్టర్లు సైతం సొసైటీ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల అధ్యక్షులు ఏలే మల్లికార్జున్,

రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ మనోజ్ కుమార్, వైస్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, అచ్చంపేట సొసైటీ ఛైర్మన్ నరసింహారెడ్డి, వైస్ ఛైర్మన్ శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ సాయిరెడ్డి సీఈవో సంగమేశ్వర్ గౌడ్, ఏవో అమర్ ప్రసాద్, నాయకులు గుర్రపు శ్రీనివాస్, మురళీధర్ గౌడ్, ప్రజా పండరి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలు...



కుత్బుల్లాపూర్, నవంబర్ 19,(వుదయం ప్రతినిధి ),ప్రపంచ దేశాలలో ఉక్కు మహిళాగా మాత్రమే కాకుండా తన పాలన దక్షతతో పేరుగాంచిన వీర వనిత మాజీ ప్రధాని భారతరత్న ఇందిరాగాంధీ అని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. ఇందిరా గాంధీ జయంతి పురస్కరించుకొని ఎన్ఎంసి బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయాంలో పేదలకు ఆమె అందించిన సంక్షేమాని స్మరించుకుంటూ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు సంక్షేమం, అభివృద్ధిని చేరువ చేసి భారతీయుల గుండెలో పదిలంగా నిలిచిపోయారని, ఆనాడు ముందు చూపుతో చేపట్టిన సంక్షేమ పథకాల ఫలితంగా దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. ఇందిరమ్మ పాలన స్ఫూర్తితో తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తూ అన్ని వర్గాలకు సంక్షేమాన్ని, అభివృద్ధిని అందిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజ్గిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు ధమ్మని శ్రవణ్ కుమార్ ముదిరాజ్, డా.అవిజె జేమ్స్, మాజీ కార్పొరేటర్ల పాల కృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎంసీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, ప్రగతినగర్ కాంగ్రెస్ నాయకులు వరగాని వాసు, బేకు శ్రీనివాస్, గడ్డం రాజేందర్ రెడ్డి, డివిజన్ నాయకులు లాయక్, గణేష్, పెరికె శివ, సోమన్నగారి శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ రమణ కి ఈనాడు జ్ఞాపిక అందజేత



జగిత్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 19 ( వుదయం ): రామోజీ గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీ రావు జన్మదినాన్ని పురస్కరించుకొని ఈనాడు సంస్థ స్థాపించి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్సీ ఎల్ రమణ ను సీనియర్ జర్నలిస్ట్,

ఈనాడు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ పి ఎస్. రంగారావు ఎమ్మెల్సీ రమణ ను కలిసి ఈనాడు సంస్థ జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా ఇందిరాగాంధీ జయంతి.



కోదాడ టౌన్ నవంబర్ 19(వుదయం ) కోదాడ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఖమ్మం క్రాస్ రోడ్ లో ఉన్న ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాలకు ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిన మహనీయురాలని దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వంగవీటి రామారావు, పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎర్నేని బాబు,మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, బాల్ రెడ్డి,కౌన్సిలర్లు గంధం యాదగిరి,షాబుద్దీన్, కోటిరెడ్డి,గుండెల సూర్యనారాయణ,కట్టబోయినా శ్రీనివాస్ యాదవ్, పెండెం వెంకటేశ్వర్లు, నిరంజన్ రెడ్డి,మదర్,డేగ శ్రీధర్, పాలూరి సత్యనారాయణ, సుందరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఇందిరా గాంధీ 107వ జయంతి వేడుకలు



రామకృష్ణాపూర్,నవంబర్ 19(వుదయం ప్రతినిధి) రామకృష్ణాపూర్ పట్టణం లోని స్థానిక సూపర్ బజార్ చౌరస్తా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా భారత దేశ చరిత్రలో అత్యంత ప్రజాదరణ పొందిన ప్రధాన మంత్రులలో ఇందిరాగాంధీ ఒకరు అని పట్టణ కాంగ్రెస్ నేతలు గుర్తు చేసుకున్నారు.ఇందిరా గాంధీ పేదరిక నిర్మూలన ,హరిత విప్లవం,బంగ్లాదేశ్ విముక్తి కోసం పాకిస్తాన్ తో జరిగిన యుద్ధం,ఇందిరా గాంధీ కి విపరీతంగా ప్రాచుర్యం తీసుకువచ్చాయని పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు వారి సేవలను గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపతి రాజయ్య,మున్సిపల్ వైస్ చైర్మన్ సాగర్ రెడ్డి,సీనియర్ నాయకులు గాండ్ల సమ్మయ్య,శ్యామ్ గౌడ్,లాడెన్,పందిరి లింగయ్య,గంగన్న, ప్రకాష్, ముతికె రవి,మల్లేష్, రాంసాయి,జతిన్,బండారి నగేష్,బింగి రమేష్ మహిళా నాయకురాళ్లు శారద,సునీత,కల్పన,సృజన,మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సహాయం అంతజేత



ధర్మసాగర్ వుదయం ప్రతినిధి2024 మంగళవారం 19ఈ రోజు ధర్మసాగర్ మండలం ధర్మసాగర్ గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న బొడ్డు ప్రత్యూష ,బొడ్డు జానీ తండ్రి బొడ్డు వినోద్ అకాల మరణం చెందినందున కళాశాల ప్రధానాచార్యులు ఆసనాల శ్రీనివాసులు మరియు అధ్యాపక మరియు అధ్యాపకేతర బృందం,వారి కుటుంబాన్ని పరామర్శించి చేయూతను అందించారు. ఈ క్రమంలో విద్యార్థుల యొక్క పరీక్ష రుసుమును చెల్లించినారు. వారికి ఐదువేల నగదు రూపేణా డబ్బులు అందించారు. భవిష్యత్తులో వారి ఉన్నత విద్యకు గాను కావలసిన సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇస్తూ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు షేక్ ఆజం, బాబురావు, రాములు ,వెంకట్, సదానందం, గణేష్, రాజేందర్, గోపాలకృష్ణ, ప్రభాకర్ మంజుల, రవి పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోండి

శిబిరాన్ని ప్రారంభించిన ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ వరప్రసాద్ రెడ్డి



కల్వకుర్తి నవంబర్ 19 (వుద యం ప్రతినిధి ) నియోజకవర్గ పరిధిలోని ఆమనగల్ పట్టణంలోని లక్ష్మీ ఫంక్షన్ హాల్ లో తొమ్మిది రోజులపాటు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, తెలంగాణ టాస్క్ సి ఓ ఓ సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తొమ్మిది రోజులపాటు నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నియోజకవర్గ ప్రజలందరూ సద్వినియోగపరచుకోవాలని సుంకిరెడ్డి వరప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు మంగళవారం వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారుఈ కార్యక్రమంలో...ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు,నరేందర్ గౌడ్,శ్రీనివాస్ రెడ్డి,చంద్ర శేఖర్,మల్లయ్య,మల్లేష్ నాయక్,రమేష్ గౌడ్,కొండల్ యాదవ్,రమేష్ నాయక్,కొండల్ రెడ్డి,రఘు,యాదయ్య,శేఖర్,శ్రీపతి, రవి యాదవ్,అభినవ్ రెడ్డి,శ్రీను,మహేష్,మల్లేహ్ నాయక్,కళ్యాణ్,భాస్కర్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఫంక్షన్ హాల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్, అక్టోబర్ 19 (వుదయం ప్రతినిధి): మండలంలోని అచ్చంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గోర్గల్ గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన ఫంక్షన్ హాల్ ను డిసిసిబి చైర్మన్ రమేష్ రెడ్డితో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ దినదిన అభివృద్ధి చెందుతూ రైతుల అభ్యున్నతి కొరకు కృషి చేయడం సంతోషకరం అన్నారు. రైతుల సహకారంతో సొసైటీ మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డిసిసిబి చైర్మన్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ అచ్చంపేట సొసైటీ అన్ని రంగాల్లో ముందుందని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సొసైటీ డైరెక్టర్లు సైతం సొసైటీ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ మనోజ్ కుమార్, వైస్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, అచ్చంపేట సొసైటీ ఛైర్మన్ నరసింహారెడ్డి, వైస్ ఛైర్మన్ శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ సాయిరెడ్డి సీఈవో సంగమేశ్వర్ గౌడ్, ఏవో అమర్ ప్రసాద్, నాయకులు గుర్రపు శ్రీనివాస్, మురళీధర్ గౌడ్, ప్రజా పండరి తదితరులు పాల్గొన్నారు.

# అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన స్కూల్ బస్సు

ఉప్పల్, ,నవంబర్19(వుదయం ప్రతినిధి): కీసర పీఎస్ పరిధిలో మంగళవారం ఓ స్కూల్ బస్సు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. డివైన్ గ్రేస్ ఇంటర్నేషనల్ స్కూల్కు చెందిన బస్సు ఉదయం విద్యార్థులను పికప్ చేసుకుని పాఠశాలకు బయలుదేరింది. మార్గమధ్యలో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది.

ఈ ప్రమాదంలో పలువరు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో 40 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలుస్తోంది. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# భారీ బహిరంగ సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు



పెద్దవంగర, నవంబర్ 19 (వుదయం ప్రతినిధి):వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన ప్రజా పాలన విజయోత్సవ సభ, ఇందిరా మహిళా శక్తి భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం, మంత్రులు హాజరైన సభకు మండలంలోని పలు గ్రామాల నుండి, మహిళలు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు రంగు మురళి గౌడ్, గద్దల ఉప్పలయ్య, ఎండీ జాను, బండారి వెంకన్న, రామకృష్ణారెడ్డి, దంతాలపల్లి ఉపేందర్, ఉప్పలయ్య, సుంకరి అంజయ్య, అనపురం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# త్రిపుర ల్యాండ్ మార్క్ కన్స్ట్రక్షన్పై చర్యలు తీసుకోండి...



కుత్బుల్లాపూర్, నవంబర్ 19,(వుదయం ప్రతినిధి ),దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్, దొమ్మర పోచంపల్లి నందు కోమటికుంట, మొండికుంట, పగడాల సముద్రం చెరువు నందు ఎఫ్.టి.ఎల్ బఫర్ జోన్, నాళాలు ఆక్రమణ అక్రమ అనుమతులతో నిర్మాణం చేస్తున్న త్రిపుర ల్యాండ్ మార్క్ కన్స్ట్రక్షన్ పై క్షేత్ర స్థాయిలో సర్వే చేసి, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకొని చెరువులను నాలాలను ప్రభుత్వ భూములను కాపాడాలని దుండిగల్ ఎంఆర్ఓ మతిన్, ఇరిగేషన్ అధికారులకు ఆకుల సతీష్ పిర్యాదు చేసారు. ఈ సందర్బంగా సతీష్ మాట్లాడుతూ దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్ గ్రామం సర్వేనెంబర్ 242/%ూ, 244/జూ% త్రిపుర ల్యాండ్ మార్క్ 4 లో విల్లాల నిర్మాణంలో కోమటికుంట ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్ (సర్వే నె. 223) దాదాపు 1000 గజాలు ఆక్రమణ, నిర్మాణం నాలాను మార్చడం, మొండి కుంట చెరువు- కోమటికుంటల ఏడు మీటర్ల నాలా విస్తీర్ణం తగ్గించడం, ఇష్టా రాజ్యంగా నాలను మార్చడం నాలా ఆక్రమణ బఫర్ జోన్( సర్వే నె. 242, 244) మార్పులు చేర్పులు చేయడం కాకుండా సర్వేనెంబర్ 245 ప్రభుత్వ భూమి కూడా కొంత కలుపుకొని అక్రమ అనుమతులు, అక్రమ నిర్మాణంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ల్యాండ్ మార్క్ విల్లాస్ నిర్మాణ దశలోనే ఉంది కాబట్టి, సర్వే చేసి చెరువుల ఎఫ్టిఎల్ బఫర్ జోన్ నాలా ఆక్రమణ ప్రభుత్వ భూమి ఆక్రమణలపై చర్యలు తీసుకొని పరిరక్షించి కొనుగోలుదారులు నష్టపోకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అరుణ్ రావు, ఈశ్వర్ రెడ్డి, రాజు, రామ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన విజయోత్సవ సభకు భారీగా తరలిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు



కొత్తగూడ నవంబర్ 19(వుదయం ప్రతినిధి ): హనుమకొండలోని ఆర్ట్స్%డ% కళాశాల లో జరిగే ప్రజా పాలన విజయోత్సవ సభకు కొత్తగూడ గంగారం మండలాల నుండి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కొత్తగూడ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అంతా కూడా జై కాంగ్రెస్ అంటూ నినాదాల తో ర్యాలీ నిర్వహించి వాహనాలలో భారీగా వెళ్లారు. ఈ ఒక కార్యక్రమానికి కొత్తగూడ గంగారం మండలాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వజ్జ సారయ్య, జాడి వెంకటేశ్వర్లు, పీసీసీ సభ్యులు చల్ల నారాయణరెడ్డి,మాజీ జడ్పీటీసీ పుష్పలత, మాజీ ఎంపీపీ బానోత్ విజయ రూప్ సింగ్,వైస్ ఎంపీపీ జంపయ్య,జిల్లా నాయకులు లావణ్య వెంకన్న, ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీను,జిల్లా నాయకులు రాజాం సారంఘం,వేణు,ప్రశాంత్, రంజిత్ సురేష్, మండల నాయకులు గ్రామ నాయకులు , యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు.

## బీబీపేట్ మండలంలో ఇందిరా గాంధీ జయంతి

మల్కాజ్‌గిరి, నవంబర్19(వుదయం ప్రతినిధి): బీబీపేట్ మండలంలో దివంగత ఇందిరా గాంధీ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుతార్ రమేష్, బిక్నూర్ మార్కెట్ చైర్మన్ జనగామ పాత రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి భూమ గౌడ్, సలీం, మహేష్, యాడవరం మాజీ సర్పంచ్ వెంకట్, చందుపట్ల విట్టల్, రాజయ్య ,మధు, రవి, తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి కోర్టులో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

జుక్కల్, నవంబర్19(వుదయం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశంతో కామారెడ్డి జిల్లా ప్రిన్సిపల్ న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ అధ్యక్షతన కామారెడ్డి కోర్టులో స్టెనో, టైపిస్ట్-1, టైపిస్ట్-కమ్-అసిస్టెంట్-1, రికార్డ్ అసిస్టెంట్-1ఉద్యోగాల భర్తీకి మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు వెబ్సైట్ చూడాలని కోర్టు నుండి విడుదలైన ప్రకటనలో పేర్కొన్నారు.

# బీసీలకు రక్షణ చట్టం (బీసీ అట్రాసిటీ) తక్షణమే అమలుచేయాలి

## బీసీ కమీషన్ చైర్మన్ నిరంజన్ కి వినతిపత్రం అందజేసిన బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపెందర్



నల్లగొండ నవంబర్ 19(వుదయం ప్రతినిధి): ఈమధ్య కాలంలో తరచుగా బీసీలపై దాడులు జరిగి కులం పేరుతో కుల వృత్తులను,కులాలను తిడుతూ వేధింపులకు గురిచేస్తున్న కారణంగా బీసీలకు రక్షణ చట్టం తీసుకువచ్చి అమలుచేయాలని బీసీ యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపెందర్ మంగళవారం బిసి కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దీపెందర్ మాట్లాడుతూ కొన్ని బీసీ కులాలను కులాల పేరుతో దూషిస్తూ కించపరుస్తూ మాట్లాడుతున్నారన్నారు. అంతేకాకుండా ఈ మధ్యకాలంలో దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామాభివృద్ధి కమిటీల పేరుతో కొన్ని కులాలను గ్రామ బహిష్కరణ చేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. కొన్ని గ్రామాలలో రజకులు తప్పకుండా బట్టలు దక్కాల్సిందేనని గ్రామ అభివృద్ధి కమిటీ తీర్మానం చేసి అలా బట్టలు ఉతకని రజకులను గ్రామ బహిష్కరణ చేసిన సందర్భాలు కూడా ఉన్నాయన్నారు. ప్రభుత్వం వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని బీసీల కోసం బీసీ అట్రాసిటీ రక్షణ ప్రత్యేక చట్టం రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు విశ్వనాధుల శివధామోదర్ చారి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యలిజాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# భారత నాయకత్వ శక్తిని ప్రపంచానికి చాటిన ధీరవణినిత ఇందిరా గాంధీ,



యాదాద్రి భువన గిరి/రాజాపేట, నవంబర్ 19 వుదయం ప్రతినిధి : భారత నాయకత్వ శక్తిని ప్రపంచానికి చాటిన ధీరవనిత, పేదల పెన్నిధిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా చెరగని ముద్ర వేసుకున్న భారత మొదటి మహిళా ప్రధాని భారతరత్న ఇందిరాగాంధీ అని ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాడోత్ విఠల్ నాయక్, రాజాపేట మండల పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ లు గౌడ్ అన్నారు. మంగళవారం రాజాపేట లో ఇందిరా గాంధీ విగ్రహం వద్ద మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 105 వ, జయంతి సందర్బంగా విగ్రహానికి పూలమాలలు వేశారు. మిఠాయి పంపిణీ చేశారు. రాజపేట టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఐరేని నవీన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ విట్టల్ నాయక్, జిల్లా మండల కాంగ్రెస్ నాయకులు నమిల కేదారి, పొట్ట బత్తిని వెంకటేష్, గొలనుకొండ బిక్షపతి, రేగు సిద్ధులు, అంకతి రమేష్, ఆకిరెడ్డి రమేష్, వైరాగ్యం చంద్రశేఖర్, కాకళ్ళ భరత్, పొట్ట బత్తిని భద్రయ్య, సట్టు సిద్ధులు, కొత్త కనకయ్య సోమారం కిష్టయ్య, పుల్లగారి పోచయ్య, గొల్లపల్లి శ్రీను, కొత్త జాల తాజా మాజీ ఉపసర్పంచ్ కోటగిరి పండరి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి పట్టణ అభివృద్ధికి శంకుస్థాపనలు



పెద్దపల్లి జిల్లా: నవంబర్ 19:(వుదయం) ప్రతినిధి పెద్దపల్లి పట్టణంలోని మున్సిపల్ పరిధిలో 3, 10, 22వ వార్డుల్లో రూ. 1.32 కోట్లతో సి.సి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మౌలిక సదుపాయాల కల్పనకు కట్టుబడి ఉన్నాం.

వేసవికల్లా మంచినీటి కొరతను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి సారించాం,'' అని తెలిపారు.కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, మాజీ ఎంపీపీ గోపగాని సరయ్య, స్థానిక కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# జిల్లా పద్మనాయక వెలమ సంక్షేమ మండలి నూతన కార్యవర్గ సభ్యులకు అభినందలు ఎమ్మెల్సీ రమణ



జగిత్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 19( వుదయం ):జిల్లా పద్మనాయక వెలమ సంక్షేమ మండలి నూతన కార్యవర్గ సభ్యులను ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ అభినందించారు. మంగళవారం ఎల్ రమణ నివాసంలో వెలమ సంక్షేమ మండలి సభ్యులు ఎమ్మెల్సీ నీ మర్యాదపూర్వకంగా కలవగా నూతన కార్యవర్గాన్ని లు ఎమ్మెల్సీ ఎల్ రమణ అభినందించి శుభాకాంక్షలు తెలిపినారు . ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ నాలుగు వేల పైగా. సభ్యత్వం ఉన్న వెలమ సంఘం ఎన్నికలు పోటీతత్వం లేకుండా కమిటీ మొత్తం ఏకగ్రీవంగా ఎంతో శుభ పరిమాణం అని కొనియాడారు.అనంతరం సంఘ సభ్యులు ఎమ్మెల్సీ రమణ నీ సన్మానించి జ్ఞాపికను అందించినారు.

ఈ కార్యక్రమం లో అధ్యక్షుల ఆయిల్నేని సాగర్ రావు,ప్రధాన కార్యదర్శి దాన్నపు నేని వేణుగోపాల్ రావు, ఉపాధ్యక్షులు బండారి దివాకర్ రావు,సూరిగినేని కమలాకర్ రావు, ట్రేజరర్ ఎన్నమనేని రాజ లక్ష్మి నరసింహారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఇమ్మనేని ప్రశాంత రావు, ఆయిల్నేని రవీందర్రావు, ఈసి మేంబర్లు అజయ్ రావు ,అనిల్ కుమార్,మెన్నేని ప్రవీణ్ రావు ,రాంప్రసాద్ రావు, పుణుగోటీ సురేందర్రావు, మేన్నేని సురేందర్రావు, బోయిన్పల్లి హరిప్రియ, అయిల్నేని శ్రీలత,బల్మూరి సరళ,వెలమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# ప్రగతినగర్ లో ఇంటింటికి సిపిఎం ఆదరించిన ప్రజానీకం...

## : బి వెంకటరామయ్య సిపిఎం మండల కార్యదర్శి



కుత్బుల్లాపూర్, నవంబర్ 19,(వుదయం ప్రతినిధి ),మేడ్చల్ జిల్లా సిపిఎం మూడో మహాసభలు కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్ లో నిర్వహిస్తున్న సందర్భంగా ఇంటింటికి సిపిఎం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల హార్ధిక ఆర్థిక సహకారం కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా సిపిఎం కార్యదర్శి పి సత్యం, బాచుపల్లి మండల కార్యదర్శి బి. వెంకటరామయ్య మాట్లాడుతూ ప్రగతి నగర్ కాలనీ ఏర్పడినప్పటి నుండి పంచాయతీ అయిన తర్వాత సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పంచాయతీ నిర్వహణ ఎంతో అభివృద్ధి పథంలో నడిచిందని గత 30 సంవత్సరాలుగా కాలనీ మౌలిక సదుపాయాల కల్పనలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. దేశంలోనే నెంబర్ వన్ పంచాయతీగా అవార్డును సైతం పొందటం సిపిఎం పార్టీ కృషి ఫలితమే అన్నారు. సిపిఎం మూడవ జిల్లా మహాసభలు ప్రగతినగర్ లో నిర్వహించటం కొరకు స్థానిక ప్రజానీకానికి వారి యొక్క హార్ధిక ఆర్థిక సహకారం కోరుతూ ప్రచారం చేస్తున్న సందర్భంగా ప్రజానీకం ఎంతో మంచిగా ఆదరించారని, నిజాంపేట్ కార్పొరేషన్ ఎన్నికలో సిపిఎం పార్టీ ప్రగతి నగర్ అభివృద్ధికి ఆరు మంది కార్పొరేటర్లు గెలుపొంది ప్రజానీకానికి మౌలిక సదుపాయాలు మెరుగుపరచడంలో మంచి కృషి చేశారన్నారు. ఈ మహాసభలో నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్, కుత్బుల్లాపూర్ నియోజక వర్గ అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల కార్యదర్శిలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భూ చట్టాలను సవరించాలి

## : సీనియర్ సిటిజన్ కోడూరు చంద్రయ్య



జన్నారం,నవంబర్ 19(వుదయం విలేకరి) తెలంగాణ రాష్ట్రంలో భూ చట్టాలను సవరించాలని జన్నారం పట్టణానికి చెందిన సీనియర్ సిటిజన్ కోడూరు చంద్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ చట్టాలు భూమి యజమానులను ఇబ్బంది పెడుతున్నాయని, రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన కొద్దీ భూ చట్టాలు మారుతూ రావడం వలన ఉదాహరణకు ఒక వ్యక్తికి నాలుగు గంటల భూమి ఉంటే ఇండ్ల ప్లాట్లకు ఉపయోగపడతుంది దానిని రెండు ప్లాట్లుగా విడదీసి రెండు గుంటలకు ఒకటి చొప్పున అమ్ముదామంటే రిజిస్ట్రేషన్ చేయడానికి వీలు లేని చట్టాలు ప్రభుత్వాలు రూపొందించాలని ఆ వ్యక్తి అవసరానికి కుటుంబ అవసరాలకు ఆ ఉన్న భూమిని అమ్ముకుందామంటే భూ చట్టాలు మారి ఈ విధంగా ఇబ్బందులు పెట్టడం బాగాలేదు దీనిని వెంటనే సవరించి పది గుంటల భూమి ఉన్న రెండు గుంటలు చొప్పున ఐదుగురికి అమ్మే విధంగా భూ చట్టం సవరించి చిన్న భూ యజమానులను ఆదుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు.జన్నారం శివారులోని సర్వే నంబర్ 70 లో పేదవాళ్లు నివసించే గూడెం సేవాదాస్ నగర్ లోని భూమిని రెవెన్యూ వాళ్లు ఆన్లైన్లో నమోదు చేయకపోవడం వలన రిజిస్ట్రేషన్ చేయమంటే వీలు లేదని అంటున్నారన్నారు.ఆ కుటుంబాల అవసరాల కోసం అమ్ముకుంటామంటే ఈ విధంగా భూ చట్టాలు సవరించి భూములు కొద్దిగా ఉన్న యజమానులను ఇబ్బంది పెట్టడం సరికాదని వెంటనే భూ చట్టాలను సవరించి పేదవానికి ఉన్న భూమిని పేదవారికి అమ్ముకొనటానికి అవకాశం కల్పించుటకు చట్టాలను సవరించి రూపొందించాలని అయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఎలుకతుర్తిలో సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం..



ఎల్కతుర్తి నవంబర్ 19 (వుదయం ప్రతి నిది)గడ్డంరాజనర్సు అధ్యక్షతన జరిగింది ఈ మండల

కౌన్సిల్ కు ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కర్రె బిక్షపతి హాజరై మాట్లాడినాడు మండలంలోని సూరారం భూ పోరాటాన్ని ఉధృతం చేసి ఇల్లు లేని నిరుపేదలకు గుడిసెలు వేయాలని అదేవిధంగా గ్రామ గ్రామాల్లో శాఖ సమావేశాలు జరిపి మండల మహా నిర్వహించాలని అదేవిధంగా సిపిఐ శత జయంతి ఉత్సవాలు డిసెంబర్ 10 నుంచి 26 వరకు గ్రామ గ్రామాన ఎర్రజెండా ఎగరవేయలని ఆయన అన్నారు అర్హులైన పేదలకు రేషన్ కార్డ్స్ ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం చే మంజూరు చేయించాలని లేనియెడల రైతులకు ప్రభుత్వం రుణమాఫీ ఇస్తానని ఇప్పటివరకు ఇవ్వలేదని వాళ్లకు వెంటనే రుణమాఫీ అలాగే మినీ ఫెస్ట్ లో పెట్టిన 6 ముఖ్యమైన గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలను ఉధృతం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఎలుకతుర్తిలో బస్టాండ్ ఆవరణలో ఉన్నటువంటి షాపింగ్ కాంప్లెక్స్ ను పేదవారికి తొందరగా ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరినారు ఎందుకంటే పేద కుటుంబాలు షాపులు నడిస్తే గాని కుటుంబాలు వాటిపై ఆధారపడి ఉన్నాయి ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి రాములు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్ సిపిఐ జిల్లా సమితి సభ్యులు కామర వెంకటరమణ మర్రి శ్రీనివాస్ శనిగరపు రాజకుమార్ నిమ్మల మనోహర్ తండా మొండయ్య మర్రి విజయ్ గడ్డం లలిత మరి పెల్లి తిరుమల పోచయ్య ఆరెపల్లి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు

# రోడ్లపై చెత్త వేస్తే జరిమానే..!!

నాంపల్లి, ,నవంబర్19(వుదయం ప్రతినిధి): హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఇప్పుడు చెత్త ఇవ్వని కొంతమంది ప్రజలు. చెత్త రోడ్లపై పారబోస్తే జరిమానా విధించే కసరత్తు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కీలక నిర్ణయం తీసుకునే దిశగా చర్యలు తీసుకుంటోంది. ట్రాఫిక్ చలానా తరహాలో రోడ్ల పక్కన చెత్త వేసేవారికి జరిమానా విధించేందుకు జీహెచ్ ఎంసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. వాహనాల నంబర్ల ఆధారంగా సంబంధిత వ్యక్తుల ఇంటికి జరిమానా వివరాలు పంపనున్నారు.

# ఇందిరా గాంధీ జయంతి కార్యక్రమం ఘనంగా



పెద్దపల్లి జిల్లా: నవంబరు 19: (ప్రుదయం) ప్రతినిధి రామగిరి మండల కేంద్రంలో భారతదేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ జయంతి కార్యక్రమం రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రొడ్డ బాపన్న, కాటం సత్యం, కలవేన శ్రీకాంత్ ముదిరాజ్, ఎస్.రమణయ్య, పసునూరి రాజు, జాంపల్లి నరసయ్య, మున్సిపల్ నాయకులు జానకీ రామయ్య, మహిళా నాయకురాలు అరుణ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమం స్థానిక శ్రీపాద భవన్ (ఐఎన్టీయూసీ కార్యాలయం)లో ఉదయం 10:30,గంటలకు ప్రారంభమైంది. మండల కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# పరమ పవిత్రం కార్తీక మాసం ఆధ్యాత్మికతతో ఆరోగ్యానికి మేలు

## నార్కోటిక్ బ్యూరో ఎస్పి పోతరాజు సాయి చైతన్య



జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 19(ప్రుదయం ప్రతినిధి)కార్తీక మాసం ఎంతో పవిత్రమైందని ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని హైదరాబాద్ నార్కోటిక్ బ్యూరో ఎస్పి పోతరాజు సాయి చైతన్య ఐపీఎస్ అన్నారు. కార్తీకమాస ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం ఆయన ఘనప సముద్రం సరస్సు కట్ట పై కొలువైన దక్షిణముఖ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోటగుళ్లలోని గణపతి నందీశ్వరుడు గణపేశ్వరునికి రుద్రాభిషేకం నిర్వహించి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కోటగుళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు సాయి చైతన్యను శాలువాలు పూలమాలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా దక్షిణ ముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆలయ అర్చకులు గోవర్ధన వేణుగోపాలాచార్యులు ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# ఏఐటియుసి శిక్షణ తరగతులు విజయవంతం చేయండి

## కామ్రేడ్ బోట్ల శ్రీనివాస్



రాయపర్తి నవంబర్ 19 (ప్రుదయం ప్రతినిధి): వరంగల్ జిల్లా కేంద్రంలో ఏఐటియుసి శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ బొట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏఐటియుసి శిక్షణ తరగతుల కరపత్రాన్ని విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి స్వతంత్రం వచ్చి 8 దశాబ్దాలు కావస్తున్న కార్మికుల జీవితాల్లో ఆశించిన మార్పు రాలేదు కేంద్రంలో రాష్టంలో అధికారంలో ఏ పార్టీ ఉన్న కేవలం మాటలతో కాలం గడిపే వారే తప్ప ఆచరణలో మాత్రం కార్మికులకు ఒరిగింది ఏమీలేదు పాలకులు కార్పొరేట్ పెట్టుబడి దారి యజమాన్యాలకు మేలు చేస్తూ కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. డిసెంబర్ 2 3 తేదీలలో వరంగల్ జిల్లా కేంద్రంలో శిక్షణ తరగతులకు అధిక సంఖ్యలో విచ్చేసి ఆ శిక్షణని వినియోగించుకోవాలని కామ్రేడ్ బొట్ల శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు కుమారస్వామి, యాకయ్య ,సందీప్ అశోక్ ,సమ్మయ్య,రమేష్ ,తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ హరికిషన్ ఆశయ సాధనకు కృషి చేస్తాం... ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు పడిశాల రఘు.



%కోదాడ మునగాల నవంబర్ 19(ప్రుదయం)ప్రజా సమస్యలపై తన కలంతో నిరంతరం అక్షర పోరాటం చేసి అనేకమందికి బాసటగా నిలబడి, విప్లవాత్మక భావాలతో ప్రయాణం కొనసాగించిన నమస్తే తెలంగాణ దినపత్రిక రిపోర్టర్ చిల్లంచర్ల హరికిషన్ మనమధ్య లేకపోవడం బాధాకరమని కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు పడిశాల రఘు అన్నారు. మునగాల మండల కేంద్రంలో మంగళవారం హరికిషన్ సంతాప సభలో వారు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం రఘు మాట్లాడుతూ విప్లవాత్మక భావాలు కలిగిన హరికిషన్ ఆశయ సాధనకై కృషి చేస్తామన్నారు. సీనియర్ జర్నలిస్టుగా జర్నలిజం లోకి వస్తున్న మిత్రులకు అనేక సలహాలు సూచనలు అందించే వారిని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు మిత్రులు, చెరుకుపల్లి శ్రీకాంత్, కె వాసు, లావుడియా రమేష్,పగడల వాసు ,నెలమరి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన దాసరి ఉష



పెద్దపల్లి జిల్లా: నవంబరు 19, ప్రుదయం ప్రతినిధి సుల్తానాబాద్ పట్టణానికి చెందిన ఆరెపల్లి జితేందర్ అనారోగ్యంతో మరణించారు. ఈ సందర్భంగా ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉషతో పాటు తోట వెంకటేష్ పటేల్, మాచర్ల బబ్లు, ఆముదాల అరుణ, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అసత్యపు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు



జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 19(ప్రుదయం ప్రతినిధి)మంత్రి శ్రీధర్ బాబు పై అసత్యపు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు అని మంగళవారం మహాదేవపూర్ మాజీ ఎంపీపీ గుర్సింగ బాపు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండగొర్ల సంతోష్ వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు చల్ల నారాయణ రెడ్డి కి రాజకీయ బిక్ష పెట్టింది మాజీ స్పీకర్ శ్రీపాద రావు, అన్నారు. మతి స్థిమత కోల్పోయి నోరు ఉంది కదా అని ఇష్టం వచ్చినట్టు మాట్లాడం నీకు సరికాదు. అని అన్నారు రాజకీయ బిక్ష పెట్టిన శ్రీధర్ బాబు ని విమర్శించడం విడ్డూరం అని వెల్లడించారు మా నాయకులు శ్రీధర్ బాబు, శ్రీను బాబు వ్యక్తిత్వాలు ఏంటో మంథని నియోజకవర్గ ప్రజలందరికి తెలుసు అని పేర్కొన్నారు నారాయణ రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి ఇన్ని సంవత్సరాలు గడుస్తున్నాయి. ఇన్ని సంవత్సరాలలో లేని సోయి ఇప్పుడెల వచ్చింది అని అన్నారు సంవత్సరాలు గడుస్తుంటే మతి స్తిమతం వస్తుందా, కోల్పోతున్నావా అని ప్రశ్నించారు దళిత బహుజన భూములను ఆక్రమించుకొని వేల ఎకరాలు సంపాదించి, కాటారం లో ఇల్లు కూడా అసైన్మెంట్ భూమిలో నిర్మించిన నీలాంటి వ్యక్తి శ్రీధర్ బాబు, శ్రీను బాబు లను విమర్శించటం సిగ్గు చేటు అన్నారు. ఊసరవెల్లిలా పార్టీలు మార్చే నీవు పుట్ట మధును హత్య చేయమన్నారని నిందలు వేయండం సబబు కాదని శ్రీధర్ బాబు పై అసత్యపు ఆరోపణలు చేస్తే సహించేది లేదని అన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా కాళోజి కళాక్షేత్రం ప్రారంభం

ప్రజా కవి నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి

4601.15 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన ప్రారంభం

ఆర్ట్ గ్యాలరీ సందర్శన, కాళోజి పై నిర్మించిన లగు చిత్రన్ని విక్షించిన ముఖ్యమంత్రి





హనుమకొండ, నవంబర్ 19(ప్రుదయం జిల్లా ప్రతినిధి) :అద్భుతం ఆవిష్కృతమైంది కలలు కళాకారులకు పుట్టినిల్లుగా పేరుగాంచిన ఓరుగల్లు కళామతల్లి శిఖలో మరో మణిహారం తోడిగారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. జిల్లా ప్రజలు కళాకారులు కళాభిమానులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కాళోజి కళాక్షేత్రం మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అంతకుముందు పోలీసు గౌరవ వందనాన్ని ముఖ్యమంత్రి స్వీకరించారు. ముఖ్యమంత్రి హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుండి హనుమకొండ కూడా గ్రౌండ్స్ లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం 2.30 కి చేరుకున్నారు. అక్కడ నుండి నేరుగా కాళోజి కళాక్షేత్రానికి చేరుకొని ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క తో కలిసి ముందుగా ప్రముఖ కవి కాళోజి నారాయణరావు నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం హనుమకొండ వరంగల్ జిల్లాలకు సంబంధించిన 4601.15 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపణలు ప్రారంభోత్సవాలు ముఖ్యమంత్రి అక్కడ ఏర్పాటు చేసిన స్క్రీన్ ద్వారా చేశారు. అనంతరం కలాక్షేత్ర భవనాన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అక్కడ నుండి నేరుగా కాళోజీ కళాక్షేత్ర భవన క్రింది అంతస్తు లో కాలోజి నారాయణరావు వ్యక్తిగత జీవితంలోని ప్రత్యేక క్షణాలను ప్రతిబింబించే ఫోటోలు, పురస్కారాలు, వ్యక్తిగత వస్తువులు ప్రదర్శించిన ఆర్ట్ గ్యాలరీని సందర్శించారు. ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీ ని ముఖ్యమంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా కాళోజి ఫౌండేషన్ ప్రతినిధులు వీఆర్ విద్యార్థి, పొట్లపల్లి శ్రీనివాస్ రావులు ముఖ్యమంత్రికి కాళోజి జీవితం అక్కడి వస్తువుల గురించి వివరించగా ముఖ్యమంత్రి ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఆడిటోరియం లో కాళోజి జీవిత విశేషాలతో నిర్మించిన లఘు చిత్రాన్ని కాళోజి ట్రస్ట్ ఫౌండేషన్ సభ్యులు, ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి విక్షించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత అంపషయ్య నవీన్ ట్రస్ట్ సభ్యులు ముఖ్యమంత్రికి పుష్పగుచం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆడిటోరియం బయట ఇందిరా ఫెలో షిప్ సభ్యులు, స్థానికి పార్టీ ప్రజా ప్రతినిధులను ముఖ్యమంత్రి కలిశారు. అక్కడ నుండి నేరుగు ఆర్ట్స్ కళాశాల మైదానం లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మధ్యాహ్నం 3.35 ని బయలుదేరారు.

**అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం శంకుస్థాపన వివరాలు:**

కాళోజి కళాక్షేత్రం ప్రారంభం - 90 కోట్లు

అండర్ డ్రైనేజీ వ్యవస్థ శంఖుస్థాపన - 4170 కోట్లు

నార్కోటిక్ పోలీస్ స్టేషన్ ప్రారంభం - 12 లక్షలు

నయీమ్ నగర్ బ్రిడ్జి ప్రారంభం - 8.30 కోట్లు

వరంగల్ తూర్పు అభివృద్ధి పనుల శంకుస్థాపన - 3 కోట్లు

పాలిటెక్నిక్ కళాశాల శంఖుస్థాపన - 28 కోట్లు

కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ ఆర్ %ఌ% ఆర్ లేఔట్, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు శంఖుస్థాపన - 863 ప్లాట్లు, 5 లక్షల ఏ 43.15 కోట్లు

ఫ్లడ్ డ్రైనేజీ సిస్టం శంఖుస్థాపన - 160.3 కోట్లు

కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ టౌన్షిప్ ఆవరణలో పి హెచ్సి , ప్రైమరీ స్కూల్, పశు వైద్యశాల శంకుస్థాపన - 13 కోట్లు

వరంగల్ పట్టణం రహదారుల అభివృద్ధి శంకుస్థాపన - 49.50 కోట్లు

పరకాల నుండి ఎర్రగట్టు గుట్ట రోడ్డు 4 లైన్ల విస్తరణ - 65.0 కోట్లు

కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ లో మౌలిక సాధుపాయల కల్పనకు శంకుస్థాపన 11.6 కోట్లు

వరంగల్ ఎల్ బి నగర్ లో ఉర్దు భవనం శంకుస్థాపన 1.50 కోట్లు

ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్, గిరిజన శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క),రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ రాజకీయ సలహాదారు కె. కేశవరావు, తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి అజిత్ రెడ్డి, ఎంపీలు బలరాం నాయక్, డాక్టర్ కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మధుసూధనాచారి, గ్రేటర్ వరంగల్ మేయర్ శ్రీమతి గుండు సుధారాణి, శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవురి ప్రకాష్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, యశస్విని రెడ్డి, రోడ్ల భవనాల శాఖ సలహాదారు శ్రీనివాసరాజు, ఎంఎ యుడి ప్రిన్సిపాల్ సెక్రెటరీ దానా కిషోర్, రోడ్ల భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, సమాచార శాఖ కమిషనర్ డాక్టర్ హరీష్, విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, వరంగల్, హన్మకొండ కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, ప్రావీణ్య, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి, జిడబ్ల్యా ఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాఖేడే, లు ఇతర ప్రజాప్రతినిధులు, రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామి ఆలయంలో క్షేత్ర పాలకునికి ప్రత్యేక పూజలు,



యాదాద్రి భువనగిరి/రాజపేట, నవంబర్ 19 ప్రుదయం ప్రతినిధి: రాజపేట మండలం రఘునాథపురం తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కొలువై ఉన్న యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రం శ్రీ స్వామి వారి పాదాల చెంత నుండి అతి చెరువులోనున్న రఘునాథపురం గ్రామం లో వేంచేసియున్న కలియుగ ప్రత్యక్ష దైవం, కోరిన కోరికలు తీర్చే అతి మహిమాన్వితమైన, శ్రీదేవి,భూదేవి, సమేత శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం మంగళవారం పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ క్షేత్ర పాలకుడైన శ్రీ అభయాంజనేయ స్వామి వారికి విశేషమైన రోజు సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీ అభయాంజనేయ స్వామి వారికి పంచామృతాలతో సుగంధ ద్రవ్యాలతో పంచ సూక్తాలు, మన్య సూక్త పఠనాలతో, శాస్త్రోక్తంగావేదమంత్రాలతో ప్రత్యేక అభిషేకాలు తిరుమంజన సేవ ఆలయ అర్చకులు శ్రీ సౌమిత్రి రఘునాథ చార్యులు ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ స్వామివారికి నూతన వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించి సింధూరం లేపనం నిర్వహించి తమలపాకులతో నాగవల్లి దళార్చన వివిధ రకాల పుష్పాలతో హనుమాన్ చాలీసా పారాయణం సహస్ర నామార్చనలు,అష్టోత్తర శతనామార్చనలు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు అనంతరం స్వామివారికి నైవేద్యం నివేదనలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు ఆలయ అర్చకులు రఘునాథచార్యులు సాయంత్రం ఆలయంలో విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు, తదుపరి కార్తీక పురాణ పఠనం చేసి ఆకాశ దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా పాలన కళాయాత్ర ప్రారంభం



మహబూబాబాద్ జిల్లా,నవంబర్ 19(ప్రుదయం ప్రతినిధి ):ప్రజా పాలన కళాయాత్ర సమాచార, జిల్లా పౌర సంబంధాల అధికారి ఆద్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక కళాకారులతో వాహనాన్ని ప్రత్యేకంగా ఫ్లెక్సీ బ్యానర్ల తో సిద్ధం చేయగా, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు, రెవెన్యూ, లెనిన్ వత్సల్ టోప్పో, కే.వీర బ్రహ్మాచారి,లు ప్రారంభించారు. ప్రజా పాలనా విజయోత్సవాలు ఈ నెల 19-11-2024 నుంచి డిసెంబర్ 07-12-2024 జిల్లాలోని మహబూబాబాద్,మరిపెడ,డోర్నకల్,తొర్రూర మున్సిపాలిటీలు, 18 మండలాల్లోని ఆయా గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు మహాలక్ష్మి, ఇందిరా మహిళాశక్తి, గృహ జ్యోతి, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లపై టీం లీడర్లు గిద్దె రాంనరసయ్య, బండ వెంకన్న, రవీందర్ గౌడ్, నేతృత్వంలో ప్రచారం చేయనున్నారు. మున్సిపాలిటీలోని ఆయా వార్డుల్లో, ప్రతి మండలం నుంచి మూడు గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ పి.రాజేంద్రప్రసాద్, డి సి ఓ వెంకటేశ్వర్లు, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వడ్డేబోయిన శ్రీనివాస్, డిహెచ్ఓ మరియన్న, డీఏవో విజయనిర్మల, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ వినియోగదారుల సమస్యలపై పరిష్కార వేదిక

రామకృష్ణాపూర్ /నవంబర్ 19(ప్రుదయం ప్రతినిధి)మంచిర్యాల రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని నస్పూర్,మందమర్రి,క్యాతన పల్లి,హాజీపూర్ మండలంలోని విద్యుత్ వినియోగదారల సమస్యల పరిష్కారం కోసం క్యాతన పల్లి 33/11 కేవీ సబ్ స్టేషన్ లో తేదీ 20-11-24 బుధవారం రోజున ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు లోకల్ కోర్ట్ నిర్వహించబడుతుందని టీజీ ఎన్పిడిసిఎల్ /డిఈఈ కైసార్,

ఏడిఈ మోహన్ రెడ్డి ఒక ప్రకటన లో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారుల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# చంద్రుగొండలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

కొత్తగూడెం,,నవంబర్19(ప్రుదయం ప్రతినిధి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను చంద్రుగొండ మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా మండల కేంద్రంలోని ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందిరాగాంధీ ఆనాడు దేశంలో పేదరిక నిర్మూలన కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చంద్రుగొండ మండల కాంగ్రెస్ నాయకులు, తదితరులు ఉన్నారు.




# బిజినెస్






## దేశీయ విమాన రంగంలో సరికొత్త రికార్డు



దేశీయ విమాన రంగ చరిత్రలో తొలిసారి సరికొత్త రికార్డ్ సృష్టించింది. ఆదివారం ఒక్కరోజే 5 లక్షల మందికిపైగా ప్రయాణికులు ప్రయాణాలు చేశారు. ఒకే రోజులో 5 లక్షల మార్కు దాటడం ఇదే తొలిసారి కావడం విశేషం.దేశ వ్యాప్తంగా పండుగలు,

పెళ్లిళ్ల సీజన్‌లు ఉండడంతో ఒక్కసారిగా ఈ డిమాండ్ పెరిగినట్లుగా తెలుస్తోంది. ఆదివారం దాదాపు 90 శాతం ఆక్యుపెన్సీ కంటే ఎక్కువ ఉందని నిపుణులు చెబుతున్నారు. దాదాపు అన్ని ఎయిర్ సంస్థలు కూడా ఫుల్ ఆక్యుపెన్సీతో నడిచినట్లుగా తెలుస్తోంది. శీతాకాలం ఈ విధంగా ప్రయాణం చేయడం ఇదే తొలిసారి అని ప్రముఖ ట్రావెల్ పోర్టల్ క్లియర్ ట్రిప్ వైస్ ప్రెసిడెంట్ గౌరవ్ పట్వారీ తెలిపారు. గతేడాది కంటే ఎక్కువగా ఈ శీతాకాలం ప్రయాణికుల సంఖ్య పెరిగిందని చెప్పుకొచ్చారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ తాజా సమాచారం ప్రకారం 5, 05, 412 మంది ఆదివారం (నవంబర్ 17) ప్రయాణం చేసినట్లు పేర్కొంది. దాదాపు 3, 173 విమాన సర్వీసులు నడిచినట్లుగా తెలిపింది. మరోవైపు వివిధ కారణాల వల్ల ఆదివారం విమానాల సమయపాలన ప్రభావితం అయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఆదివారం ఇండిగో ఓటీపీ 74.2 శాతంగా ఉండగా.. అలయన్స్ ఎయిర్ 71%, ఆకాశ ఎయిర్ 67.6%, స్పైస్‌జెట్ 66.1%, ఎయిరిండియా 57.1% శాతంగా ఉంది. అక్టోబర్ 27 నుంచి 2024 మార్చి 29 వరకు వింటర్ సీజన్ కొనసాగుతుంది.

## ఎస్‌బీఐ మరింత విస్తరణ..

### త్వరలో 500 బ్రాంచ్‌లు ప్రారంభం


బ్యాంకుల వడ్డీ రేట్లు మరింత సరసమైన ధరకు అందుబాటులో ఉంచాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. 11వ ఎస్‌బీఐ బ్యాంకింగ్ మరియు ఎకనామిక్స్ కాన్‌క్లేవ్ 2024లో సీతారామన్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ రంగ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను మరింత విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి దేశవ్యాప్తంగా మరో 500 బ్రాంచీలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. దీంతో బ్యాంకు బ్రాంచీల సంఖ్య 23 వేలకు చేరుతుందన్నారు. 1921 నుంచి బ్యాంకు ఎలా విస్తరించిందో సీతారామన్ గుర్తుచేశారు. "అప్పట్లో మూడు ప్రెసిడెన్సీ బ్యాంకులను విలీనం చేసి ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 1955లో పార్లమెంట్‌లో చట్టం చేసి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా మార్చారు. 1921లో 250 బ్రాంచీలు ఉండగా.. ఇప్పుడా సంఖ్య 22,500కు పెరిగింది. వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి మరో 500 బ్రాంచీలు అందుబాటులోకి రానున్నాయి" అని ఆర్థిక మంత్రి వివరించారు. ప్రస్తుతం ఎస్‌బీఐకి 50 కోట్లకు పైగా కస్టమర్లు ఉన్నారని, దేశంలోని మొత్తం డిపాజిట్లలో ఈ బ్యాంకు వాటా 22.4శాతంగా ఉందని వెల్లడించారు. డిజిటల్ పెట్టుబడులు కూడా విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. రోజుకు 20 కోట్ల యూపీఐ లావాదేవీలను బ్యాంకు నిర్వహిస్తోందని తెలిపారు.

## వస్తున్నాయ్.. ఆర్‌బీఐ డేటా సెంటర్లు




ముంబై: ఆర్థిక సేవల రంగంలోని చిన్న కంపెనీలకు అందుబాటు ధరల్లో క్లౌడ్ డేటా స్టోరేజీ వసతి కల్పించడం లక్ష్యంగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) దేశంలో లోకల్ క్లౌడ్ డేటా స్టోరేజీ కేంద్రాలు ఏర్పాటు చేసే యోచనలో ఉంది. వీటిలో ఒకటి హైదరాబాద్‌లోను, మరొకటి ముంబైలోను ఏర్పాటు కావచ్చని తెలుస్తోంది. 2025లో ప్రయోగాత్మకంగా ఆర్‌బీఐ ఈ కార్యక్రమం చేపట్టనుంది. ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు ఈ వివరాలు వెల్లడించినట్లు రాయిటర్స్ కథనం పేర్కొంది. అయితే ఇది అత్యంత రహస్య సమాచారం కావడం వల్ల తమ పేర్లు వెల్లడించేందుకు వారు నిరాకరించారని కథనం తెలిపింది. ఇందుకోసం ఆర్‌బీఐ స్థానిక ఐటీ కంపెనీల సేవలు ఉపయోగించుకోనుంది. ఈ డేటా సెంటర్లను అమెజాన్ వెబ్ సర్వీసెస్, మైక్రోసాఫ్ట్ అజూరే, గూగుల్ క్లౌడ్, ఐబీఎం క్లౌడ్‌కు పోటీగా నిలుపుతారు. ఆసియాలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన భారత్‌లో క్లౌడ్ సర్వీసుల మార్కెట్ పరిమాణం 2023లో 830 కోట్ల డాలర్లుండగా (రూ.70,550 కోట్లు) 2028 నాటికి 2420 కోట్ల డాలర్లకు (రూ.2.06 లక్షల కోట్లు) చేరుతుందని ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్ అంచనా.

అయితే ఈ మార్కెట్లో విదేశీ సంస్థలే ఇప్పటి వరకు ఆధిపత్యం చలాయిస్తున్నాయి. రాబోయే కొద్ది నెలల్లో ఈ ప్రాజెక్టును స్వల్ప స్థాయిలో ప్రారంభించి తదుపరి దశలో దేశవ్యాప్తంగా విస్తరించాలన్నది తమ ప్రయత్నమని ఈ ప్రాజెక్టుపై పని చేస్తున్న సీనియర్ ఎగ్జిక్యూటివ్ తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న క్లౌడ్ డేటా సర్వీసులు భరించగల స్థితి తమకు లేదని భావించే బ్యాంకింగ్, ఆర్థిక సేవా రంగ సంస్థలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టు చేపట్టినట్టు ఆయన చెప్పారు. ఈ ప్రాజెక్టుకు కన్సల్టెంట్‌గా ఎర్నెస్ట్ అండ్ యంగ్‌ను (ఈవై) నియమించారు. తొలి దశలో ఈ వ్యవహారాలను ఆర్‌బీఐకి చెందిన పరిశోధన విభాగం ఇండియన్ ఫైనాన్షియల్ టెక్నాలజీ అండ్ అలైడ్ సర్వీసెస్ నిర్వహిస్తుంది. తదుపరి దశలో ప్రైవేటు రంగంలోని టెక్నాలజీ కంపెనీల భాగస్వామ్యంతో చేపడతారని ఆ వర్గాలు తెలిపాయి. అలాగే ప్రారంభ దశలో ప్రాజెక్టుకు కావలసిన పెట్టుబడిని ఆర్‌బీఐ వద్ద ఉన్న రూ.22,974 కోట్ల అసెట్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి సమకూర్చుతారు. తదుపరి దశలో ఇందులో ఈక్విటీ భాగస్వామ్యం తీసుకోవాలని ఆర్థిక సంస్థలను కేంద్ర బ్యాంక్ ఆహ్వానించనుంది.



## కొనసాగుతున్న ఒడుదొడుకులు.. నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్

దేశీయ స్టాక్ మార్కెట్‌లో ఒడుదొడుకులు కొనసాగుతున్నాయి. గత వారమంతా భారీ నష్టాలు కారణంగా లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైపోయింది. ఈ వారమైనా మార్పు ఉంటుంది అనుకుంటే.. ఈ వారం కూడా అదే తంతు కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లోని ప్రతికూల సంకేతాలు మన మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. సోమవారం ఉదయం నష్టాలతో ప్రారంభమైన సూచీలు.. చివరిదాకా అలాగే కొనసాగాయి. ఇక ముగింపులో సెన్సెక్స్ 241 పాయింట్లు నష్టపోయి 77, 339 దగ్గర ముగియగా.. నిఫ్టీ 78 పాయింట్లు నష్టపోయి 23, 453 దగ్గర ముగిసింది. నిఫ్టీలో ఎనర్జీ, హెల్త్‌కేర్, ఐటీ నష్టాలను చవిచూడగా.. ఆటో, ఎఫ్‌ఎంసీజీ స్వల్ప లాభాల్లో ముగిశాయి. అగ్రరాజ్యం అమెరికా ఎన్నికలకు ముందు అనిశ్చితి కారణంగా స్టాక్ మార్కెట్ ఒడుదొడుకులను ఎదుర్కొంది. ఎన్నికల తర్వాత డొనాల్డ్ ట్రంప్ జయకేతనం తర్వాత స్టాక్ మార్కెట్ భారీగా పుంజుకుంటుందని నిపుణులు భావించారు. నవంబర్ 6న అమెరికా ఎన్నికల ఫలితాల రోజున తప్ప.. ఇంకెప్పుడు మార్కెట్ పుంజుకోలేదు. వరుస నష్టాలను ఎదుర్కొంటుంది. ఇప్పటికే లక్షల కోట్ల పెట్టుబడిదారుల సంపద ఆవిరైపోయింది. ఈ వారమైనా సూచీలు పుంజుకుంటాయని ఆర్థిక నిపుణులు భావించారు. కానీ ఎక్కడా మార్పు చోటుచేసుకోలేదు. గత వారం ఉన్న ఒరవడే.. ఈ వారం కొనసాగుతుంది.

## అమెజాన్ హెడ్‌క్వార్టర్స్ తరలింపు..

### తీవ్ర అసంతృప్తిలో ఉద్యోగులు




ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. బెంగళూరులోని ప్రధాన కార్యాలయాన్ని మరొక చోటకు మార్చాలని నిర్ణయం తీసుకుంది. ఎయిర్‌పోర్టు సమీపంలోకి మారుస్తోంది. నిర్వహణ ఖర్చులను తగ్గించుకోవడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే హెడ్‌క్వార్టర్స్ తరలింపుపై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. బెంగళూరు నగర శివారులోకి 20 కి.మీ దూరంలోకి తీసుకెళ్లడంపై ఎంప్లాయిస్ నిరాశలో ఉన్నారు. కొత్త కార్యాలయానికి పగటిపూట వెళ్లాలంటే 80 నిమిషాల కంటే ఎక్కువ సమయం పడుతుందని ఆవేదన చెందుతున్నారు. అంతేకాకుండా ఉద్యోగులు షాపింగ్ మాల్స్, ఫైవ్-స్టార్ హోటల్స్, ఆస్పత్రి, స్కూల్స్, ఇతరత్రా సౌకర్యాలన్నీ కోల్పోనున్నారు. ఈ కారణాల చేత ఉద్యోగులంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. బలవంతంగానే ఉద్యోగులు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. అమెజాన్ ఇండియా హెడ్ క్వార్టర్స్ ప్రస్తుతం మల్లేశ్వరంలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ యాజమాన్యంలోని 30 అంతస్తుల భవనంలో 18 అంతస్తుల్లో దాదాపు 5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్వహిస్తోంది. ఇప్పుడు అమెజాన్ ఖాళీ చేస్తుండటంతో అంత భారీ విస్తీర్ణాన్ని కొత్తగా ఎవరు తీసుకుంటారో తెలియదు. ప్రస్తుతం చదరపు అడుగుకు రూ.250 చొప్పున చెల్లిస్తుండగా కొత్త భవనంలో మూడింట ఒక వంతు కంటే తక్కువే ఉంటుందని అంచనా. ఈ నేపథ్యంలోనే డబ్బు ఆదా చేసేందుకు కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

## భారీగా పెరిగిన బంగారం ధర



బంగారం, వెండి ధరల్లో హెచ్చుతగ్గులు కొనసాగుతున్నాయి. నాలుగు రోజుల క్షీణత తర్వాత సోమవారం బంగారం ధరలో పెరుగుదల నమోదైంది. దేశీయంగా గోల్డ్ మార్కెట్‌లోనూ బంగారం, వెండి ధరలు పెరిగాయి. 99.9 స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.660 వరకు పెరిగింది. ప్రస్తుతం అంటే నవంబర్ 18న రాత్రి 7 గంటల సమయానికి 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ.69,950 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.76,650ఉంది. గురువారం నాడు ఈ విలువైన మెటల్ 10 గ్రాములకు రూ.77,050 వద్ద ముగిసింది. వెండి కూడా కిలోకు రూ.1,810 పెరిగి రూ.92,000కి చేరుకోగా, గురువారం కిలో ధర రూ.90,190 వద్ద ముగిసింది. ప్రస్తుతం కిలో వెండి రూ.89,500 ఉంటే కొన్ని ప్రాంతాల్లో రూ.99,000 ఉంది. ఆల్ ఇండియా బులియన్ అసోసియేషన్ ప్రకారం.. గ్లోబల్‌గా బంగారానికి బలమైన ట్రెండ్, పెళ్లిళ్ల సీజన్‌లో నగల వ్యాపారులు, రిటైలర్‌ల నుంచి డిమాండ్ కూడా బంగారం ధరలపై ప్రభావం చూపిందని వ్యాపారులు తెలిపారు. గురునానక్ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక బులియన్ మార్కెట్లు మూతపడ్డాయి. వార్తా సంస్థ PTI ప్రకారం, MCXలో ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో డిసెంబర్ డెలివరీ కోసం బంగారం కాంట్రాక్టులు రూ. 621 లేదా 0.84 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.74,567 వద్ద ట్రేడయ్యాయి. ఎక్స్ఛేంజ్‌లో 10 గ్రాముల విలువైన మెటల్ రూ.732 లేదా 0.99 శాతం పెరిగి రూ.74,678కి చేరుకుంది. రష్యా - ఉక్రెయిన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తత కారణంగా బంగారంలో బలమైన పెరుగుదల ఉందని ఎల్‌కెపి సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ విపి రీసెర్చ్ అనలిస్ట్ జతిన్ త్రివేది అన్నారు. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో డిసెంబర్ డెలివరీ కోసం వెండి కాంట్రాక్టులు కూడా కిలోకు రూ.879 లేదా 0.99 శాతం పెరిగి రూ.89,300కి చేరాయి.

## రూ.213 కోట్ల భారీ జరిమానా..

### అప్పీల్‌కు వెళ్లనున్న మెటా




మార్క్ జుకర్‌బర్గ్ ఆధీనంలోని ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం ఫేస్‌బుక్ మాతృసంస్థ అయిన మెటాకు భారీ షాక్ తగిలింది. దాని అనుబంధ సంస్థ అయిన వాట్సాప్ ప్రైవసీ విధానం ద్వారా మార్కెట్ ఆధిపత్యాన్ని దుర్వినియోగం చేసిన కారణంగా కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా మెటా ప్లాట్‌ఫామ్‌కు భారీ జరిమానా విధించింది. అయితే, సీసీఐ నిర్ణయంపై మెటా తాజాగా స్పందించింది. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. సీసీఐ నిర్ణయంతో తాము ఏకీభవించడం లేదని తెలిపింది. 2021లో తీసుకొచ్చిన అప్‌డేట్ కారణంగా యూజర్ల వ్యక్తిగత గోప్యతకు ఎలాంటి భంగం వాటిల్లలేదని తెలిపింది. దీనిపై అప్పీల్‌కు వెళ్లే యోచనలో ఉన్నట్లు వెల్లడించింది. కాగా, ప్రైవసీ విధానానికి సంబంధించి 2021లో తీసుకొచ్చిన అప్‌డేట్ ప్రకారం.. వాట్సప్ సేవలను పొందడం కొనసాగించాలంటే, ఇందులో లభించే డేటాను మెటా కంపెనీలతో పంచుకునేందుకు వినియోగదారులు తప్పనిసరిగా అంగీకరించాలి. 2016 నాటి విధానం ప్రకారం.. ఈ విషయంలో వినియోగదారులదే తుది నిర్ణయం. అయితే, అందుకు భిన్నంగా కొత్త విధానాన్ని అమలు చేసినందుకు ఈ మెటాకు సీసీఐ ఫైన్ వేసింది. ఇలాంటి పద్ధతులు సరికాదని, తమ వివరాలను మెటాతో పంచుకోవాలా, వద్దా అని నిర్ణయించుకునే హక్కును వినియోగదారులకు ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా ఇవ్వాలని సీసీఐ స్పష్టం చేసింది. ఐదేళ్ల వరకు ప్రకటనల ప్రయోజనాల కోసం మెటా కంపెనీలతో యూజర్ డేటాను పంచుకోవడం నిలిపివేయాలని వాట్సాప్‌ను సీసీఐ ఆదేశించింది.

# జాతీయం – అంతర్జాతీయం

## డిసెంబర్ 6న ఢిల్లీ మార్చ్

### రైతు సంఘాలు



చండీగఢ్ : తమ డిమాండ్ల కోసం డిసెంబర్ 6న ఢిల్లీ మార్చ్ చేపట్టనున్నట్లు రైతు సంఘాలు సోమవారం ప్రకటించాయి. పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) చట్టబద్ధమైన హామీతో పాటు వివిధ డిమాండ్లను ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఢిల్లీ మార్చ్ చేపట్టనున్నట్లు రాజకీయేతర సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), కిసాన్ మజ్దూర్ మోర్చాలు ప్రకటించాయి. ఢిల్లీ చలో మార్చ్‌ను భద్రతా బలగాలు అడ్డుకోవడంతో.. ఫిబ్రవరి 13 నుండి రైతులు పంజాబ్ హర్యానా మధ్య శంభు, ఖనౌరీ సరిహద్దుల్లోనే నిరసన తెలుపుతున్న సంగతి తెలిసిందే. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత తాము ఢిల్లీ మార్చ్ చేపట్టాలని నిర్ణయించుకున్నామని మీడియానుద్దేశించి కెఎంఎం నేత సర్వన్ సింగ్ పంధేర్ పేర్కొన్నారు. తమ డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం రైతులతో ఎటువంటి చర్చలు జరపడం లేదని సర్వన్ సింగ్ మండిపడ్డారు. గత తొమ్మిది నెలలుగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని శాంతియుతంగా వేచి చూశామని, కానీ ఇప్పుడు వేరే అవకాశం లేకుండా పోయిందని అన్నారు. శంభు సరిహద్దు నుండి రైతులు దశల వారీగా ఢిల్లీ వైపు వెళతారని అన్నారు.

తాము 280 రోజులుగా రెండు సరిహద్దుల్లోనే ఉన్నామని, ఫిబ్రవరి 18 నుండి కేంద్రం తమతో ఎలాంటి చర్చలు జరపలేదని భారతీయ కిసాన్ యూనియన్ (షహీద్ భగత్ సింగ్)కు చెందిన తేజ్వీర్ సింగ్ పేర్కొన్నారు. పంటలకు ఎంఎస్‌పి చట్టబద్ధమైన హామీతో పాటు రైతులకు రుణమాఫీ, రైతులు, రైతు కార్మికులకు పెన్షన్ అందించాలని, విద్యుత్ చార్జీల పెంపు ఉండకూడదని,

2021 లఖింపూర్ ఖేరి హింసాకాండ కేసులో రైతులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని, బాధితులకు న్యాయం జరగాలని, భూసేకరణ చట్టం 2013 పునరుద్ధరణ, 2020–21 ఆందోళనలో మరణించిన రైతులకు, వారి కుటుంబాలకు పరిహారం ప్రకటించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## కోటీశ్వరులకు, పేదలకు మధ్య యుద్ధం



ముంబయి : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను కోటీశ్వరులు, పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధంగా కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ అభివర్ణించారు. ముంబయిలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి బిజెపి విభజన భాషను వాడుతోందని విమర్శించారు.

'ఎన్నికలలో ప్రధానాంశం నిరుద్యోగం. మహారాష్ట్రలో నిరుద్యోగం పెరిగిపోతోంది. ఏడు లక్షల కోట్ల రూపాయల విలువైన ఎనిమిది ప్రాజెక్టులు రాష్ట్రం నుండి తరలిపోతున్నాయి. ఫలితంగా ఐదు లక్షల ఉద్యోగాలకు మంగళం పాడుతున్నారు. ధారవిలో లక్ష కోట్ల రూపాయల విలువైన ముంబయి ప్రజల భూమిని ఒక వ్యక్తికి కట్టబెడుతున్నారు. వ్యవసాయోత్పత్తుల ధరలు పడిపోతున్నాయి. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు బిజెపి చేసిందేమీ లేదు. ధర్మయుద్ధం వంటి మాటలు చెబుతూ సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు.

వారికి మరో ప్రత్యామ్నాయం లేకే ఇలా చేస్తున్నారు' అని మండిపడ్డారు. బిజెపి చేస్తున్న ఈ ప్రయత్నాలు మహారాష్ట్ర ఓటర్లపై ఎలాంటి ప్రభావం చూపబోవని రాహుల్ చెప్పారు. మోడీ, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ, ధారవి పునరభివృద్ధి మ్యాప్ ఫొటోలతో ఉన్న ఖజానా పెట్టెను రాహుల్ ప్రదర్శిస్తూ 'ఈ సురక్షితమైన పెట్టె గురించే ఆయన ఆందోళన చెందుతున్నారు. భారత ప్రధాని మద్దతు లేకుండా అదానీ ప్రజల నుండి ధారవి భూమిని తీసుకోలేరు. ఇదే అసలైన ఎన్నికల ప్రచారాంశం' అని అన్నారు. ఆ వ్యాపారవేత్త ఓడరేవులు, విమానాశ్రయాలు, గనులు, ధారవి పునరభివృద్ధి ఇలా అన్ని ప్రాజెక్టులను సొంతం చేసుకుంటున్నారని ఆరోపించారు. మహారాష్ట్ర సంపదను రాష్ట్ర ప్రజలకు ఇవ్వాలా లేక ఒకే వ్యక్తికి కట్టబెట్టాలా అనేదే ఈ ఎన్నికలలో ప్రధాన ప్రశ్నగా నిలిచిందని తెలిపారు.

## తీవ్ర వాయుకాలుష్యం..

### ఢిల్లీని ఇంకా రాజధానిగా కొనసాగించాలా..?

దేశ రాజధానిలో వాయు కాలుష్యం ప్రమాదకరస్థాయిలో ఉన్న విషయం తెలిసిందే. గాలి నాణ్యత సూచీ ఏకంగా 500 మార్క్‌ను దాటినట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.వాయు కాలుష్యానికి తోడు రాజధాని నగరాన్ని దట్టమైన పొగమంచు కమ్మేయడంతో పరిస్థితి అధ్వానస్థాయికి చేరింది. వాయు కాలుష్యం కారణంగా ప్రజలు తీవ్ర అనారోగ్య పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రాజధానిలో గాలి కాలుష్యంపై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ స్పందించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఢిల్లీని రాజధాని నగరంగా కొనసాగించాలా..? అంటూ ప్రశ్నించారు. దిల్లీ ప్రపంచంలోని అత్యంత కాలుష్య నగరంగా నిలిచిందని థరూర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇక్కడ ప్రమాదకర కాలుష్య కారకాలు నాలుగు రెట్లు పెరిగినట్లు చెప్పారు. అత్యంత కాలుష్య నగరాల్లో రెండో స్థానంలో ఉన్న బంగ్లాదేశ్ రాజధాని ఢాకాతో పోలిస్తే.. ఢిల్లీలో ప్రమాదకర స్థాయి ఐదు రెట్లు అధికంగా ఉందన్నారు. రాజధానిలో గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా.

. కేంద్రం మాత్రం పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. నవంబర్ నుంచి జనవరి వరకూ ఈ నగరం నివాసానికి అనుకూలంగా ఉండడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మిగతా కాలంలోనూ ఇక్కడ జీవనం సాగించడం అంతంతమాత్రమేనన్నారు. ఇలాంటి పరిణామాల మధ్య ఢిల్లీని దేశ రాజధానిగా కొనసాగించాలా..? అంటూ శశిథరూర్ ప్రశ్నించారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్‌గా మారింది.

## రాబోయే ఐదు రోజుల్లో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి

న్యూఢిల్లీ : శీతాకాలంలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఇప్పటికే ఢిల్లీ, ముంబైల్లోని కొన్ని ప్రాంతాల్లో పొగమంచు కమ్మేస్తోంది. రాబోయే ఐదురోజుల్లో కూడా సాధారణ ఉష్ణోగ్రతలు 2–3 డిగ్రీల సెల్సియస్ తగ్గే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ప్రత్యేకించి పంజాబ్, హర్యానా, ఉత్తర రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు తగ్గి.. రాత్రి వేళల్లో, తెల్లవారుజామున మంచు కురిసే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. ఇక హిమాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కురిసే అవకాశం ఉంది. అలాగే మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో కూడా ఉష్ణోగ్రతలు తగ్గుతాయని ఐఎండి తెలిపింది. ప్రస్తుతం ఢిల్లీలో గాలినాణ్యతలు తీవ్రంగా పడిపోతున్నాయి. సోమవారం ఉదయానికి 484గా ఎక్యూఐ నమోదైందని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది. ముంబైలో కూడా ఎక్యూఐ స్థాయిలు పడిపోతున్నాయి. ఈరోజు ముంబైలో 147గా ఎక్యూఐ నమోదైందని మధ్యస్థ స్థాయిలో గాలి నాణ్యతలు నమోదయ్యాయని గాలి నాణ్యత వాతావరణ అంచనా, పరిశోధన వ్యవస్థ (ఎస్ఎఎఫ్ఎఆర్) తెలిపింది. ముంబైలోని కొన్ని ప్రాంతాల్లో బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బికెసి) వద్ద 153, అభినవర్ నగర్ 176, శాస్త్రి గార్డెన్ 225గా ఎక్యూఐ స్థాయిలు నమోదయ్యాయని, ఈ ప్రాంతంలో ఎక్యూఐ పూర్ కేటగిరిలో నమోదైనట్లు వాతావరణ శాఖ పేర్కొంది. ఇక ముంబైలో ప్రముఖ టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిఐఎస్ఎస్) 158, సెవ్రిలో 195గా గాలి నాణ్యతలు నమోదయ్యాయి.

## ఢిల్లీ కాలుష్యంపై సుప్రీం కీలక నిర్ణయం



ఢిల్లీలో పెరుగుతున్న కాలుష్యంపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ, నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లో 12వ తరగతి వరకు అన్ని పాఠశాలలనూ మూసివేయాలని ఆదేశించింది. కాలుష్య నియంత్రణకు ఎన్‌సిఆర్‌లోని రాష్ట్రాలు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు ఏం చేశారంటూ సర్వోన్నత న్యాయస్థానం ఢిల్లీ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఢిల్లీ, ఎన్‌సిఆర్ పరిధిలో కాలుష్యాన్ని నివారించేందుకు కఠిన చర్యలు అమలు చేయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ఆగ్రహించింది. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జిఆర్ఎపి) అమలు చేయకపోవడంపై సుప్రీంకోర్టు తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. యాక్షన్ ప్లాన్ కింద కాలుష్య నియంత్రణ చర్యలను అమలు చేయడానికి కొంత తక్షణ అవసరమని ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్‌కు సుప్రీంకోర్టు చెప్పింది. నాలుగో విడత ఎలాంటి ఆదేశాలు అడగకుండా తొలగించొద్దని కఠినమైన ఆదేశాలిచ్చింది. గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 300 కంటే ఎక్కువ పెరిగిపోతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించింది. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్–4ను తప్పనిసరిగా అమలు చేయాలని ఎన్‌సిఆర్ రాష్ట్రాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. మూడు రోజులు ఆలస్యం ఎందుకైందని అడిగింది. ఆంక్షలను పర్యవేక్షించేందుకు తక్షణమే టీమ్‌లను ఏర్పాటు చేయాలని, జిఆర్‌పిలో పేర్కొన్న చర్యలపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. తదుపరి విచారణ వరకు నివారణ చర్యలను కోర్టుకు సమర్పించాలని చెప్పింది. నిబంధనలు ఉల్లంఘనలపై ఫిర్యాదులను పరిష్కరించేందుకు యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని ఆదేశించింది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 450 కంటే తక్కువకు పడిపోయినప్పటికీ.. కోర్టు తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు యాక్షన్ ప్లాన్ అమలు కొనసాగుతుందని స్పష్టం చేసింది.

## సాధ్యమైనంత త్వరగా శాంతిభద్రతల పునరుద్ధరణ

న్యూఢిల్లీ : మణిపూర్‌లో నెలకొన్న భద్రతా పరిస్థితులు, సైనిక బలగాల మోహరింపుపై వరుసగా రెండో రోజైన సోమవారం కూడా కేంద్ర హెూం మంత్రి అమిత్ షా సమీక్ష జరిపారు. సాధ్యమైనంత త్వరలో మణిపూర్‌లో శాంతి భద్రతలను పునరుద్ధరించాల్సిందిగా ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అత్యత సున్నితంగా వున్న పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఐదు వేలమందితో కూడిన 50 కంపెనీల పారా మిలటరీ బలగాలను మణిపూర్‌కు తరలిస్తున్నట్లు కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. జిరిబమ్ జిల్లాలో తలెత్తిన హింస, ఘర్షణలు ఇతర ప్రాంతాలకు విస్తరించిన నేపథ్యంలో ఈ నెల 12న రాష్ట్ర బలగాలకు అదనంగా కేంద్ర బలగాలను పంపాలని ఆదేశాలు వెలువడ్డాయి. సిఎపిఎఫ్‌కు చెందిన 20 కంపెనీలు, సిఆర్‌పిఎఫ్‌కు చెందిన 15 కంపెనీలు, బిఎస్ఎఫ్‌కు చెందిన ఐదు కంపెనీలను కేంద్ర హెూం శాఖ తరలించిన సంగతి తెలిసిందే. వీటికి తాజా బలగాలు అదనం కానున్నాయి.



## జీశాట్-20 ప్రయోగం సక్సెస్

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో రూపొందించిన అత్యంత అధునాతన సమాచార ఉపగ్రహం జీశాట్–20 ప్రయోగం సక్సెస్ అయ్యింది. స్పేస్ఎక్స్ కు చెందిన ఫాల్కన్ 9 రాకెట్ ఈ జీశాట్–20ను నింగిలోకి విజయవంతంగా మోసుకెళ్లింది. అమెరికాలోని ఫ్లోరిడా కేప్ కెనావెరల్ వేదికగా ఈ ప్రయోగాన్ని చేపట్టారు. ప్రయోగం విజయవంతమైనట్టు ఇస్రో వాణిజ్య విభాగం న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ ఛైర్మన్, ఎండీ రాధాకృష్ణన్ దురరురాజ్ తెలిపారు. ప్రయోగాన్ని పర్యవేక్షించిన ఆయన.. జీశాట్–20 కచ్చితమైన కక్ష్యలోకి చేరింది అని వెల్లడించారు.

34 నిమిషాల పాటు ప్రయాణించిన తరువాత ఉపగ్రహాన్ని కక్షలోకి ప్రవేశపెట్టనున్నారు. అనంతరం హసన్‌లో ఉన్న ఇస్రో మాస్టర్ కంట్రోల్ ఫెసిలిటీ ఈ ఉపగ్రహాన్ని నియంత్రణలోకి తీసుకోనుంది. 4700 కిలోల బరువున్న ఈ ఉపగ్రహాన్ని మన రాకెట్‌లు తీసుకెళ్లేందుకు సాధ్యపడకపోవడంతో స్పేస్ ఎక్స్ ద్వారా ఇస్రో ప్రయోగించింది. జీశాట్–20 ఉపగ్రహం 14 ఏళ్ల పాటు సేవలు అందించనుంది. వాణిజ్య పరంగా ఇస్రో, స్పేస్ఎక్స్ మధ్య ఇదే తొలి ప్రయోగం. భారత్‌లోని మారుమూలు ప్రాంతాలు, అండమాన్ నికోబార్, లక్షద్వీప్ వంటి ద్వీపాల్లోనూ ఇంటర్నెట్ సేవలను అందించడమే ఈ ఉపగ్రహం లక్ష్యం. అంతేకాకుండా అడ్వాన్స్‌డ్ బ్యాండ్ ఫ్రీక్వెన్సీ లక్ష్యంగా ఇస్రో దీన్ని రూపొందించింది. జీశాట్–ఎన్2 ఉపగ్రహం ద్వారా విమానాల్లో వై–ఫై సేవలు మరింత విస్తృతం కానున్నాయి. ఈ ప్రయోగానికి వినియోగించిన 549 టన్నులుండే ఫాల్కన్ 9 బీ–5 రాకెట్‌లో రెండు దశల్లో పనిచేస్తుంది. ప్రయోగ వాహనం కక్ష్య వేగాన్ని అందుకోడానికి దాని రెండు విభిన్న దశలు వరుసగా ప్రొపల్షన్‌ను అందిస్తాయి. ఈ రాకెట్ 8,300 కిలోల వరకు బరువున్న ఉపగ్రహాలను జియోసింక్రోనస్ కక్ష్యకు, 22,800 కిలోల శాటిలైట్స్‌ను భూమి దిగువ కక్ష్యకు చేర్చగలదు.

## ఇక రష్యాతో ప్రత్యక్ష యుద్ధమే !

వాషింగ్టన్ : మరో రెండు నెలల్లో దిగిపోనున్న బైడెన్ ప్రభుత్వం ఉక్రెయిన్ యుద్ధాన్ని మరింత ఎగదోసే చర్యలను ముమ్మరం చేసింది. శక్తివంతమైన అమెరికన్ దీర్ఘ శ్రేణి క్షిపణులను రష్యాపై ప్రయోగించేందుకు ఉక్రెయిన్‌కు అనుమతి ఇచ్చింది. అమెరికా అందించే దీర్ఘశ్రేణి క్షిపణులను రష్యా నగరాలపై ఉపయోగించేందుకు అనుమతించడమంటే యుద్ధాన్ని మరింత విస్తరింపజేయడమే. ఈ చర్య ద్వారా ఉక్రెయిన్ యుద్ధం విస్తరింపజేయడమే అమెరికా ధ్యేయమని బైడెన్ ప్రభుత్వం చాటదలచుకుంది. అధికార బదలాయింపు ప్రక్రియ సాఫీగా సాగించే విషయమై అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్‌తో సమావేశమైన తర్వాత కొద్ది రోజులకే బైడెన్ ఈ చర్య తీసుకోవడం గమనార్హం. ట్రంప్ కూడా దీనిపై నోరు మెదపకపోవడాన్ని బట్టి బైడెన్ చర్యకు ఫాసిస్టు ట్రంప్ మద్దతు కూడా ఉన్నట్టు భావించాల్సి వస్తోంది. దీంతో రష్యా విధించిన లక్ష్మణరేఖను అమెరికా అతిక్రమించినట్లైంది. అదే గనక జరిగితే ఇదంతా రష్యాకు, నాటో దేశాలకు మధ్య ప్రత్యక్ష యుద్ధానికి దారి తీస్తుందని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇదివరకే హెచ్చరించారు. రష్యాకు మద్దతుగా ఉన్న ఉత్తర కొరియా బలగాలపై కూడా ఇజ్రాయిల్ ఈ దీర్ఘ శ్రేణి క్షిపణులను ప్రయోగించవచ్చని బైడెన్ చెప్పారు. అదే గనుక జరిగితే 1953లో కొరియా యుద్ధం ముగిసిన తర్వాత ఉత్తర కొరియా బలగాలపై అమెరికా ఆయుధాలతో జరిగే మొదటి దాడి ఇదే అవుతుంది. బైడెన్ ప్రభుత్వం ఆదివారం దీనిపై ప్రకటన జారీ చేసింది. రష్యాలోని కుర్స్క్ ప్రాంతంలో రష్యా, ఉక్రెయిన్ బలగాలపై ఆర్మీ టాక్టికల్ మిస్సైల్ సిస్టమ్ (ఎటిఎసిఎంఎస్) లను ఉక్రెయిన్ ఉపయోగించడానికి అనుమతి మంజూరు చేసింది. ప్రభుత్వం తాజాగా చేసిన ఈ ప్రకటనతో రష్యా నగరాలపై ముఖ్యంగా యుద్ధ రంగానికి దూరంగా గల ప్రాంతాలపై అంటే మాస్కోతో సహా ఇతర పట్టణాలు, నగరాలపై దాడులకు అమెరికా, బ్రిటీష్, ఫ్రెంచ్ దీర్ఘశ్రేణి ఆయుధాలు ఉపయోగించడానికి మార్గం సుగమం అయిందని అమెరికా అధికారులు స్పష్టం చేశారు.

## హసీనాను అప్పగించాలని భారత్‌ను కోరతాం



పదవీచ్యుతురాలైన బంగ్లా ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలని భారత్‌ను తమ ప్రభుత్వం కోరుతుందని బంగ్లాదేశ్ తాత్కాలిక నేత, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహ్మద్ యూనస్ చెప్పారు. ఈ ఏడాది ఆగస్టులో దేశంలో తిరుగుబాటు జరగడంతో భారత్ వెళ్ళిన ఆమె అప్పటి నుండి అక్కడే వున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజుల పూర్తయిన సందర్భంగా యూనస్ దేశ ప్రజలనుద్దేశించి టివిలో ప్రసంగించారు. హసీనా 15ఏళ్ల పాలనకు చరమగీతం పలికిన విద్యార్థుల ఆందోళనల్లో వందలాదిమంది మరణించారు.

దానికి కారకులైన వారిని పట్టుకునేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కేవలం మరణాలే కాకుండా ఆమె పాలనా సమయంలో మానవ హక్కుల ఉల్లంఘనలు, అదృశ్యమవడాలు వంటివి కూడా చోటు చేసుకున్నాయన్నారు. వాటన్నింటిపై కూడా దర్యాప్తు చేపడతామన్నారు. ఇందుకోసం హసీనాను అరెస్టు చేసేందుకు ఇంటర్‌పోల్ సాయం కోరతామన్నారు. కొత్తగా ఎన్నికలు నిర్వహించి ఎన్నికైన ప్రభుత్వానికి అధికారాన్ని అప్పగించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అయితే ఇందుకు కాలపరిమితిని ప్రకటించలేదు. ఎన్నికల వ్యవస్థతో సహా వివిధ రంగాల్లో సంస్కరణలు తీసుకురావాలన్నారు. అవి పూర్తయితే అప్పుడు కొత్త ఎన్నికలకు ప్రణాళిక రూపొందుతుందన్నారు.

## త్వరలో విడుదల కానున్న లెబనాన్

### స్వాతంత్ర్య పోరాట యోధుడు అబ్దుల్లా



యూరప్‌లో సుదీర్ఘ కాలం రాజకీయ ఖైదీగా వున్న సామ్రాజ్యవాద వ్యతిరేక, పాలస్తీనా అనుకూల లెబనాన్ స్వాతంత్ర పోరాట యోధుడు జార్జెస్ ఇబ్రహీమ్ అబ్దుల్లాను విడుదల చేయాలని ఫ్రెంచ్ కోర్టు ఈ నెల 15న ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు ఆయన డిసెంబరు 6న విడుదలవుతారు. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా అబ్దుల్లా ఫ్రాన్స్ వదిలి వెళ్ళిపోవాలి, మళ్లీ ఎన్నడూ తిరిగి రాకూడదు. కాగా ఈ విడుదల ఆదేశాలు తాము సాధించిన న్యాయపరమైన, రాజకీయ విజయంగా అబ్దుల్లా తరపు న్యాయవాది జేన్ లూయిస్ చాలన్‌సెట్ వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా వామపక్ష కార్యకర్తలు, న్యాయవాదులు, మానవ హక్కుల సంఘాలు ఈ నిర్ణయం కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. కాగా, అబ్దుల్లా విడుదలను తాము అప్పీల్ చేయనున్నట్లు ఫ్రెంచ్ యాంటీ టెర్రరిజం ప్రాసిక్యూటర్ ప్రకటించారు. ప్రతిఘటనకు నిలువెత్తు రూపంగా అబ్దుల్లాను ఆయన మద్దతుదారులు చూస్తారు. ఫ్రాన్స్, ఇజ్రాయిల్, అమెరికాల నుండి తీవ్రంగా ఒత్తిళ్లు ఎదురైనా లొంగిపోవడాన్ని ఆయన ఎన్నడూ అంగీకరించలేదు. 1999లో కనీస యావజ్జీవ శిక్షనుపూర్తి చేసుకున్నా ఆయనను విడుదల చేయడానికి కోర్టు అంగీకరించలేదు. పెరోల్ కోసం పెట్టుకున్న విజ్ఞప్తులను కూడా తోసిపుచ్చింది. ఫ్రాన్స్ నుండి వెళ్ళిపోయే పక్షంలో విడుదల చేస్తామని చెప్పింది. ఆ మేరకు ఆదేశాలు వెలువడ్డాయి.

# చక్కని ఆరోగ్యం

## రోజూ కాజు తింటే ఏమవుతుంది..!

జీడిపప్పు తినడం వల్ల ఎక్కువ కేలరీలే శరీరానికి అందుతాయి. కేలరీలు ఎక్కువగా ఉన్నప్పటికీ జీడిపప్పులు బరువు తగ్గడంలో సహాయపడతాయంటున్నారు పోషకాహార నిపుణులు. జీడిపప్పు ఇతర నట్స్‌లో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇవి జీవక్రియను వేగవంతం చేయడానికి, కొవ్వును కాల్చడానికి సహాయపడతాయి. ఇవి మిమ్మల్ని ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచుతాయి. కాబట్టి, బరువు తగ్గడానికి ప్రయత్నించే వారికి కాజు అద్భుతమైన చిరుతిండి. అంతేకాదు.. కాజులో ఎక్కువగా ప్రొటీన్, కొవ్వులు, మెగ్నీషియంలు ఉంటాయి.

దీన్ని తినడం వల్ల శరీరంలో మంచి కొవ్వుల నిల్వలు పెరుగుతాయి. కాజులో ఉండే అన్ శాచురేటెడ్, మోనో అన్ శాచురేటెడ్ కొవ్వుల వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. దీనిలోని మెగ్నీషియం రక్తపోటును నియంత్రిస్తుంది. జీడిపప్పులో లినోలెయిక్ యాసిడ్, పాల్మిటిక్ యాసిడ్, స్టియరిక్ యాసిడ్ లాంటి యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. జీడిపప్పులో విటమిన్ ఈతో పాటు యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఎక్కువగా ఉంటాయి. ఈ పోషకాలన్నీ శరీరంలో ఫ్రీ రాడికల్స్ వల్ల కణాలు దెబ్బతినకుండా కాపాడతాయి. కాజును తీసుకోవటం వల్ల ఎముకల ఆరోగ్యం, నరాల పనితీరు మెరుగుపడుతుంది.

అనారోగ్యాలతో బాధపడేవారు జీడిపప్పును క్రమంగా మితంగా తినడంతో ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.కాజులో రాగి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నందున మీ చర్మానికి ప్రకాశవంతంగా, మెరిసే రూపాన్ని అందించడంలో సహాయపడుతుంది. జీడిపప్పు గింజల నుండి తయారైన జీడిపప్పు నూనె మీ చర్మానికి అద్భుతమైనది. జీడిపప్పు నూనెలో సెలీనియం, జింక్, మెగ్నీషియం, ఐరన్, ఫాస్పరస్ పుష్కలంగా ఉన్నాయి. వారు ప్రోటీన్లు, యాంటీఆక్సిడెంట్లు, ఫైటోకెమికల్స్ అద్భుతమైన ప్రొవైడర్లు కూడా. మెగ్నీషియం కొరత అనేక రకాల ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. కాజు రెగ్యులర్ ఉపయోగం మీ మెగ్నీషియం స్థాయిలు సమతుల్యంగా ఉండేలా చేస్తుంది. జీడిపప్పు తినడం వల్ల కలిగే ప్రధాన ప్రయోజనాల్లో ఒకటి క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.



## బాలింతలకు ఇచ్చే ఆహారంలో ఈ పదార్థం తప్పక చేర్చండి..



డెలీవరి తరువాత మహిళలకు మంచి పౌషికాహారం అందించాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. తాజా ఆకుకూరలు, పండ్లు, గుడ్లు,పాలు,చేపలు వంటివి తప్పనిసరిగా అందించాలని సూచిస్తున్నారు. అయితే, బాలింతలకు పెట్టే ఆహారంలో బంక లడ్డూలను కూడా చేర్చుకోవటం వల్ల మరింత ప్రయోజనం అంటున్నారు నిపుణులు. ఈ లడ్డూల తయారీకి ప్రత్యేకించి బంక దీనినే గోండ్ కటిరా, గోంద్ కతీరా అని పిలుస్తారు.. ఇది లడ్డూలకు ప్రత్యేక రుచిని అందిస్తుంది. డెలివరీ తర్వాత బాలింతలకు ఎంతో బలవర్ధకం అంటున్నారు. ప్రతి రోజూ ఉదయాన్నే ఇలాంటి లడ్డూలను తినిపిస్తుంటారు చాలా మంది పెద్దలు. ఇంతకీ ఈ గోండ్ కటిరా లాభాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.. గోంద్ కటిరా తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఇందులో ప్రోటీన్, కాల్షియం, డైటరీ ఫైబర్, మెగ్నీషియం వంటి అనేక మినరల్స్‌తో పాటు విటమిన్లు కూడా ఉంటాయి. గోండ్ కటిరా తీసుకోవడం జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇందులో ఉండే డైటరీ ఫైబర్ గట్ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇందులో ఉండే, ప్రొటీన్ మీ కండరాలను ఆరోగ్యంగా ఉంచడంలో మేలు చేస్తుంది. కణజాలాలను రిపేర్ చేయడంలో సహాయపడుతుంది. ఇది శరీరానికి శక్తిని అందిస్తుంది. రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడంలో, అంటువ్యాధులకు వ్యతిరేకంగా పోరాడటంలో సహాయపడతాయి. వేసవిలో అరికాళ్లు, కాళ్ల మంట సమస్య ఉన్నవారు గోండు కటిరను తీసుకోవడం వల్ల మేలు జరుగుతుంది. గోండ్ కటిరా తినడం వలన చర్మం, జుట్టుకు కూడా మేలు చేస్తుంది. ఇది ముఖం పై మొటిమలను పోగొట్టడంలో, జుట్టు సమస్యలకు చికిత్స చేయడంలో ప్రయోజనకరంగా ఉంటుంది. గోండ్ కటీరా చర్మాన్ని హైడ్రేట్ గా ఉంచడానికి చర్మం పొడిబారడం, దురదను తగ్గించడంలో సహాయపడుతుంది. గోండ్ కటిరా కూడా చాలా వరకు ఒత్తిడిని తగ్గించడంలో ప్రయోజనకరంగా పనిచేస్తుంది. శరీరంలో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది.

## రోజూ చిటికెడు వాడితే చాలు.. సమస్యలన్నీ పరార్..!

లవంగాలు, సాజీరా, యాలకులు, దాల్చిన చెక్క, జాజికాయ, జాపత్రి ఇలాంటి సుగంధ ద్రవ్యాలు లేని భారతీయ వంటిల్లు ఉండదనే చెప్పాలి. ఇలాంటి మసాలా దినులెన్నో మన భారతీయులు పురాతన కాలం నుంచి పలు వంటకాల్లో ఉపయోగిస్తున్నారు. వాటిలో ఒకటై జాజికాయలతో వంటలకు చక్కని రుచి, సువాసన వస్తాయి. అయితే జాజికాయల వల్ల మనకు అనేక ఆరోగ్యకర ప్రయోజనాలు కలుగుతాయని మీకు తెలుసా..?అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం. జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడేవారికి జాజికాయ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇందులోని ఫైబర్ కంటెంట్ ఉబ్బరం, గ్యాస్, అజీర్ణం నుంచి ఉపశమనం కల్పిస్తుంది. మెదడు ఆరోగ్యాన్ని




రక్షించేందుకు జాజికాయ ఉపయోగపడుతుంది. ఇందులోని యాంటీ యాక్సిడెంట్స్ ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి మెదడు కణాలను రక్షించడంలో సహాయపడతాయి.

కండరాల నొప్పిని దూరం చేయడంలో కూడా జాజికాయ కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇందులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఆర్థరైటిస్‌తో పాటు నొప్పిని దూరం చేస్తుంది.నిద్రలేమి సమస్యలతో బాధపడేవారికి కూడా జాజికాయ బాగా పనిచేస్తుంది. ఇందులోని మెగ్నీషియం, మిరిస్టిసిన్ వంటి సమ్మేళనాలు ఒత్తిడిని దూరం చేయడంలో సహాయపడుతుంది. ఇందులోని మెగ్నీషియం, మిరిస్టిసిన్ వంటి సమ్మేళనాలు ఒత్తిడిని దూరం చేయడంలో సహాయపడుతుంది. నోటి దుర్వాసన సమస్యకు కూడా జాజికాయ బెస్ట్ ఆప్షన్‌గా చెప్పొచ్చు. ఇందులోని యాంటీమైక్రోబయల్ లక్షణాలు నోటి దుర్వాసనను తరిమి కొట్టడంలో ఉపయోగడుతుంది. గుండె సంబంధిత సమస్యలను దూరం చేయడంలో జాజికాయ ఉపయోగపడుతుంది. జాజికాయ పొడి శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలును తగ్గిస్తాయి. రక్తనాళాల్లో పేరుకుపోయిన కొవ్వును కరిగిస్తుంది. కిడ్నీ ఆరోగ్యానికి జాజికాయ బెస్ట్ ఆప్షన్‌గా పనిచేస్తుంది. జాజికాయ పొడిని తీసుకోవడం వల్ల లివర్, కిడ్నీల్లో పేరుకుపోయే వ్యర్థాలు బయటకు వెళ్లిపోతాయి. జాజికాయ నూనె నొప్పులకు బాగా పనిచేస్తుంది. కీళ్ల నొప్పులు, వాపులు తగ్గుతాయి.

## రోజూ ఖాళీ కడుపుతో లవంగాలు తింటే లాభమా?

నోటిపూత, గొంతు నొప్పికి లవంగం ఔషధం. రోజూ లవంగాలు తీసుకోవడం వల్ల ఆర్థరైటిస్ నొప్పిని గణనీయంగా తగ్గించుకోవచ్చు. లవంగాలను రెగ్యులర్ గా తీసుకోవడం వల్ల గ్లూకోజ్ స్థాయిలు తగ్గుతాయి.లవంగాలను నమలడం వల్ల గొంతు నొప్పి తగ్గుతుంది. లవంగాలలోని ఔషధ గుణాలు కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. కాలేయ సంబంధిత సమస్యలు తగ్గుతాయి. ఖాళీ కడుపుతో లవంగాలను నమలడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. ఖాళీ కడుపుతో లవంగాలను తీసుకోవడం వల్ల ఇన్ఫెక్షన్‌లతో పోరాడి రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చు. నోటి ఆరోగ్యాన్ని మెరుగుపరిచే యాంటీ బాక్టీరియల్, యాంటీ సెప్టిక్ గుణాలు లవంగాలలో పుష్కలంగా ఉన్నాయి. లవంగాలలో సాంప్రదాయ ఔషధ గుణాలు ఉన్నాయి. ఇది పంటి నొప్పి, నోటి ఇన్ఫెక్షన్లను తగ్గిస్తుంది. లవంగాలు జీర్ణక్రియను మెరుగుపరిచే జీర్ణ ఎంజైమ్‌లను కలిగి ఉంటాయి. లవంగాలలో ఫైబర్, మాంగనీస్, విటమిన్ సి, కె ఉంటాయి. మాంగనీస్ మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. ఎముకలను బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. లవంగాలలో ఉండే యాంటీమైక్రోబయల్ లక్షణాలు



తిమ్మిర్లు, అలసట, విరేచనాలు వంటి వ్యాధులకు కారణమయ్యే బ్యాక్టీరియా పెరుగుదలను నియంత్రిస్తాయి. లవంగం నూనె చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు కూడా బాగా పనిచేస్తుంది. లవంగాలలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఇన్ఫెక్షన్లకు కారణమయ్యే బ్యాక్టీరియా వృద్ధిని నిరోధిస్తాయి. లవంగం నూనె బ్రాంకైటిస్, ఆస్తమా, ఇతర శ్వాసకోశ సమస్యలు, జలుబు, దగ్గు నుండి ఉపశమనం కలిగిస్తుంది.

## రోజూ ఓ కప్పులాగించేయండి..

### అనారోగ్య సమస్యలన్నీ మటుమాయం!

స్వీట్‌కార్న్‌లో యాంటీ ఆక్సిడెంట్‌లు అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి క్యాన్సర్‌కు కారణమయ్యే ఫ్రీరాడికల్స్‌ను శరీరంలోంచి తరిమికొడతాయి. ముఖ్యంగా బ్రెస్ట్, లివర్ క్యాన్సర్‌కు చెక్ పెట్టడంలో యాంటీ ఆక్సిడెంట్స్ కీలక పాత్ర పోషిస్తాయి.స్వీట్‌కార్న్‌లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. వీటిలో ఉండే పీచు పదార్థం జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం, పైల్స్‌తో బాధపడుతున్న వారికి ఈ స్వీట్‌కార్న్ దివ్యౌషధంగా చెప్పాలి. స్వీట్‌కార్న్‌లో ఫాస్పరస్, మెగ్నీషియం, మ్యాంగనీస్, ఐరన్, కాపర్, జింక్ వంటి ఖనిజాలు.. ఎముకలు, కిడ్నీల పనితీరు మెరుగుపడేలా చేస్తాయి. అంతేకాదు.. స్వీట్‌కార్న్‌లలో ఉండే విటమిన్-సి, కెరోటినాయిడ్స్, బయోఫ్లెవనాయిడ్స్ గుండె పనితీరును మెరుగుపరుస్తాయి. వీటిలో ఉండే విటమిన్ బి-12, ఐరన్, ఫోలిక్ యాసిడ్‌లు రక్తహీనతకు చెక్ పెడుతాయి. హైబీపీ ఉన్నవారు వీటిని తినడం మంచిది. స్వీట్‌కార్న్ తిన్నాకూడా చాలా వేగంగా జీర్ణమవుతుంది. కాబట్టి శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. అధిక ఒత్తిడితో ఇబ్బంది పడుతున్న వారికి స్వీట్ కార్న్ మంచి మందులా పనిచేస్తుంది. అందులో ఉండే ఫినోలిక్ ఫైటో కెమికల్స్ హైపర్ టెన్షన్‌ను తగ్గిండచంలో బాగా పనిచేస్తాయి. స్వీట్‌కార్న్‌లలో ఉండే విటమిన్-సి, కెరోటినాయిడ్స్, బయోఫ్లెవనాయిడ్స్ గుండె పనితీరును మెరుగుపరుస్తాయి. వీటిలో ఉండే విటమిన్ బి-12, ఐరన్, ఫోలిక్



యాసిడ్‌లు రక్తహీనతకు చెక్ పెడుతుంది. స్వీట్ కార్న్‌లో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి పుష్కలంగా ఉన్నాయి. ఇది మీ కణాల నష్టం, క్యాన్సర్ నుండి రక్షిస్తుంది.స్వీట్ కార్న్‌లో కెరోటినాయిడ్స్, లుటిన్ ఉంటాయి. దీని వల్ల కంటిశుక్లం వచ్చే ప్రమాదం తగ్గుతుంది. కంటి సంబంధ సమస్యలు రాకుండా చూస్తాయి. స్వీట్ కార్న్‌లో ఉండే విటమిన్ బి1 జ్ఞాపకశక్తిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మెదడును చురుగ్గా ఉంచుతుంది. మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. స్వీట్ కార్న్ తినడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. స్వీట్ కార్న్ కూడా చర్మానికి ఎంతో మేలు చేస్తుంది.

## భోజనానికి ముందు ఈ పండు తింటే

### రక్తంలో చక్కెరకు చెక్ !

స్టార్ ఫ్రూట్ కూడా పోషకాలు గని అని చెప్పొచ్చు. ఈ పండులో విటమిన్ సి, బి2, బి6, బి9 విటమిన్లు, ఫైబర్, పొటాషియం, జింక్, ఐరన్, కాల్షియం, సోడియం, ఫోలేట్, కాపర్, మెగ్నీషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలన్నీ మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. నక్షత్ర ఆకారంలో కనిపించే స్టార్‌ఫ్రూట్ జ్యూసీ జ్యూసీగా ఉంటుంది. బాగా పండిన పండ్లు పసుపురంగులోకి మారి తియ్యగా ఉంటాయి. పచ్చి పండ్లు పుల్లగా ఉంటాయి. ఈ పండులో ఎక్కువ శాతం ఫైబర్, తక్కువ కేలరీలను కలిగి ఉంటుంది. ఫైబర్ జీర్ణవ్యవస్థకు మంచిది. స్టార్ ఫ్రూట్స్ శరీరంలో కొలెస్ట్రాల్ పెరిగిపోకుండా అదుపులో ఉంచుతుంది. అంతేకాదు రక్తంలో పేరుకున్న కొవ్వును కూడా తొలగిస్తుంది. పోషకాలతో నిండిన స్టార్‌ఫ్రూట్.. తక్కువ కేలరీలు కలిగి ఉండి, బరువు తగ్గడానికి దోహదం చేస్తుంది. జీవక్రియను పెంచుతుంది. శరీరంలోని ఎక్కువ కేలరీలను బర్న్ చేయడంలో సహాయపడుతుంది. సోడియం, పొటాషియం, ఇతర ఖనిజాలతో సమృద్ధిగా ఉన్న స్టార్‌ఫ్రూట్స్ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. స్టార్ ఫ్రూట్‌లో విటమిన్ సితో పాటు, యాంటీఆక్సిడెంట్ కంటెంట్ మెండుగా ఉంటుంది. ఈ కాంబినేషన్ ఇమ్యూనిటీని బూస్ట్ చేస్తుంది. ఈ పండులో మెగ్నీషియం, ఐరన్, జింక్, మాంగనీస్, పొటాషియం, ఫాస్పరస్ పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆనారోగ్యాలు రాకుండా రక్షిస్తాయి. ఇది పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మలబద్ధకంతో బాధపడేవారికి.. ఔషధంలా పనిచేస్తుంది. స్టార్ ఫ్రూట్‌లో విటమిన్ బి మెండుగా ఉంటుంది.

ఇది ఎముకలు, కండరాల పనితీరు, అభివృద్ధికి కీలకమైన పోషకం. ఇది జీవక్రియను నియంత్రిస్తుంది. హార్మోన్, ఎంజైమ్ స్థాయిలను సాధారణ పరిధిలో ఉండేలా చూసుకుంటుంది.



## షుగర్ పేషెంట్స్ దొండకాయ తినొచ్చా!

కూరగాయల్లో దొండకాయ కూడా ఒకటి. దొండకాయ అంటే చాలా మందికి నచ్చదు. కానీ దొండకాయలో ఉండే లాభాలు అన్నీ ఇన్నీ కావు. శరీర ఆరోగ్యానికి కావాల్సిన కొన్ని పోషకాలు.. దొండకాయలో లభిస్తాయి. దొండకాయలు తీసుకోవడం వల్ల పలు రకాల సమస్యలను తగ్గించుకోవచ్చు. అయితే దొండకాయ తింటే మతి మరుపు వస్తుందని చాలా మంది తినరు. ఇందులో ఎలాంటి వాస్తవం లేదు. దొండకాయ తినడం వల్ల ఊహించని లాభాలు ఉన్నాయి. కానీ దొండకాయలో ఎన్ని లాభాలు ఉన్నా.. జీర్ణ సంబంధిత సమస్యలు ఉన్నావరు, మెదడుకు సంబంధించిన సమస్యలతో బాధ పడేవారు దొండకాయలను తినకపోవడమే మంచిది. దొండకాయలోనే కాదు ఈ మొక్క ఆకులు, వేర్లలో కూడా పలు ఔషధ గుణాలు లభిస్తాయి. అయితే ఇన్ని హెల్త్ బెనిఫిట్స్ ఉన్న దొండకాయను షుగర్‌తో బాధ పడేవారు తినొచ్చా? తింటే ఏం జరుగుతుందో ఇప్పుడు తెలుసుకుందాం. ప్రస్తుత కాలంలో షుగర్‌తో బాధ పడేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది.



షుగర్‌ను కంట్రోల్ చేసుకోవడం తప్ప.. నయం చేయలేం. కాబట్టి పలు రకాల ఆహారాలు తినడం వల్ల హ్యాపీగా డయాబెటీస్ తగ్గించుకోవచ్చు. దొండకాయ తినడం వల్ల షుగర్ లెవల్స్ అనేవి కంట్రోల్ అవుతాయి. ఇందులో ఉండే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు.. శరీరంలో గ్లూకోజ్ నెమ్మదిగా గ్రహించేలా చేస్తాయి. అంతే కాకుండా సెన్సిటివిటీని కూడా పెంచి.. రక్తంలో షుగర్ లెవల్స్ పెరగకుండా చేస్తుంది. డయాబెటీస్‌తో బాధ పడేవారు తరచూ దొండకాయ తింటే.. రక్తంలో గ్లూకోజ్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు. దొండకాయలతో రసం కూడా తీసుకుని తాగవచ్చు. దొండకాయల ఆకుల రసం తీసుకున్నా కూడా డయాబెటీస్‌ను కంట్రోల్ చేయవచ్చు.

దొండకాయతో ఇతర ప్రయోజనాలు కూడా చాలానే ఉన్నాయి. దొండకాయ ఆకుల కషాయం తాగడం వల్ల జ్వరం, కామెర్లు, క్యాన్సర్ సమస్యలను తగ్గించుకోవచ్చు. ఆకులను ముద్దగా చేసి.. చర్మ సమస్యలను నయం చేయవచ్చు. దొండకాయ ఆకులు, కాండంతో కషాయం చేసి తాగితే దగ్గు, ఉబ్బసం వంటి వాటికి కూడా ఉపశమనం కలుగుతుంది. కడుపులో ఉండే పురుగులు బయటకు పోతాయి.

# సినిమా




## ఎట్టకేలకు ఎమర్జెన్సీ విడుదల ఖరారు

### కొత్త తేదీని ప్రకటించిన కంగనా రనౌత్

బాలీవుడ్ క్వీన్, మండి ఎంపీ కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఎమర్జెన్సీ' 1975-77 నాటి ఎమర్జెన్సీ పరిస్థితుల నేపథ్యంలో తెరకెక్కించిన ఈ సినిమాలో కంగనా రనౌత్.. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పాత్రను పోషించింది. ఆమె దర్శకురాలు కూడా. ఎప్పుడో విడుదల కావాల్సిన ఈ చిత్రం.. పలు వివాదాల కారణంగా వాయిదా పడుతూ వస్తోంది. అయితే, ఎట్టకేలకు తాజాగా ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ మేరకు ఈ సినిమా రిలీజ్ డేట్‌ను తాజాగా చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. వచ్చే ఏడాది జనవరి 17న 'ఎమర్జెన్సీ' చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు వెల్లడించింది. ఈ విషయాన్ని కంగనా రనౌత్ స్వయంగా ఎక్స్ వేదికగా ప్రకటించారు. 'భారత దేశంలో శక్తిమంతమైన మహిళ చరిత్ర, దేశ విధిని మార్చిన క్షణాలు వచ్చే ఏడాది జనవరి 17న మీ ముందుకు రాబోతున్నాయి' అంటూ పేర్కొన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 1972లో విధించిన ఎమర్జెన్సీ కాలంనాటి రాజకీయ పరిణామాల గురించి ఈ సినిమాలో వివరించారు.



## తేజ సజ్జా మిరాయిలో బాహుబలి యాక్టర్

హనుమాన్ ఫేం తేజసజ్జా హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా అడ్వెంచరస్ మూవీ మిరాయి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో ఢిల్లీ సుందరి రితికా నాయక్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. మంచు మనోజ్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. కాగా ఈ ప్రాజెక్టులో మరో టాలెంటెడ్ యాక్టర్ భాగం కాబోతున్నాడట. తాజా టాక్ ప్రకారం మిరాయిలో బాహుబలి యాక్టర్ రానా దగ్గుబాటి కీలక పాత్రలో నటిస్తున్నాడన్న వార్త బయటకు వచ్చింది. త్వరలోనే రానాకు సంబంధించిన సన్నివేశాలను షూట్ చేయబోతున్నారని ఇన్ సైడ్ టాక్. రానా ఎంట్రీపై మేకర్స్ అధికారిక ప్రకటన కూడా చేయనున్నారని తెలుస్తోంది. ఇదే నిజమైతే మరి కార్తీక్ దండు భళ్లాల దేవుడిని ఎలా చూపించబోతున్నాడన్నది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ స్పెషల్ సాంగ్‌లో మెరువనుందని తెలిసిందే. ఇప్పటికే రిలీజ్ చేసిన మంచు మనోజ్ మిరాయి లుక్ సినిమాపై హైప్ పెంచుతోంది. ఈ మూవీని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ తెరకెక్కిస్తున్నారు. గౌరా హరి సంగీతం అందిస్తున్న ఈ మూవీ 2025 ఏప్రిల్ 18న 2డీ, 3డీ వెర్షన్లలో ప్రపంచవ్యాప్తంగా వివిధ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. మేకర్స్ ఇప్పటికే లాంచ్ చేసిన మిరాయి టైటిల్ గ్లింప్స్ వీడియోకు మంచి స్పందన వస్తోంది.




## గూస్‌బంప్స్ తెప్పిస్తోన్న నయనతార టైటిల్ టీజర్

తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న భామల్లో టాప్‌లో ఉంటుంది నయనతార డెబ్యూ డైరెక్టర్ సెంథిల్ నల్లసామి దర్శకత్వంలో నయనతార నటిస్తోన్న తాజా చిత్రం Rakkayie. నయనతారకు బర్త్ డే విషెస్ తెలియజేస్తూ ఈ మూవీ టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు. నయనతార ఏడుస్తున్న పిల్లవాడికి పాలు తాగించి.. మరోవైపు వీరనారిగా రెండు చేతుల్లో ఆయుధాలు పట్టి సమరంలో పాల్గొంటున్న విజువల్స్ గూస్‌బంప్స్ తెప్పిస్తున్నాయి. పీరియాడిక్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ మూవీని డ్రమ్ స్టిక్స్ ప్రొడక్షన్స్, మూవీ వెర్సె ఇండియా సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. పాన్ ఇండియా బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి గోవింద్ వసంత సంగీతం అందిస్తున్నాడు. త్వరలోనే షూటింగ్, ఇతర వివరాలపై క్లారిటీ రానుంది.



## మహదేవ్ శాస్త్రిగా మోహన్ బాబు

టాలీవుడ్ యాక్టర్ మంచు విష్ణు కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం కన్నప్ప బాలీవుడ్ డైరెక్టర్ ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇప్పటికే సినిమాలోని పలు పాత్రలను పరిచయం చేసిన డైరెక్టర్ తాజాగా మోహన్ బాబు లుక్ షేర్ చేశాడు. ఇందులో మహదేవ్ శాస్త్రిగా కనిపించనున్నట్టు తెలియజేస్తూ ప్రీ లుక్ విడుదల చేశారు. ఫుల్ లుక్‌ను నవంబర్ 22న లాంచ్ చేయనున్నట్టు తెలియజేశారు. ఇందులో మోహన్ బాబు పాత్ర చాలా పవర్ ఫుల్‌గా ఉండబోతున్నట్టు ప్రీ లుక్ హింట్ ఇచ్చేస్తుంది. ఈ చిత్రంలో గ్లోబల్ స్టార్ ప్రభాస్, మోహన్ లాల్, నయనతార, మధుబాల, శరత్‌కుమార్, శివరాజ్‌కుమార్, ఐశ్వర్య కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే కన్నప్ప నుంచి లాంచ్ చేసిన టీజర్, పోస్టర్లు నెట్టింట చక్కర్లు కొడుతూ.. సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. ఇక కన్నప్ప నుంచి తిన్నడు, ముండడు, చండుడు, మారెమ్మ, పిలక-గిలక పాత్రలకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేయగా.. స్టిల్స్ ఆన్‌లైన్‌లో హల్ చల్ చేస్తున్నాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ యాక్టర్ అక్షయ్‌కుమార్ శివుడిగా కనిపించబోతున్నాడు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ, స్టీఫెన్ దేవసి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, బ్యానర్లపై సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ మూవీకి పరుచూరి గోపాలకృష్ణ, బుర్రా సాయిమాధవ్, తోట ప్రసాద్ స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు.



## మంగళం శ్రీనుతో చేతులు కలిపిన భన్వర్ సింగ్ షెకావత్

### 'పుష్ప 2' ట్రైలర్ డీకోడ్

పుష్ప 2 ట్రైలర్ విడుదలై సోషల్ మీడియాలో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. అయితే ఈ ట్రైలర్‌పై అటు యూట్యూబ్‌తో పాటు నెట్టింటా చర్చించుకుంటున్నారు అభిమానులు. కొందరు ఏమో ఈ ట్రైలర్ చూసి కథ మొత్తం ఇది చెబుతుండగా.. మరికొందరు సినిమాలో ఉన్న కీలకమైన విషయాలను పసిగడుతున్నారు. తాజాగా ఒక నెటిజన్ ఏకంగా పుష్ప ట్రైలర్‌ను డీకోడ్ చేశాడు. ఇందులో పుష్పతో గొడవ అయిన అనంతరం అతడిని అంతమొందించడానికి ఎస్పీ భన్వర్ సింగ్ షెకావత్ వెళ్లి మంగళం శ్రీనుతో చేతులు కలిపినట్లు తెలుస్తుంది. మరోవైపు పార్ట్ 2లో పుష్పకి ఫ్లాష్ బ్యాక్ ఉన్నట్లు తెలుస్తుంది. అలాగే ఈ సినిమాలో రెండు పెద్ద ఫైట్స్ ఉండబోతున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. ఇందులో ఒకటి గంగమ్మ జాతర ఫైట్ కాగా.. మరోకటి పోర్ట్ ఏరియాలో జరిగేది అని టాక్. అలాగే ఈ చిత్రంలో పుష్పకి చాలా దగ్గరైన వ్యక్తి చనిపోయినట్లు కూడా చూపించడం చూడవచ్చు. ఇవే కాకుండా కన్నడ నటుడు తారక్ పోన్నప్పకి అరగుండు కొట్టించి చెప్పులతో ఊరేగించే సీన్, డాలీ ధనంజయ సీన్, ఎర్రచందనం దుంగలుగా పేర్చి పుష్ప ఉండే సీన్స్ మూవీకి హైలైట్‌గా నిలవబోతున్నట్లు తెలుస్తుంది. అయితే పుష్ప ఏం చేస్తాడో తెలియాలంటే డిసెంబర్ 06 వరకు ఆగాల్సిందే.

# మణిపూర్‌కు మరో 50 సీఆర్‌పీఎఫ్ కంపెనీలు

న్యూఢిల్లీ: మణిపూర్‌లో మళ్లీ హింసాకాండ ప్రజ్వరిల్లడంతో అక్కడి పరిస్థితిపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రెండో రోజైన సోమవారంనాడు కూడా అత్యున్నత స్థాయి భద్రతా సమావేశంలో సమీక్షిమించారు. ఈశాన్య రాష్ట్రంలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుతుండంతో రాష్ట్రంలో భద్రతను మరింత పటిష్టం చేయాలని హోం శాఖ నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న భద్రతా పరిస్థితిని అమిత్‌షా సమీక్షించడంతో పాటు, ఎలాంటి పరిస్థితుల్లోనూ శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సీఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసు అధికారులకు ఆదేశాలిచ్చారు.

**అదనంగా 50 కంపెనీల సీఆర్‌పీఎఫ్ బలగాలు**

మణిపూర్‌కు అదనంగా 50 కంపెనీల సీఆర్‌పీఎఫ్ బలగాలను పంపించాలని కేంద్రం నిర్ణయించింది. ప్రస్తుతం 20 కంపెనీల సీఆర్‌పీఎఫ్ బలగాలు రాష్ట్రంలో మోహరించగా, తాజా నిర్ణయంతో 70 కంపెనీల సీఆర్‌పీఎఫ్ బలగాలు రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ బాధ్యతను తీసుకుంటాయి.

**ఆరుగురి ఊచకోతతో..**

గత ఏడాది మణిపూర్‌లో చెలరేగిన జాతుల ఘర్షణలో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పొగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉన్న తరుణంలో గత శనివారంనాడు తిరిగి హింసాకాండ చెలరేగింది. సాయుధ మిలిటెంట్లు ఆరుగురు గ్రామస్థులను కిడ్నాప్ చేసి ఊచకోత కోసి చంపడంతో ఒక్కసారిగా ఆందోళనలు పెల్లుబికాయి. నిరసనకారులు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లపై దాడులు చేసి, వాహనాలను తగులబెట్టారు.



సీఎం బీరేంద్ర సింగ్ ఇంటిపై కూడా దాడికి విఫలయత్నం చేశారు. నిరసనలు, ఆందోళనలను అదుపు చేసే క్రమంలో భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో జిరిబాం జిల్లాకు చెందిన 20 ఏళ్ల యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఆందోళనకారులు స్థానిక బీజేపీ, కాంగ్రెస్ కార్యాలయాల్లోకి చొరబడి ఆస్తుల విధ్వంసానికి పాల్పడ్డారు. ఫర్నిచర్‌ను దగ్ధం చేశారు. మణిపూర్‌లో సంక్షోభం ముదురుతుండటంతో శాంతిభద్రత వైఫల్యానికి నిరసగా బీజేపీ సారథ్యంలోని బీరేంద్ర సింగ్ ప్రభుత్వానికి నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) మద్దతును ఉపసంహరించుకుంది.

**మూడు కేసుల దర్యాప్తు ఎన్ఐఏకు..**

కేంద్ర హోం శాఖ ఆదేశాల మేరకు ఇటీవల మణిపూర్‌లో చెలరేగిన హింసాకాండకు సంబంధించిన మూడు కేసుల దర్యాప్తు బాధ్యతను నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) చేపట్టింది. వీటిలో కుకీ ఉగ్రవాదులకు, సీఆర్‌పీఎఫ్‌కు మధ్య ఇటీవల జరిగిన కాల్పులకు సంబంధించిన కేసు కూడా ఉంది. ఈ ఎన్‌కౌంటర్‌లో 11 మంది కుకీ ఉగ్రవాదులను బలగాలు మట్టుబెట్టాయి.

**మణిపూర్‌లో కొనసాగుతున్న ఉద్రిక్తతలు.. కాల్పుల్లో ఒకరు మృతి**

**ఇంఫాల్:** మణిపూర్‌లో ఉద్రికత్తలు కొనసాగుతున్నాయి. హింసాత్మకమైన జిరిబామ్ జిల్లాలో భద్రతా బలగాలు, నిరసనకారుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కాల్పుల్లో ఒక నిరసనకారుడు మరణించాడు. ఆదివారం రాత్రి పలువురు నేతల ఆస్తులు, పార్టీ కార్యాలయాలపై ఆందోళనకారులు దాడులు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అల్లర్లలో 21 ఏళ్ల అథౌబా చనిపోయినట్లు చెప్పారు. అయితే అతడిపై ఎవరు కాల్పులు జరిపారో అన్నది పోలీసులు స్పష్టం చేయలేదు. %కాగా, నిరసనకారుల గుంపును చెదరగొట్టేందుకు పోలీస్ ప్రత్యేక కమాండోలు ఆయుధాలు ప్రయోగించినట్లు జనం ఆరోపించారు. ఈ కాల్పుల్లో అథౌబా మరణించగా మరో ఇద్దరు గాయపడ్డారని నిరసనకారులు తెలిపారు. మరోవైపు మహిళలు, పిల్లలను కుకీ మిలిటెంట్లు హత్య చేయడంపై మణిపూర్‌లో నిరసనలు, హింసాత్మక సంఘటనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో స్కూళ్లు, కాలేజీలకు రెండు రోజులు సెలవు ప్రకటించారు. ఇంఫాల్ పశ్చిమ, తూర్పు జిల్లాల్లోని యూనివర్సిటీలు, కాలేజీలతో సహా అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలను మంగళవారం వరకు మూసివేస్తున్నట్లు ప్రభుత్వం సోమవారం ప్రకటించింది.

# అదానీ ప్రయోజనాల కోసమే బీజేపీ 'ఏక్ హై తో సేఫ్ హై' నినాదం

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఏక్ హై తో సేఫ్ హై' నినాదంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ విమర్శలు ఎక్కుపెట్టారు. మహారాష్ట్ర ప్రయోజనాల కంటే బిజినెస్ టైకూన్ గౌతమ్ అదానీ ప్రయోజనాలే ఆయనకు ముఖ్యమని అన్నారు. నవంబర్ 20న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సోమవారంనాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాహుల్ మాట్లాడారు. తన వాదనకు బలం చేకూర్చే రెండు పోస్టర్లను ఆయన ప్రదర్శించారు. మొదటి ఫోటోలో ప్రధాని మోదీ, అదానీ ఉన్నారు. దానిపై 'ఏక్ హై తో సేఫ్ హై' అనే క్యాప్షన్ ఉంది. ఒకరితో ఒకరు కలిసి ఉన్నంత వరకూ వారిద్దరూ సేఫ్‌గా ఉంటారని రాహుల్ ఈ ఫోటోపై వ్యాఖ్యానించారు. రెండో ఫోటోలో అదానీ గ్రూప్ వివాదాస్పద థారవి రీడవలప్‌మెంట్ ప్రాజెక్టుకు సంబంధించినది. సురక్షితంగా(సేఫ్) ఉండటం అంటే ముంబై సంపదకు సంబంధించిన విషయమని, బీజేపీ సారథ్యంలోని ప్రభుత్వం మద్దతుతో ఆ సంపదను అదానీ టార్గెట్ చేసుకున్నారని ఆరోపించారు. రాజకీయ యంత్రాగం యావత్తు థారవి రీడవలప్‌మెంట్ ప్రాజెక్టును ఒకే వ్యక్తికి (అదానీ) కట్టబెట్టాలనుకుంటోందని అన్నారు. థారవి రీడవలప్‌మెంట్ ప్రాజెక్టు అసంబద్ధమైన రీతిలో ఒక వ్యక్తికే ప్రయోజనం చేకూర్చిపెట్టేందుకు జరుగుతున్న ప్రయత్నమని,




టెండర్ల విధానంతో తాము ఏకీభవించడం లేదని, దేశంలోని అన్ని నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, దేశ సంపద ఒకే వ్యక్తికి కట్టబెడుతున్నారని రాహుల్ విమర్శించారు.

**టెండర్ రద్దు హామీకి కట్టుబడి ఉంటాం..**

'మహా వికాస్ అఘాడి' కూటమి అధికారంలోకి రాగానే థారవి ప్రాజెక్టు టెండర్‌ను రద్దు చేస్తామంటూ ఉద్ధవ్ థాకరే చేసిన వాగ్దానానికి తాము కట్టుబడి ఉంటామని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. మహారాష్ట్ర నుంచి కీలక పారిశ్రామిక ప్రాజెక్టులను గుజరాత్‌కు తరలించుకుపోయారని కూడా ఆయన ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక అవకాశాలకు ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే గండికొట్టారని అన్నారు. ఫాక్స్‌కాన్, ఎయిర్‌బస్ వంటి రూ.7 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను గుజరాత్‌కు తరలించారని, మహారాష్ట్రకు రావాల్సిన 5 లక్షల ఉద్యోగాలను కోల్పోయేలా చేశారని రాహుల్ ఘాటుగా విమర్శించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు రెండు సిద్ధాంతాలకు సంబంధించిన పోరాటమని, ఒక బిలియనీర్‌కు, పేదలకు మధ్య జరుగుతున్న పోరాటమని రాహుల్ అన్నారు. మహారాష్ట్ర ప్రజల ప్రయోజనాలకే కాంగ్రెస్ సారథ్యంలోని సారథ్యంలోని ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

**ఏమిటీ థారవీ ప్రాజెక్టు**

సెంట్రల్ ముంబైలోని 600 ఎకరాల ప్రైమ్ ల్యాండ్‌కు సంబంధించిన ప్రాజెక్టు ఈ థారవి డవలప్‌మెంట్ ప్రాజెక్టు. మహారాష్ట్ర ఎన్నికల్లో కీలకాంశంగా కూడా ఉంది. బీజేపీ సారథ్యంలోని మహాయుతి ప్రభుత్వం హయాంలో 2022లో ఈ రీడవలప్‌మెంట్ బిడ్‌ను అదానీ గ్రూప్ దక్కించుకుంది. అయితే కాంట్రాక్టు కేటాయింపులో పారదర్శకత లోపించిందంటూ విపక్షాలు ఈ నిర్ణయంపై ఆందోళన వక్తం చేశాయి. కాగా, స్లమ్ ప్రాంత వాసుల జీవన స్థితగతులు, మౌలిక వసతుల కల్పనకు దోహదపడే పడే ప్రాజెక్టు ఇదని బీజేపీ సమర్థిస్తోంది.

# ఢిల్లీలో బీజేపీ ఆపరేషన్... ఆప్ వికెట్లు డౌన్

**న్యూఢిల్లీ :** ఢిల్లీ మంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు కైలాష్ గెహ్లాట్ రాజీనామా చేశారు. ఈ మరేకు పార్టీ అధినేతఅరవింద్ కేజ్రీవాల్‌కు రాసిన లేఖలో తన రాజీనామాకు కారణాలు వివరించారు. ఇందులో కీలక ఆరోపణలు చేశారు. పార్టీ స్థాపించినప్పటి విలువలకు ఇప్పుడు జరుగుతున్న పరిణామాలకు చాలా వ్యత్యాసం ఉందని అభిప్రాయపడ్డారు. అందర్నీ ఏకం చేసిన విలువ నుంచి పార్టీ దూరమై సవాళ్లు ఎదుర్కొంటోందని అన్నారు. ప్రజల పట్ల పార్టీ నిబద్ధతను రాజకీయ ఆశయాలు అధిగమించాయని అన్నారు గెహ్లాట్. ఫలితంగా చాలా వాగ్దానాలు నెరవేరకుండా మిగిలిపోయాయని అన్నారు. యమునా నదిలో కాలుష్యం సమస్య, కేజ్రీవాల్ నివాసం పునరుద్ధరణలో అవకతవకలు, అంతర్గత విభేదాలు పార్టీని వీడటానికి కారణాలని ఆయన ప్రస్తావించారు."ఉదాహరణకు యమునా నదిని తీసుకోండి, ఇది స్వచ్ఛమైన నదిగా రూపాంతరం చెందుతుందని మేము వాగ్దానం చేసాం, కానీ ఆ పని చేయడానికి ఎప్పుడూ ముందుకు రాలేదు. ఇప్పుడు యమునా నది బహుశా గతంలో కంటే మరింత కలుషితమైంది," అని చెప్పారు, ఇప్పుడు 'షీష్మహల్' వంటి చాలా ఇబ్బందికరమైన వివాదాలు చుట్టుముడుతున్నాయి. ఇప్పుడు మేము ఆమ్ ఆద్మీ పార్టీలో ఉన్నామా అనే అనుమానం చాలా మందికి కలుగుతోంది," అన్నారాయన.

"ఢిల్లీ ప్రజలకు ప్రాథమిక సేవలను అందించడంలో మా సామర్థ్యాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. ఢిల్లీ ప్రభుత్వం కేంద్రంతో పోరాడటానికి ఎక్కువ సమయం వెచ్చిస్తే ఢిల్లీకి నిజమైన పురోగతి జరగదని ఇప్పుడు స్పష్టంగా తెలుస్తుంది" అని గెహ్లాట్ లేఖలో పేర్కొన్నారు. . ఈ పరిణామంపై స్పందించిన భారతీయ జనతా పార్టీ ఢిల్లీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవా... గెహ్లాట్



చాలా సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. కేజ్రీవాల్‌కు గెహ్లాట్ అద్దం చూపించారన్నారు.ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ శాసనసభకు ఎన్నికలు జరగనున్న వేళ గెహ్లాట్ రాజీనామా ఆమ్ ఆద్మీ పార్టీకి ఎదురుదెబ్బగా భావించవచ్చు. రవాణా, పరిపాలనా సంస్కరణలు, ఐటి, గృహం, స్త్రీడ శిశు సంక్షేమ శాఖలు నిర్వహిస్తున్నారు. ఢిల్లీలో వచ్చే ఫిబ్రవరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ తరుణంలో రాజకీయ మార్పులు ప్రారంభమయ్యాయి. మొన్నీ మధ్య జైలు నుంచి విడుదలైన కేజ్రీవాల్ తను రాజీనామా చేసి తన పార్టీ నేత అతిషీని ఢిల్లీ సీఎంగా కూర్చోబెట్టారు. మద్యం పాలసీలో అక్రమాల నుంచి అనేక ఆరోపణలు ఆప్‌ఆద్మీ ప్రభుత్వం మెడకు చుట్టుకుంటున్నాయి. ప్రచారంలో ఉన్న ఆరోపణలే అస్త్రంగా మలుచుకునేందుకు ప్రత్యర్థులు వ్యూహాలకు పదును పెట్టారు. కీలకమైన ఆప్ నేతలను తమ వైపు లాక్కునేందుకు బీజేపీ పావులు కదుపుతోంది. అందులో భాగంగానే గెహ్లాట్‌తో రాజీనామా చేయించినట్టు స్పష్టం అవుతుంది. ఆయన రాజీనామా చేశాడో లేదే బీజేపీ కూడా ఆయనకు పాజిటివ్‌గా స్పందించింది. దీంతో ఆయన రాజీనామా వెనకాల ఉన్నది ఎవరో స్పష్టమైందని ఆప్ విమర్శిస్తోంది.

## నెలన్నరలో 2,234 ఓవరేజ్ వాహనాలు సీజ్



దేశ రాజధాని ఢిల్లీలో అక్టోబర్ ఒకటి నుంచి నవంబర్ 15 మధ్య రవాణాశాఖ 2,234 ఓవరేజ్ వాహనాలను సీజ్ చేసింది. నేషనల్ క్యాపిటల్ రీజియన్ పరిధిలో కాలుష్యాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నది. గత కొద్ది రోజులుగా ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో గ్రేడెడ్ రెస్పాన్ యాక్షన్ ప్లాన్ మూడు, నాల్గో దశలను ప్రభుత్వం అమలు చేస్తున్నది. చేసిన ఓవరేజ్ వాహనాల్లో పదేళ్లకుపైగా 260 డీజిల్ ఫోర్ వీలర్లు ఉన్నాయని ఢిల్లీ రవాణా శాఖ పేర్కొంది. 15 ఏళ్లు పైబడిన 1,156 పెట్రోల్ ద్విచక్ర వాహనాలు, 818 పెట్రోల్ త్రీవీలర్స్, ఫోర్ వీలర్స్ సీజ్ చేసినట్లు చెప్పింది. ఈ డ్రైవ్ డిసెంబర్ వరకు కొనసాగుతుందని.. పర్యావరణ నిబంధనలను అమలు చేయడానికి, వాహనాల నుంచి వెలువడే ఉద్గారాలను తగ్గించే ప్రయత్నంలో భాగమని ఢిల్లీ రవాణా శాఖ పేర్కొంది. ఓవరేజ్ వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఢిల్లీ రవాణాశాఖ పోర్టల్‌ని ప్రారంభించింది. స్వాధీనం చేసుకున్న వాహనాలను స్క్రాప్ చేయడం, వెనక్కి తీసుకోవడం, విక్రయించడం సులభతరం చేయడం.. స్క్రాపింగ్ ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి, వాహన యజమానులకు అలాంటి వాహనాల నిర్వహణ కోసం స్పష్టమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ విధానాన్ని అందించేందుకు ప్లాట్‌ఫారమ్ ప్రారంభించారు. ఇటీవలి ఢిల్లీ హైకోర్టు ఆదేశాల ప్రకారం.. వాహనాలను నిర్వహించేందుకు 2024 మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని ఢిల్లీ రవాణా శాఖ రిజిస్టర్డ్ వెహికల్ స్క్రాపింగ్ ఫెసిలిటీస్‌కి ఆదేశాలు జారీ చేసింది. ఆర్డర్‌ను పాటించకపోతే ప్రోగ్రామ్ నుంచి మినహాయించబడవచ్చని పేర్కొంది. ఢిల్లీలో పది సంవత్సరాల కంటే పాత డీజిల్ వాహనాలు, 15 సంవత్సరాల కంటే పాత పెట్రోల్ వాహనాలపై నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాజధానిలో ఓవరేజ్ వాహనాలపై డ్రైవర్ నిర్వహిస్తూ వస్తున్నారు. 15 సంవత్సరాల కంటే పాత వాహనాలను బహిరంగ ప్రదేశాల్లో పార్కింగ్ చేయడాన్ని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సైతం నిషేధించింది. ఇప్పటి వరకు ఢిల్లీ రవాణాశాఖ 55 లక్షలకుపైగా ఓవరేజ్ వాహనాల రిజిస్ట్రేషన్ రద్దు చేసింది.

## దేశంలోనే మహారాష్ట్ర ధనిక రాష్ట్రం


దేశంలో కొన్ని రాష్ట్రాలు అభివృద్ధిలో దూసుకుపోతూ ఉంటాయి. వ్యవసాయం నుంచి భారీ పరిశ్రమల దాకా అన్ని రంగాల్లో ఉత్పత్తి పెరిగిపోతూ ఉంటుంది. ఆయా రాష్ట్రాల భౌగోళిక అనుకూలతలతోపాటు ప్రభుత్వ పరిపాలనా విధానాలు... ఈ అభివృద్ధికి దోహదపడుతుంటాయి. మరి మన దేశంలో 'రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్ డీపీ)' ఆధారంగా ధనిక రాష్ట్రాలు ఏవో తెలుసా? ఇటీవల ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి వెల్లడించిన గణాంకాల ప్రకారం...

**జీఎస్ డీపీలో టాప్ 10 రాష్ట్రాలు ఇవే...**

| రాష్ట్రం | జీఎస్ డీపీ |
|---|---|
| మహారాష్ట్ర | 42.67 లక్షల కోట్లు |
| తమిళనాడు | 31.55 లక్షల కోట్లు |
| కర్ణాటక | 28.09 లక్షల కోట్లు |
| గుజరాత్ | 27.90 లక్షల కోట్లు |
| ఉత్తరప్రదేశ్ | 24.99 లక్షల కోట్లు |
| పశ్చిమ బెంగాల్ | 18.8 లక్షల కోట్లు |
| రాజస్థాన్ | 17.8 లక్షల కోట్లు |
| తెలంగాణ | 16.5 లక్షల కోట్లు |
| ఆంధ్రప్రదేశ్ | 15.89 లక్షల కోట్లు |
| మధ్యప్రదేశ్ | 15.22 లక్షల కోట్లు |

## ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో కాలుష్యంపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం..!

**ఏం చర్యలు తీసుకున్నారంటూ సర్కారుపై ప్రశ్నల వర్షం..**



ఢిల్లీలో పెరుగుతున్న కాలుష్యంపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఢిల్లీ నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లో 12వ తరగతి వరకు అన్ని పాఠశాలలను మూసివేయాలని ఆదేశించింది. కాలుష్యం నియంత్రణకు ఎన్‌సీఆర్‌లోని రాష్ట్రాలు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు ఏం చేశారంటూ సర్వోన్నత న్యాయస్థానం ఢిల్లీ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (%+=ూ్రా%) అమలు చేయకపోవడంపై సుప్రీంకోర్టు తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. యాక్షన్ ప్లాన్ కింద కాలుష్య నియంత్రణ చర్యలను అమలు చేయడానికి కొంత తక్షణ అవసరమని ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్‌కు సుప్రీంకోర్టు చెప్పింది. నాల్గో విడత ఎలాంటి ఆదేశాలు అడగకుండా తొలగించొద్దని కఠినమైన ఆదేశాలు ఇచ్చింది. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్-4ని తప్పనిసరిగా అమలు చేయాలని ఎన్‌సీఆర్ రాష్ట్రాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆంక్షలను పర్యవేక్షించేందుకు తక్షణమే టీమ్‌లను ఏర్పాటు చేయాలని చెప్పింది. జీఆర్‌పీలో పేర్కొన్న చర్యలపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలని చెప్పింది. తదుపరి విచారణ వరకు నివారణ చర్యలను కోర్టుకు సమర్పించాలని చెప్పింది. నిబంధనలు ఉల్లంఘనలపై ఫిర్యాదులను పరిష్కరించేందుకు యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని ఆదేశించింది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 450 కంటే తక్కువకు పడిపోయినప్పటికీ.. కోర్టు తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు యాక్షన్ ప్లాన్ అమలు కొనసాగుతుందని స్పష్టం చేసింది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సైతం ఇందుకు సమ్మతి తెలుపుతూ నివేదికను దాఖలు చేయాలని ఆదేశించింది. కాలుష్యం లేని వాతావరణంలో జీవించడం ప్రజల హక్కు అని.. ఈ మేరకు పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే, పిటిషన్ తరఫు న్యాయవాది విద్యార్థుల తరగతులపై కోర్టు దృష్టికి తీసుకువెళ్లగా.. 12 తరగతి వరకు తరగతులను నిలిపివేయాలని చెప్పింది.

## పవన్ సభలకు పోటెత్తున్న జనం

**ముంబై :** జనసేన అధినేత పవన్ కల్యాణ్ మహారాష్ట్రలో రెండు రోజుల ప్రచారానికి వెళ్లారు. తొలి రోజు మూడు సభల్లో ప్రసంగించారు. తెలుగు మూలాలున్న ఓటర్లు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో పవన్ కల్యాణ్ ప్రచారం ప్లాన్ చేశారు. ఆయా జిల్లాలకు ఎన్నికల ఇంచార్జులుగా తెలుగు రాష్ట్రాల నేతలనే నియమించారు. గత నెల రోజులుగా వారు అక్కడ పని చేసుకుంటున్నారు. నాందేడ్ కు విష్ణువర్ధన్ రెడ్డి.. మరఠ్వాడాకు మధుకర్ ఇంచార్జులుగా వ్యవహరిస్తున్నారు. వీరు ఇంచార్జులుగా ఉన్న చోటనే పవన్ ప్రచారం చేస్తున్నారు.ప్రచారానికి వచ్చిన పవన్ కల్యాణ్‌కు ఏపీ బీజేపీ నేతలే స్వాగతం పలికారు. ఆయన ప్రసంగాలు కొద్దిగా మరాఠీతో పాటు తెలుగులోనే సాగాయి. పవన్ ప్రసంగాలకు అక్కడి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది.పవన్ కల్యాణ్ సినిమాలు మరాఠీభాషలోనూ డబ్ అవుతాయి. తెలుగు మూలాలున్న ఓటర్లు ఉండటంతో సహజంగానే పవన్ కల్యాణ్ కు ఎక్కువ క్రేజ్ ఉంది. బహిరంగసభలకు జనం పోటెత్తారు. పవన్ సభలను సక్సెస్ చేసేందుకు.. బీజేపీ అగ్రనేతల సభలకు దీటుగా జన సమీకరణ చేశారు. పవన్ కల్యాణ్ ప్రసంగం వారిలో జోష్ నింపింది. మహారాష్ట్ర ప్రజలను తాను ఓటు అడగడానికి రాలేదని వారికి గౌరవం ఇవ్వడానికి వచ్చానని చెప్పి ఆకట్టుకున్నారు. మహారాష్ట్రలో ఉన్న జాతీయవాదానికి అనుగుణంగా పవన్ కల్యాణ్ ప్రసంగాలు సాగాయి.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at Sai Sree Offset Printers, # 7-17-166, 3rd line, Srinagar, Guntur - 522002 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : **SIRIKONDA MARIA, RNI No. APTEL/2014/57702.** E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.